

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

వెల 4 అణాలు

1-2-1950

ఆంధ్రపత్రిక

స చి త్ర వా ర ప త్రి క

వి ష యా ను క్ర మ ణి క

1 ఫిబ్రవరి 1950



ఇండియా రిపబ్లిక్ అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చెయ్యటానికి రెండు గంటలముందు డా. రాజేంద్రప్రసాద్‌గారు రాజఘాట్‌లోని గాంధిసమాధి వద్దకు వెళ్లి మహాత్మునికి శ్రద్ధాంజలు లర్పించారు. రాజేన్‌బాబుకుడివైపున సర్దార్ పటేల్ ఉన్నారు.

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతికి
అణాలు 0-4-0

ప్రతిబుధవారము ప్రకటింపబడును.

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తనమనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథముల కెల్లన్.
(మహాభారతము)

Founder : K. NAGESWARA RAO.

సంపుటము **42**
సంచిక **22**

విరోధి సంవత్సర మాఘ శుద్ధ చతుర్దశి బుధవారము





ఆంధ్రపత్రిక

1950-వ సం॥ ఫిబ్రవరినెల 1-వ తేది బుధవారము

గాంధిజీవర్ధంతి

సర్వస్వతంత్ర భారతప్రజారాజ్యావతరణ ఉత్సవములు ముగిసిన మూడురోజులకు భారతీయులు అందరు జాతిపితద్వితీయవర్ధంతిని జరుపుకొన్నారు. జనవరి 26 భారత రిపబ్లిక్ అవతరణదినము జనవరి 30 జాతిపిత వర్ధంతిదినము అగుట కాకతాళీయము. కాని నాల్గురోజుల వ్యవధిలో ఈ రెండు ఉత్సవములు జరుపుకొనవలసివచ్చుట విధినిర్ణయమని విశ్వసింపక తప్పదు. భారతజాతిని పునరుజ్జీవింపజేసి, పరాధీనదేశమును సర్వాధికారసమన్విత స్వతంత్రప్రజారాజ్యముగ అవతరింపజేసి, బానిసప్రజకు ఆత్మగౌరవమును కల్గించి, అంధకారబంధురమైన 'అఖిలప్రపంచమునకు ఆశాజ్యోతియైన గాంధిమహాత్ముని వర్ధంతి స్వాతంత్ర్య దినముఅనంతరము వచ్చుటలో విశేషఔచిత్యము కలదు. తమ స్వాతంత్ర్యమునకు కారణభూతుడైన మహాత్ముని స్వాతంత్ర్యోత్సవసందర్భమున సంస్మరించుట సహజము; స్వాభావికము. ఆ సంస్మరణ మహాత్ముని వర్ధంతియుత్సవముతో పూర్ణత్వము పొందును.

పురాణపురుషులు స్వీయబలపరాక్రమమువలన దుష్టశక్తుల సంహారముచేసి శిష్టులను సంరక్షించిరి. గాంధిమహాత్ముడు పురాణపురుషుడయ్యు తన జీవితాశయసాధనకు పూర్తిగ భిన్నమైన మార్గమును అనుసరించెను. తనప్రాణత్యాగమువలన దుష్టశక్తులను సంహరించ యత్నించెను. సఫలు డయ్యెను. దుష్టశక్తుల సంహారము పూర్తియైనఅనంతరం శిష్టుల సంరక్షించుటకు మరొక శక్తి అవసరమే లేదు. గాంధిమహాత్ముడు ఈ విషయమునే ఋజువుచేసెను. ప్రజలుయావన్మంది, ప్రతిఒక్కరు సన్మార్గానువర్తులై స్వకీయధర్మనిర్వహణకు జీవితముల నంకిత మిచ్చి నిరంతరకృషి సలిపిన అజేయ మన్నది ఏమియు లేదని ప్రబోధించెను. తన ప్రబోధము ఆచరణ సాధ్యమని, లక్ష్యసిద్ధికి ప్రయోజనకరమైన సాధన అని ఋజువుచేసెను.

మొన్న మహాత్ముని ద్వితీయవర్ధంతి ఉత్సవములు దేశదేశముల జరిగినవి. రాజఘాట్‌కు భారతీయులు తీర్థయాత్ర చేసిరి. మహాత్ముని ప్రబోధముల ప్రాశస్త్యమును నాయకులు ప్రజలకు మరొక పర్యాయము వివరించిరి. "బాపుజీ" వెడలిపోయినందుకు ప్రజలు విచారించిరి. మహాత్ముని ఆత్మకు శాంతి కలుగుగాక యని ప్రార్థనను చేసిరి. మహాత్ముని వర్ధంతియుత్సవము జరుపుట కిదే ఏకైకమార్గము గాదు. అదే ఉచితమైనమార్గము గాదు. దేశము నైతికముగ అధఃపతనము పొందనున్నది. మనోవాక్కాయకర్మల వైరుధ్యము తీవ్రమై జాతివినాశమునకు దారితీయుచున్నది. 'గాంధినామ' స్మరణవలన ఈ ప్రమాదము నివార్యము గాదు. నీతిబాహ్యులకు ఆ పవిత్రనామస్మరణ చేయుటకు అర్హతకూడ వుండదు.

మహాత్ముని ప్రబోధమును మననముచేసుకొనుటెగాక, ఆయన నిర్దేశించిన మార్గమును అనుసరించుటకు ప్రతిఒక్కరు ప్రమాణము చేయవలెను. ప్రమాణస్వీకారముతో తృప్తిచెందక మనసా, వాచా, కర్మణా మహాత్ముని అనుసరించుటకు ఉపక్రమింపవలెను. అదే మహాత్ముని ఆత్మకు శాంతి చేకూర్చవలెనని మనము చేయగలప్రార్థన. అపుడే మనము జరుపువర్ధంతి,జయంతి, ఉత్సవములకు అర్థము ఉండును. ఇప్పటికైన భారతీయులు ఆత్మపరిశోధన చేసుకొని, గత రెండుసంవత్సరములలో తమ ప్రవర్తనవలన జాతిపితకు చేసిన మహాపచార మెంతో గ్రహించుకొని ఇకముందు ఆ విషాదచరిత్ర పునరావృత్తము కాకుండుటకు తగినమార్గమును అనుసరింపగలమని ప్రతిజ్ఞ గైకొనవలెను. 26వ తేదీన నాయకు లొసగిన సందేశసారాంశ మిదియే.



మానవ ప్రతిభా వికాసం

బాపూజీ అమర సందేశం

బాపూజీ అమరసందేశం

[శ్రీ ఎస్. సీతారామ్]

"దివ్యసందేశాలనిచ్చే వార్తాహరుల రెక్కల గుర్రాలు క్షణికకాలం ఆకాశంలో నిలిచిపోయినయ్. నా హృదయాంతరాళంలోని స్వప్నపుష్పాలు వాడి రాలిపోయినయ్. వాయుదేవుడు దుర్వార్త మోసుకొనివచ్చాడు. 'మానవుల్ని ఆశీర్వదిస్తూ మహాపురుషుడు హత్యపాలైనా'డని.

"సంధ్యావాయువులు హృదయాలలో జ్వాలల్ని రెచ్చగొడుతున్నాయి. అందరూ హృదయభారంతో నడిచిపోతున్నాం. దుర్వార్త చదివేవారి కనుల్లో పసిపాపకనుపాపల్లోవలె ఏవో చిత్రగాథలు పొడగట్టుతున్నాయి. అందరం నడిచిపోతున్నాం. హృదయానికీ, దృష్టికీ మధ్య ఎక్కడో కంటకం గుచ్చుకుంటోంది.

"ఇప్పుడు ఫలహారసమయమయింది. వేలాది ప్రజలుపాత్రలు చేతబట్టి చూస్తూ స్తబ్ధులై కూర్చున్నారు. పానీయంలో నీ ప్రతిబింబం గోచరిస్తోంది కాబోలు, పాత్ర నోటి కందడంలేదు. 'ఈ మనిషి కేం కావాలి? అసలీ లోకాని కెందు కొచ్చాడు?' ఏదో వ్యథ పీడిస్తోంది.

"నా హస్తంలో తారుణ్యం, శక్తి ఉడిగిపోతున్నాయి. నీ హృదయానికీ నా హృదయానికి మధ్య ఏ ప్రవాహం ఉంది? నీరక్తం చిందితే నారక్త మెందుకు క్షోభించాలి?"

బ్రెజీల్‌లో ఒక పోర్చుగీస్ కవయిత్రి గాంధీజీబలిదానం అనే ఖండకావ్యంలో ఈరీతిగా వ్రాసింది. ఆనాడు వాస్తవంగా లోకమంతా ఒక్కసారిగా చైతన్యంపొందినట్లయింది. కాని అది ఒక్కక్షణమే కన్నీరునించి మరుక్షణంలో తిరిగి అజ్ఞానంలో మునిగిపోయింది. గాంధీపట్ల ప్రియస్మృతి తిరిగి వారి హృదయాల్లో ఏ అంధకారమయకుహరాల్లోనో మణిగిపోయింది. భారతీయులుమాత్రం తల్లిని పోగొట్టుకున్న బిడ్డలవలె దుఃఖించారు. గాంధీజీ దుర్మరణంపాలై ఇప్పటికి రెండేళ్లు గిరగిరా తిరిగిపోయినయ్.

రాజకీయాల్ని దుర్నీతిలోనూ వ్యాపారాన్ని అవినీతిలోనూ ముంచెత్తుతున్న పాశ్చాత్యులకు గాంధీజీపట్ల ఈ ప్రేమాదరాలెల్లా కుదిరాయి? "లోకంలో ఒక దివ్యజ్యోతి అంతరించింది" అని పాశ్చాత్య నాయకులు వ్యథచెందారు. గాంధీజీ అహింసావ్రతంపట్ల భారతీయులకే పరిపూర్ణవిశ్వాసం కలగలేదు. స్వాతంత్ర్యసాధనకోసం గాంధీజీనాయకత్వాన్ని అంధులై అనుసరించారేకాని భారతీయులకే అహింసావాదం పూర్తిగా అర్థం కాలేదు. అయితే లోకంలో సర్వప్రజలకీ నాయకులకీ గాంధీజీ ఆరాధ్యు డెలా కాగలిగారు?

ప్రాపంచికసంపదల్ని అపారంగా వృద్ధిపరిచినట్లయితే దేశంలో దారిద్ర్యాన్ని, సమాజంలో సంఘర్షణనీ నివారించవచ్చునని పాశ్చాత్యులు భావించారు. యూరప్ అమెరికాలలో సంపద్వృద్ధికోసం పెద్దపెద్ద యంత్రపరికరాల్ని సృష్టించి పరిశ్రమలు స్థాపించారు. పారిశ్రామికవ్యాపారనాగరికతలు అపారంగా వృద్ధిచెందాయి. ఆహారాది వస్తుసముదాయం అశేషంగా వృద్ధిచెందింది. కాని ప్రజాసామాన్యందారిద్ర్యం నివృత్తి కాలేదు. సమాజంలో సంఘర్షణ నివృత్తి కాలేదు. ప్రజల జాతివైషమ్యాలు పెరుగుతున్నాయి. స్వేచ్ఛాస్వాతంత్ర్యసమత్వ సిద్ధాంతాలు గగనకుసుమాలైనాయి.

రాజకీయ ప్రజాపరిపాలనావిధానం ప్రజలకు ప్రయోజనకారి కాలేకపోయింది. క్రమంగా పాశ్చాత్యులు నిస్పృహ చెందుతున్నారు. ఆ సమయంలో గాంధీజీ దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహం ప్రారంభించారు.


ఇంతకుముందు అనేకులు సమాజవ్యవహారాల్లో ధర్మసిద్ధాంతాల్ని అనుసరించి నీతి బోధించారు. రాజకీయాల్లోనూ జాతీయ వ్యవహారాల్లోనూ యుద్ధాలు విప్లవాలు రక్తపాతం అనివార్యంగానే ఉండిపోయాయి. కాని గాంధీజీయే ప్రప్రథమంగా రాజకీయాల్లో నీతిసూత్రాల్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నించారు. రక్తపాతంలేకుండా బలహీనపక్షం న్యాయం చేకూర్చుకోవచ్చునని గాంధీజీ నిరూపించారు. ఈ సత్యాగ్రహాన్ని గురించి మానవచరిత్రలో అపూర్వమైన ప్రయోగమని టాల్‌స్టాయ్ అన్నాడు.

ఈకృషిఫలితాన్ని గమనించడానికి యూరప్ అమెరికాలలో నిమేధావులు, శాంతికాములు అత్యంతాసక్తి ప్రకటించి గాంధీజీకి నైతికబలం సమకూర్చారు. ఐన్‌స్టైన్, రోమేంరోలా, రెవరెండ్ ఆల్బర్ట్ హోమ్స్, ఆల్బర్ట్ ష్వైజర్, బెర్నార్డ్‌షా మొదలైన ప్రతిభావంతులు గాంధీజీపట్ల భక్తిగౌరవాలు ప్రకటించారు. దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహోద్యమం విజయం సాధించింది. దానితో నీతికీ ధర్మానికీ, హేతువాదానికీ జాతీయవ్యవహారాల్లోనూ, అంతర్జాతీయవ్యవహారాల్లోనూ, ప్రజోద్యమాల్లోనూ స్థానం లభించిందనీ, మానవచరిత్రలో నూతనశకోదయమౌతున్నదనీ పాశ్చాత్య నాయకులు భావించారు. గాంధీజీని మార్గదర్శకుడుగా దైవదూతగా భావించారు.

ప్రథమప్రపంచసంగ్రామానంతరం గాంధీజీ దక్షిణాఫ్రికానుంచి భారతదేశం వచ్చారు. భారతదేశానికి రాజకీయదాస్యం నుంచి ముక్తికలిగించడానికి గాంధీజీ సత్యాగ్రహవిధానం అవలంబించడానికి కృతనిశ్చయులైనారు. ఆరోజుల్లో అనీబిసెంట్ స్వపరిపాలనోద్యమం సాగుతోంది. బ్రిటిష్ ప్రభుత్వానికి మహజర్లుపెట్టి స్వపరిపాలన సాధించడం దుర్లభమని గ్రహించిన గాంధీజీ ప్రజల్లో ఉద్యమం ప్రారంభించాలన్నారు. ఉద్యమంలో ప్రజానీకం చేరినట్లయితే అరాచకప్రవృత్తి చెలరేగగలదని అనీబిసెంట్ మొదలైనవారు ఆక్షేపణ తెలిపారు. కాని ఉద్యమాన్ని అహింసాయుతంగా నడిపినట్లయితే అరాచకం సంభవించదని గాంధీజీ దృఢాభిప్రాయం. రాజకీయోద్యమంలో ప్రజలు ఒకసారి ప్రవేశించినతరవాత, వారిని అహింసాత్మక చర్యలకి నిర్బంధించి ఉంచడం అసాధ్యమని మితవాదులు వాదించారు. అహింసాత్మకమైనదైనాసరే ఉద్యమం అధర్మానికీ హింసకూ దారితియ్యక తప్పదని అనేకులు వాదించారు.

ఆకాలంలో ఈ విషయాలపైన "యంగ్ ఇండియా" పత్రికలో తీవ్రవాదోపవాదాలు నడిచేవి. ఈ వాదాల్లో నాయకులు, సామాన్యప్రజలు కూడా పాల్గొనేవారు. గాంధీజీకి యూరప్, అమెరికా, ఆఫ్రికాల నుంచి కూడా నిత్యమూ సందేహనివృత్తి కోసం అనేకులు అపరిచితులు లేఖలు వ్రాసేవారు. యుద్ధాలు, నిరంకుశపరిపాలన, సమాజ నిర్బంధాలు భౌతికవాదాలతో విభ్రాంతి చెందిన పాశ్చాత్యలోకం గాంధీజీవద్ద జ్ఞాన సముపార్జన చెయ్యడానికి యత్నిస్తున్నదనిపించేది.

గాంధీజీఅహింసాత్మకమైన సహాయ నిరాకరణోద్యమానికి పాశ్చాత్యసాహిత్యమే



"ఆత్మబల సంయమనమే సత్యాగ్రహం"

ఆధారమయింది. న్యాయం, సత్యం, అహింసల్ని టాల్‌స్టాయ్ వద్ద నేర్చారు. పాశ్చాత్యపారిశ్రామిక ప్రాబల్యంపట్ల విముఖతకు జాన్‌రస్కిన్ గ్రంథాలు ఆధారమైనాయి. సహాయనిరాకరణం, శాసనధిక్కారణోద్యమాలకు థోరే (అమెరికా) ఆదర్శం చూపాడు. పాశ్చాత్యదేశాలవల్ల ఆసియాఖండానికి రైళ్లు, విద్యుచ్ఛక్తి, ఎన్నికల విధానం మొదలైనవి పొందగా, ఆసియావల్ల పాశ్చాత్యదేశాలు సమాజనీతినీ, జ్ఞానాన్నీ పొందాయి.

భారతదేశంలో బ్రిటిషుపరిపాలనక్రింద భారతీయులు గుమాస్తాగిరీలూ వ్యాపారమూ నేర్చి దేశీయసంస్కృతిని విడనాడుతున్న రోజుల్లో గాంధీజీ భారతీయులకు ఆత్మగౌరవాన్ని ఉపదేశించారు. రాజకీయ సంస్కరణలకోసం కూడా పోరాడలేని దుర్బలస్థితిలో భారతదేశం ఉండగా, భారతీయులకు నైతికబలాన్నిచ్చారు. నిరాయుధులైన భారతీయులు నిరంకుశులైన బ్రిటిష్‌పరిపాలకుల్ని ఎదిరించి న్యాయం సమకూర్చుకునే బలాన్ని ప్రసాదించారు. చైతన్యంలేక దారిద్ర్యంలోనూ బానిసత్వంలోనూ, అజ్ఞానంలోనూ మగ్గుతున్న భారతీయులకు జాతీయచైతన్యమిచ్చి వారి ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించారు.

లక్ష్యశుద్ధితోపాటు సాధనవిధానం కూడా నీతిబద్ధమై ఉండాలని గాంధీజీ బోధించారు. రాజకీయాలు కూడా నీతిబద్ధమై ఉండాలి. స్వేచ్ఛాసమత్వాల సాధనకు కూడా అనుసరించే విధానం సత్యధర్మాలపైనే ఆధారపడి ఉండకపోతే ఫలితం విపరీతంగా ఉంటుందని గాంధీజీదృఢవిశ్వాసం. గాంధీజీ ఉపదేశించే నీతికి ప్రమాణం ప్రధానమానవధర్మం. అన్నిమతాలకూ అతీతమైన ప్రధానమానవమూల్యాలే గాంధీజీకి ఆధారమైనాయి. అందువల్లనే సమాజంలో మానవుల మానవత్వాన్ని పునరుద్ధరించడమే కాకుండా సర్వప్రాణిసముదాయంపట్లనూ మానవులు శ్రద్ధాప్రేమలు చూపాలని గాంధీజీ బోధించారు.

వ్యాపారనీతి, సంఘర్షణ ప్రబలిన ఈ కాలంలో గాంధీజీనీతిసిద్ధాంతాల అగత్యం ఎంతైనా ఉంది. సమాజంలో వ్యక్తి తన కర్తవ్యాన్ని విధ్యుక్తధర్మాన్ని గ్రహించలేనిస్థితి వచ్చింది. నీతి ఏదో అవినీతి ఏదో కూడా విచక్షణాలోపమైన ఈకాలంలో ప్రాథమికసమాజనీతిని గాంధీజీ జ్ఞప్తికి తెచ్చారు. వ్యాపారం వర్తకం కేవలం లాభార్జనకోసమే జరగరాదని వ్యాపారం అంటే భౌతికసంపదల్ని సమాజానికి సమకూర్చే పవిత్రసేవఅనీ గాంధీజీఅభిప్రాయం.

ప్రపంచంలో అశాంతికీ, జాతుల సంఘర్షణకీ మూలం వ్యక్తుల్లో అధర్మమేనని గాంధీజీవిశ్వాసం.

మారిస్ ఫ్రైడ్‌మన్ ఇలా వ్రాశారు: "వ్యక్తిలోని హింసాప్రవృత్తి, మానసికదౌర్బల్యాలే అనేకరెట్లుగా లోకంలో హింస, అశాంతులుగా పరివ్యాప్తమౌతున్నాయి. అందువల్ల ప్రపంచంలో శాంతిసాధనకు పరిష్కారం వ్యక్తిసత్వశోధన సంస్కరణలో ఉంది. మానవుల హృదయాల్లోని హింసాప్రవృత్తినీ, అస్థిరతనీ అశాంతినీ నివృత్తి చేస్తేనేగాని, ప్రపంచంలో శాంతిసాధనకు ఎన్నియత్నాలు చేసినా వృథా కాక తప్పదు. ఎన్ని శాసనాలు చేసినా, ఎన్ని ప్రజోద్యమాలు నడిపినా ధర్మాచరణకోసం ప్రజల్నన్ని నిర్బంధాలకు లోను చేసినా వ్యక్తిలో హృదయపరివర్తన సాధించనంతవరకూ అన్నీ వ్యర్థమే కాగలవు. ప్రజాసమూహాల్ని అహింసాసిద్ధాంతం, ధర్మాచరణ, నీతివర్తనలకోసం నిర్బంధాలకు లోనుచెయ్యడంవల్ల విపరీతఫలితాలే కలుగుతాయి. శారీరకంగాగాని, నైతికంగాగాని నిర్బంధాలు విధించడం హింసకిందికే వస్తుంది.

"ఉద్యమాలని చెప్పబడేవి క్రమంగా ఉన్మత్త ఆవేశాలకో లేక శిథిల నిర్జీవస్థితికో దారితియ్యక తప్పదు. ఈ ప్రమాదం ఎప్పుడూ ఉన్నదే. కేవలం బాహ్యవర్తనలోనే కొన్ని నియమాలు అవలంబించాలని నిర్బంధించినందువల్ల భీతి, నియమోల్లంఘన, అవినీతి ప్రబలగలవేకాని హృదయపరివర్తన కలగదు. వ్యక్తులమధ్య సంఘర్షణ నివృత్తి కాదు.

"ఎట్టి సమాజవ్యవస్థను నిర్బంధంగా విధించినప్పటికీ వ్యక్తులలో హృదయపరివర్తన తేవడం సాధ్యంకాదు. అహింసాధర్మమనగా సర్వనిర్బంధాలనుంచీ స్వేచ్ఛ.

"హృదయపరివర్తన రావాలంటే మానవునికి ఆత్మసాక్షాత్కారం కావాలి. తన కర్తవ్యమేదో, తన ప్రవర్తన ఎట్టిదో, తన చర్యలలోనూ భావనలోనూ అంతర్యమేమో, కార్యకారణసంబంధమేమో తెలుసుకోడానికి మానవుడు ప్రయత్నించాలి. అప్పుడే శారీరక, నైతిక, మానసిక నిర్బంధాలన్నిటినుంచీ వ్యక్తి విడివడి సత్యాన్ని ప్రత్యక్షం చేసుకోగలడు. లోభరహితము, నిర్బంధరహితము, తారతమ్యరహితమూ అయిన

సమాజవ్యవస్థను నిర్మించాలంటే, సమాజంలోని వ్యక్తులలోభం, అధికారవ్యామోహం, మూఢవిశ్వాసాల చెరనుంచి ముక్తిపొందాలి. అప్పుడే సమాజంలోనూ ప్రపంచంలోనూ అశాంతి అహింస అంతరించగలవు."

ఇట్టి సమాజమే గాంధీజీఆదర్శం. ప్రాపంచిక సంఘర్షణనుంచి విముక్తి పొందడానికీ, మానవసౌభ్రాతృత్వం సాధించడానికీ, తహతహలాడుతున్న క్రైస్తవలోకానికిది దివ్యసందేశంగా వచ్చినది. కాని పరస్పర అనుమానవైషమ్యాలలో మునిగివున్న రాజకీయవేత్తలు పరిపాలకులు గాంధీజీఆదేశాల నెంత విశ్వసించినప్పటికీ తమ కలుషితరాజకీయాలనుంచి ముక్తిపొందలేకుండా ఉన్నారు. గాంధీజీ చూపిన మార్గం తమ కాచరణసాధ్యం కాదని వారిభీతి. అందువల్లనే గాంధీజీహత్యవార్త వినగానే అందరూ కొంతసేపు దుఃఖితులైనప్పటికీ తిరిగి గాంధీజీ ఆదేశాన్ని విస్మరించడానికెంతోసేపు పట్టలేదు. భారతదేశంలోనే ఏ కొద్దిమంది అగ్రనాయకులోతప్ప కాంగ్రెస్ నాయకులందరూ గాంధీజీ నిర్దేశించిన మార్గాన్ని విడిచిపెట్టారు. దీనికి కారణం కాంగ్రెస్ వాదుల్లో వాస్తవమైన హృదయపరివర్తన రాకపోవడమే.

1944 లో పండిట్ నెహ్రూ ఇలా అన్నారు. "ధర్మబద్ధమై నిర్భయవిశ్వాసాలతో ఉపక్రమించిన కార్యాచరణ హృదయాకర్షక మయింది. మెట్టుమెట్టునా అచంచలవిశ్వాసంతో గాంధీజీని అనుసరించాం. గాంధీజీవాదం మాకు పూర్తిగా సమ్మతం కాకపోయినప్పటికీ లక్ష్యశుద్ధి, సాధన విధానం మమ్మల్ని ఆకర్షించి వారి ననుసరింపచేశాయి. అయితే మూలసిద్ధాంతాన్ని విడిచి కేవలం గుడ్డిగా అనుసరించడం ఉచితం కాదని మాకు తెలుసును. దీనివల్ల ఉత్తరోత్తరా మానసికసంచలనం, విషమఫలితాలు సంభవించక తప్పదు."

పండిట్ నెహ్రూ వాస్తవస్థితిని ప్రకటించారు.

హింసకంటె కూడా భీతి నీచమని గాంధీజీ అన్నారు. నియమబద్ధ వర్తనకి అర్థం వ్యక్తిస్థిరసంకల్పం అన్నారు. కాని ఇవే ఈనాడు కాంగ్రెస్‌వాదుల్లో లోపించాయి. అధికారవ్యామోహం తప్పిదం కాదనే భావం కాంగ్రెస్ వాదులందరిలోనూ ప్రబలింది. హృదయపరివర్తన ఎన్నడూ కలగలేదు. అందువల్లనే కాంగ్రెస్ మహాదాశయాలకు కాంగ్రెస్ వాదులు నానాటికీ దూరమౌతున్నారు. కాంగ్రెస్ ప్రకటించిన లక్ష్యాలు దివాస్వప్నాలైనాయి.

పాశ్చాత్యనాగరికతఫలితంగా ప్రజాప్రాతినిధ్యప్రభుత్వాలలోకూడా ప్రజల



స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు బలౌతున్న ఈరోజుల్లో, ఒకవైపున వ్యాపారదుర్నీతి, మరొకవైపున కమ్యూనిస్టుల హింసాకార్యాలు ప్రజల్ని పీడిస్తున్న ఈరోజుల్లో ప్రపంచసాత్వికవాదుల ఆశలు గాంధీజీ అహింసాసత్యాగ్రహవిధానాలపై లగ్నమౌతున్నాయి. ఐచ్ఛికంగానో, అనైచ్ఛికంగానో తెలిసో తెలియకో, నిర్బంధంవల్లనో లేక తమంతతామో వ్యక్తులు హింసకూ అనుచితవర్తనకూ తావిస్తున్నారని గాంధీజీఅభిప్రాయం. ఇది వ్యక్తుల అజ్ఞానం, శారీరక నైతిక దౌర్బల్యాలవల్ల సంభవిస్తుంది' ప్రజల్ని నైతికబలం చేకూర్చుకుని ఈ హింసాప్రవృత్తికి ఏవిధంగానూ సహకరించకుంటే హింసకి పరాజయం తప్పదని గాంధీజీ అభిప్రాయం. ఈ ఆత్మబలసాధననే సత్యాగ్రహమన్నారు. దీనివల్ల లభించే వ్యక్తిస్వేచ్ఛ మరే ప్రజాస్వామ్యసిద్ధాంతాలవల్లనూ లభించదని పాశ్చాత్య విజ్ఞానవేత్తలుకూడా గ్రహించారు. పాశ్చాత్యనాగరికత భగ్నమయ్యే ప్రమాదం సంభవిస్తున్న ఈ సమయంలో పాశ్చాత్యదేశాలలోని ప్రజలకు గాంధీజీవాణి దివ్యసందేశమయింది. తిరిగి మానవచరిత్రలో మానుష మూల్యాల్ని వ్యాపారదుర్నీతినుంచీ, నిరంకుశపరిపాలనబారినుంచీ రక్షించి వ్యక్తిగత వికాసానికి అవకాశ మివ్వగల పరికరం గాంధీజీ బోధించిన ఆత్మోద్ధరణేనని పాశ్చాత్యలోకం ఆశిస్తున్నది. మానవుల్లో ఇంకా మానవప్రకృతి యంత్రాలకి బలికాలేదనీ, ఇంకా వారిలో ప్రేమసహనభావాలు బలీయంగానే ఉన్నవనీ గాంధీజీ జ్ఞప్తికి తెచ్చారు. అదొక్కటే మానవప్రపంచానికి ఆశ చేకూరుస్తున్నది. కాని బౌద్ధమతంవలెనే గాంధీజీఅహింసా, సత్యాగ్రహసిద్ధాంతాలు భారతదేశంలో తప్ప అన్యదేశాల్లో పాతుకున్నప్పటికీ ఆశ్చర్యపడనవసరంలేదు. కాంగ్రెస్‌వాదులు యూరప్ చరిత్రానుభవాన్ని విస్మరించి అధికారికప్రభుత్వంతో మొదటినుంచీ ప్రయోగాలు ప్రారంభించారు. మారిస్ ఫ్రైడ్‌మన్ వ్రాసినట్లు కాంగ్రెస్ సంస్థ ఇప్పుడు విషమసమస్యలో పడింది. ఉన్మత్తఆవేశాలతో నిండిన రాజకీయపథాన అధోగతిపాలు కావడమో లేక కాంగ్రెస్ సంస్థ నిర్జీవకంకాళమై శిథిలం కావడమో తప్పదని అనుమానం తోస్తున్నది. కాంగ్రెస్‌వాదులు భారతజాతిని అశాంతి అరాచకాలనుంచి కాపాడాలంటే, దేశంలో దారిద్ర్యాన్ని నిర్మూలించాలంటే, అధికారిక పరిపాలనావిధానం మాని ప్రజాసేవకే పరిపాలన నిర్వహించడానికి మొదలుపెట్టాలని గాంధీజీ అన్నారు. ఇప్పటికీ తరుణం మించిపోలేదు.

నేటి ప్రపంచం:

మంచూరియా పరిస్థితి
అమెరికన్ ప్రభుత్వప్రకటన

చీనాలోని మంచూరియా, దక్షిణమంగోలియా, సింకియాంగ్ ప్రాంతాల్ని పెకింగ్ కమ్యూనిస్టుప్రభుత్వాధీనంనుంచి విడగొట్టి రష్యా తన అదుపులోకి తీసుకుంటోందని అమెరికన్ విదేశాంగమంత్రి డీన్ ఎచిసన్ ఇటీవల ప్రకటన చేశాడు. ఇదంతా అమెరికన్ ప్రభుత్వం చీనాలో తమ ఓటమిని కమ్ముకోడానికి చేస్తున్న దుష్ప్రచారమే కాని ఇందులో పీసమైనా సత్యం లేదని రష్యన్ విదేశాంగమంత్రి ఆంద్రీ వైషిన్స్కీ ప్రకటించాడు. తూర్పు ఆసియాలో అమెరికన్ ప్రభుత్వ విధానం పూర్తిగా పరాజయం పొందినందుకు అమెరికన్ కాంగ్రెస్‌లో తీవ్రవిమర్శలు వచ్చాయి. తూర్పుఆసియాలో ఇకనుంచి అమెరికా తన విధానం మార్చుకుంటుందని అందరూ భావించారు. కాని ఇప్పటివరకూ ఏమార్పులూ కనిపించడంలేదు. పరిస్థితుల్ని అమెరికన్ రాయబారి ఫిలిప్ జెసప్ స్వయంగా పరిశీలిస్తున్నాడు. జెసప్ అమెరికా తిరిగివెళ్లగానే అమెరికన్ ప్రభుత్వం పరిస్థితుల్నీ, తమ విధానాన్నీ, సమీక్ష చేస్తుంది.

ఫార్మోజాద్వీపంలో తన బలాల్ని చేర్చుకుని కమ్యూనిస్టులతో ఇంకా పోరాటంజరుపుతున్న చియాంగ్ కైషేక్ అమెరికన్ ప్రభుత్వాన్ని ఆర్థికసైనిక సహాయా లడిగాడు. అమెరికన్ ప్రభుత్వం నిరాకరించింది. ఈసందర్భంలో ఫార్మోజాద్వీపసంరక్షణబాధ్యతని పూర్తిగా అమెరికా వహించాలని కొందరు వాదించారు. ఫార్మోజాద్వీపానికి స్వాతంత్ర్య మిచ్చి (అనగా చియాంగ్ ప్రభుత్వాన్ని తొలగించి) అమెరికా సైన్యాలు పంపాలని కొందరు సూచించారు. అమెరికన్ ప్రభుత్వంసమ్మతించలేదు. కాని ఫార్మోజాద్వీపాన్ని ఆక్రమించుకోడానికి అమెరికా ఇంకాయత్నిస్తూనేఉందని చీనాకమ్యూనిస్టులు ప్రచారం చేస్తున్నారు. ఇంకా చియాంగ్ కైషేక్ పూర్తిగా పరాజయం పొందకుండానే అమెరికన్ ప్రభుత్వం అతని ప్రభుత్వాన్ని విమర్శించి, చీనాలో జాతీయప్రభుత్వంపతనానికి లోపం అతనిదేనని ఆరోపించినందువల్లనే చీనాభూభాగంపైన అతనికి పూర్తి పరాజయం కలిగిందని అమెరికన్ కాంగ్రెస్‌లోని ప్రభుత్వప్రతికూలపక్షానికి చెందిన రిపబ్లికన్లు ప్రచారంచేస్తున్నారు. ఇప్పుడైనా ఫార్మోజారక్షణవిషయంలో వెంటనే అమెరికన్ ప్రభుత్వం తగుఏర్పాట్లు చెయ్యాలనీ, చియాంగ్ కైషేక్‌ను బలపర్చాలనీ వారి వాదన.

చీనా అమెరికన్ ప్రభుత్వపరాజయం వల్ల ప్రభుత్వంపట్ల అసంతృప్తి ప్రబలింది. అది అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రభుత్వపరాజయానికి దారితీసింది. కొరియా, ఫిలిప్పైన్స్, సయాం, జపాన్‌లకు ఆర్థికసహాయం చెయ్యడానికి అమెరికన్ ప్రభుత్వం కాంగ్రెస్‌లో ప్రతిపాదన పెట్టింది. మొదట కొరియానిమిత్తం 60 మిలియన్ల డాలర్ల ఖర్చుకి కాంగ్రెస్ అనుమతి కోరారు. రిప్రజెంటెటివ్ హౌస్ నిరాకరించింది. ఈ నిరాకరణవల్ల తూర్పుఆసియాలో ప్రమాదస్థితి ఏర్పడవచ్చునని అమెరికన్ విదేశాంగమంత్రి డీన్ ఎచిసన్ హెచ్చరించారు. అమెరికాఆర్థికసహాయం పొందని పక్షంలో దక్షిణకొరియారిపబ్లిక్ నిలవలేదని చెప్పాడు. సెనేట్‌లో ప్రభుత్వప్రతిపాదన సామోదింపచేసి ఎలాగైనా అమెరికన్ ప్రభుత్వకార్యక్రమాన్ని రక్షించాలని తీవ్రప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ యత్నాలు సఫలం కావచ్చును. కాని ఒక్కవిషయం స్పష్టపడుతోంది. అమెరికన్లు తమ ఇతరకార్యక్రమాల్ని కమ్ముకోడానికీ, చీనాలో పరాజయాన్ని కమ్ముకోడానికీ మంచూరియా ప్రమాదంలోఉందని ప్రచారం చేస్తున్నారు. యుగోస్లావియాప్రధాని టిటోమాదిరిగా చీనాకమ్యూనిస్టుల్ని రష్యా మైత్రినుంచి విడగొట్టడానికి కూడా ఈవిధంగా ప్రచారం చేస్తూఉండవచ్చును. ఇటువంటి ప్రచారంవల్ల చీనాప్రజల్లో రష్యాపట్ల విరోధభావం కలగచెయ్యడానికి రీతిగా ప్రచారం చేస్తూ ఉండవచ్చును. ఈ ప్రచారంతో మాస్కోలో చీనాఅధ్యక్షుడు మావ్‌సీటుంగ్ సమాలోచనల్ని ముడిపెట్టారు. చీనా రష్యాలమధ్య మైత్రిసహకారాల నిమిత్తం ఒక ఒడంబడిక చేసుకోడానికి చీనాఅధ్యక్షుడు రష్యన్ ప్రభుత్వాధికారుల్తో సమాలోచనలు జరుపుతున్నాడు. స్టాలిన్ జన్మదినోత్సవానికి వెళ్లాడు. అప్పటినుంచి మాసంపైగా ఇంకా అక్కడే ఉన్నాడు. చర్చల్లో పాల్గొనడానికి చీనాప్రధానమంత్రి చౌ ఎన్‌లై కూడా మాస్కో వెళ్లాడు. ఈ ఒడంబడిక అత్యంతప్రధానమైనదని అమెరికన్ పత్రికలు వ్రాస్తున్నాయి. ఈ ఒడంబడికతోపాటు ఆసియాలో కమ్యూనిస్టుపార్టీల కార్యక్రమాల్ని నిర్ణయించడం కూడా జరుగుతుందట. జపాన్, ఇండోచీనా, సయాం, మలయా, ఇండియా, ఇండొనీషియా, పాకీస్తాన్ సింహళాలలో కమ్యూనిస్టుపార్టీ లనుసరించవలసిన కార్యక్రమాలను మాలటోవ్ మావ్‌సీటుంగ్‌లు నిర్ణయిస్తున్నారట. మంచూరియాపరిశ్రమల అభివృద్ధికీ చీనావ్యవసాయాభివృద్ధికీ రష్యన్లు ధనమూ నిపుణుల్నీ సప్లై చెయ్యవచ్చును. కాని మంచూరియాను రష్యా తన అధీనంలోకి తీసుకుంటుందంటే నమ్మడానికి వీల్లేదు. అమెరికన్ల ప్రచారం వ్యర్థమే. ఇటువంటి ప్రచారంవల్ల ఆసియాప్రజల్ని పూర్తిగా బెదిరించి తమ సహాయంకోసం అర్థించాలనీ, తమ మిలిటరీకార్యక్రమాలపట్ల ఆసియాప్రజలకి సందేహం కలక్కుండా చెయ్యాలనీ అమెరికన్ల ఉద్దేశమై ఉండవచ్చును.

కాని అమెరికన్లు చెయ్యజూపే సహాయం ఆసియాప్రజల కన్నడూ తృప్తి కలిగించదు. భారతదేశం పాకీస్తాన్ మొదలైన దేశాలకు బ్రిటన్ బాకీపడిన స్టెర్లింగ్ నిలవల్ని ఆరోగ్యాభివృద్ధికార్యక్రమాలకీ విద్యావ్యాప్తికార్యక్రమాలకీ, ఏవో చిన్న

చిన్న వ్యవసాయాభివృద్ధికార్యక్రమాలకి ఖర్చుపెట్టించి, ఈ దేశాలు ఆర్థికంగా నిత్యమూ అమెరికాపైనా యూరప్‌పైనా ఆధారపడేటట్లు చెయ్యడమే అమెరికా ఉద్దేశమనే సందేహం ఆసియావాసులికి నివృత్తి కావడంలేదు. ఆసియాలో విద్యుచ్ఛక్తి, పరిశ్రమల అభివృద్ధికి అమెరికన్ పెట్టుబడిదారులు పారిశ్రామిక వేత్తల కొప్పగించడం అమెరికాలక్ష్యమనే సంగతి స్పష్టమే. ఈ పెట్టుబడివిధానం ఆయా దేశాల క్షేమందృష్ట్యా నిర్ణయించబడుతుందనే నమ్మకం ఆసియావాసులికి లేదు. ఆసియాదేశాలు గారంటీ లిస్తేగాని అమెరికన్లు పెట్టుబడి తీసుకురారని పదేపదే చెప్తున్నారు. సామాన్యపరిస్థితుల్లో ఆసియా దేశాలు ఇటువంటి గారంటీ లివ్వవు. భారతదేశంలో సక్రమమైన పారిశ్రామికాభివృద్ధికి ఒక విధానం నిర్ణయించబడింది. కొన్ని పెద్ద పరిశ్రమలు ప్రభుత్వాధీనంలోనే ఉంటాయి. దేశక్షేమందృష్ట్యా ఈ కార్యక్రమం నిర్ణయించబడింది. ఏపరిశ్రమల్ని ప్రభుత్వం స్వాధీనపరుచుకోదలచలేదో వివరించబడింది. అయినప్పటికీ ఈ విధానం అమెరికన్ పెట్టుబడిదారులికి నచ్చలేదు. దేశం అవసరాలదృష్ట్యా పరిశ్రమాభివృద్ధిని నియమబద్ధంగా నిర్వహించేపద్ధతి అమెరికన్లకి బొత్తిగా గిట్టదు.

మనదేశంలో ప్రభుత్వం దేశీయపరిశ్రమల రక్షణనిమిత్తం సుంకాలను విధించే పద్ధతి పరిశ్రమల లాభాల ప్రమాణాన్ని బట్టీ అభివృద్ధిఅవకాశాల్ని బట్టీ నిర్ణయించబడింది. ఈ నిర్ణయాలప్రకారం నూరింట 18 వంతులుపైగా లాభాలు ఆర్జించే పరిశ్రమలకి పూర్తిసంరక్షణ అవసరంలేదని నిర్ణయించబడింది. మనదేశంలో లాభప్రమాణం 18%. అమెరికన్ల ప్రమాణం వేరు. కనీసం నూటికి 40 వంతులైనా లాభాలుంటేకాని పెట్టుబడి పెట్టరు.

ఈరెండు విధాలా తమ పద్ధతిని ఆమోదిస్తేగాని ఆసియాదేశాల్లో అమెరికన్లు పెట్టుబడి పెట్టరు. ఈ షరతులికి ఎలాగైనా ఆసియాదేశాల్ని లొంగదియ్యడం అవసరమని అమెరికన్ ప్రభుత్వం ఉద్దేశం. ఈ ఉద్దేశం నెరవేర్చుకోడానికికూడా ఆసియాలో కమ్యూనిస్టు ప్రమాదం ఎంతబ్రహ్మాండంగా ఉందో చూపి బెదిరించడం చాలా ఉపయోగపడవచ్చును.

ఆసియాలో ఆర్థికాభివృద్ధిపట్ల అమెరికన్లకీ యూరోపియన్లకీ ఇంతశ్రద్ధ ఎలా వచ్చింది? ఆసియాలో ఆర్థికాభివృద్ధి అంటే వారి లక్ష్యమేమిటి? అమెరికాలోవలె ఆసియాలో విద్యుచ్ఛక్తి, పరిశ్రమలు వ్యవసాయం వృద్ధిపరిచి దారిద్ర్యం నిర్మూలించాలని ఆసియావాసుల లక్ష్యం. కాని అమెరికన్ల యూరోపియన్ల లక్ష్యం ఇది కాదు. ఆర్థికాభివృద్ధి పరస్పరసహకారంపైనే ఆధారపడిఉంటుందని అమెరికన్లు పదేపదే చెప్తున్నారు.

అమెరికానించీ యూరప్‌నించీ ఇంజనీర్లు, సైంటిస్టులు ఇతరనిపుణులు వస్తేకాని ఆసియాలో పరిశ్రమలు అభివృద్ధికావని అంటున్నారు. ఆసియాలోని ప్రభుత్వాలు కూడా అలాగే అనుమానిస్తున్నారు. కాని జపాన్‌లో ఏ యూరోపియన్, అమెరికన్ నిపుణుల సహాయంలేనిదే ఎలా పరిశ్రమల్ని అభివృద్ధిచేసుకోగలిగారు? బ్రిటిష్ అమెరికన్ పారిశ్రామికుల్తో ఎలా పోటీచేసి ఆసియామార్కెట్లలో ప్రాబల్యం సంపాదించారు? పెట్టుబడిదారులు పెట్టుబడిని గ్రామాలకి తర్లిస్తే ఆర్థికాభివృద్ధి ఎవరిసహాయంతో నిమిత్తంలేకుండా సాధ్యపడుతుందని యుద్ధాత్పూర్వం జపాన్ నిరూపించింది. కాని అమెరికన్లు ఆసియా దేశాల అభివృద్ధి తమపైనే ఆధారపడి ఉందని ప్రచారం చేస్తున్నారు.

వాస్తవానికి ఆసియాఆర్థికాభివృద్ధిలో అమెరికాకు అకస్మాత్తుగా ఈనాడింత శ్రద్ధ కలగడానికి కారణం వారి ఆర్థికస్థితే. అమెరికాలో నిరుద్యోగాల్ని నివారించి ఆర్థికమాంద్యం ఏర్పడకుండా కాపాడుకోవాలంటే అమెరికన్ల పెట్టుబడికి అనేక అధికావకాశాలు లభించాలి. పరిశ్రమలు పెట్టుబడిదార్ల ప్రాబల్యం పెరిగిపెరిగి ఒక్కసారిగా కూలిపోతుందని మార్క్స్ అన్నాడు. అమెరికన్, యూరోపియన్ పెట్టుబడిదార్లు పారిశ్రామికదార్ల కాలం పండిందనీ, ఆవ్యవస్థ కూలిపోవడానికి ఇంకాట్టేకాలం పట్టదనీ రష్యన్లు ప్రచారం చేస్తున్నారు. దీనికి కారణం పెట్టుబడిదారీ విధానంలో ఉన్న లోపమేనని మార్క్సిస్టు వాదం. కాని పెట్టుబడిదారీవిధానం అలాటి లోపమేదీ లేదనీ, వారి వ్యవస్థ కూలిపోదనీ అమెరికన్లు సమాధానమిస్తున్నారు. ఉభయులకీమధ్య పోటీ తీవ్రతరమౌతోంది. అమెరికాలో ఈసారి ఆర్థికమాంద్యం సంభవించిందంటే కూలిపోకతప్పదని అమెరికన్లకి తెలుసును. అందువల్ల ఆర్థికమాంద్యం సంభవించకుండా పెట్టుబడికోసం కొత్త మార్గాలు అన్వేషించవలసిన అవసరం వచ్చింది. అమెరికన్లు స్వరక్షణకోసమే ఆసియాలో పెట్టుబడి పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ పెట్టుబడివల్ల ఆసియాదేశాలు ఆర్థికంగా యూరప్ అమెరికాలపైనే ఆధారపడిఉంటే పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడవచ్చునని వారి ఆశ. ఈ యత్నాల్ని భగ్నంచెయ్యాలని రష్యా ప్రయత్నం. ఉభయులమధ్యనూ ఆసియా బలౌతోంది. ఎలాగైనా ఆసియాలో అమెరికన్ల పెట్టుబడి చేరకుండా చెయ్యాలని వారి ఎత్తు. అందుకోసమే ఆసియాలో అశాంతినీ అరాచకాన్నీ రెచ్చగొట్టుతున్నారు. ఆసియాలో దౌర్జన్యాలకు దిగి అరాచకం తెచ్చినట్లయితే అమెరికన్ ప్రభుత్వం ఎంత మొత్తుకున్నా అమెరికన్ పెట్టుబడిదార్లు ఆసియా దేశాలలో పైసాపెట్టుబడి పెట్టడాని కొప్పుకోరు. దీన్నిబట్టిచూస్తే ఆసియాలో కమ్యూనిస్టుల కార్యక్రమానికి లక్ష్యం కేవలం అరాచకమేకాని మరొకటి లేదని తట్టుతుంది. నిజానికి భారతదేశంలో కమ్యూనిస్టులు తమ దౌర్జన్యాలవల్ల ప్రభుత్వాన్ని పడగొట్టగలరని ఆశపడుతున్నారంటే నమ్మడం కష్టం. రైతులు కార్మికుల క్షేమంకోసం పాటుపడుతున్నట్లు ప్రచారంచేసే కమ్యూనిస్టులు, ప్రజలు క్షామాలకి బలౌతారనికాని ప్రజల్లో పార్టీపట్ల విరోధం పెరుగుతోందనికాని యోచించకుండా ఈ క్షామకాలంలో ధాన్యపురాసుల్ని తగలపెడుతున్నారంటే కారణం ఇదే. పార్టీ అప్రతిష్ఠపాలౌతున్నాసరే పార్టీబలం క్షీణిస్తున్నాసరే క్షామం, అరాచకం తీసుకరావడమే కమ్యూనిస్టుల పరమలక్ష్యం.

ఆసియాదేశాలు యూరప్‌పై ఆధారపడనవసరంలేని పక్షంలో అమెరికారష్యాల మధ్య విరోధాల్లో వీసమైనా జోక్యం చేసుకోవన్న సంగతి రష్యన్లకీ అమెరికన్లకీ కూడా తెలుసు. అందువల్లనే అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని చూపి రష్యన్లు, కమ్యూనిస్టుముప్పును చూపి అమెరికన్లు ఆసియావాసుల్ని బెదిరించి ఎవరిమట్టుకు వారు తమ ప్రాబల్యంలోకి తెచ్చుకోవాలని యత్నాలు చేస్తున్నారు. ఆసియా వ్యవహారాల్లో ఈనాడు రష్యా అమెరికాల కార్యక్రమాలకిదే అంతర్యం. [సూర్యనారాయణ]


రాజాజీకి వీడ్కోలు




ప్రభుత్వభవనంవద్ద వీడ్కోలు.



విమానాశ్రయంవద్ద పండిట్ నెహ్రూ రాజాజీకి వీడ్కోలు ఇచ్చారు.



మద్రాసు విమానాశ్రయంలోదిగిన రాజాజీకి మద్రాసుగవర్నరు శ్రీప్రకాశ స్వాగతం ఇచ్చారు.



రిపబ్లిక్ స్థాపన ప్రకటించి శ్రీరాజగోపాలాచారిగారు, శ్రీరాజేంద్రప్రసాద్ గారికి సింహాసనం సమర్పించారు.



ప్రధాని పండిట్ నెహ్రూ, తదితరమంత్రులచే, అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ గారు ప్రమాణం చేయించారు

భారత రిపబ్లిక్ సంస్థాపన




జనవరి 26-వ తేది గురువారం ఉదయం న్యూఢిల్లీ ప్రభుత్వభవనంలోని దర్బార్ హాలులో భారతీయ రిపబ్లిక్ సంస్థాపనోత్సవం జరిగింది. తుది గవర్నర్ జనరల్ శ్రీ రాజగోపాలాచారి గారు భారత దేశంలో సర్వస్వతంత్ర ప్రజాసత్తాక రాజ్యాంగం స్వీకరించ బడిందని ప్రకటించారు. శ్రీ రాజేంద్ర ప్రసాద్ గారు రిపబ్లిక్ అధ్యక్షులుగా ప్రమాణంస్వీకరించి సరిగ్గా 10-30 గంటలకు సింహాసనం అధిష్ఠించారు. దేశమంతటా ఆరోజున, మర్నాడు ప్రజలు ఆనందంతో ఉత్సవాలు జరుపుకున్నారు.


అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ గారిని పార్లమెంటుసభ్యులు అభినందించారు



అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ రాజలాంఛనాలతో ఢిల్లీ నగరవీధుల్లో ఊరేగారు




రాజ్యాంగ పత్రంపై సంతకం చేస్తున్న సర్దార్ పటేల్ ప్రభృతులు.



ఢిల్లీనగరవీధుల్లో ఊరేగింపు అనంతరం శ్రీ రాజేంద్రప్రసాద్ గారికి అంగరక్షకులు స్వాగతమిచ్చారు.

భారతీయ రిపబ్లిక్ సంస్థాపన



రాజ్యాంగపత్రంపై సంతకం చేస్తున్న పండిట్ నెహ్రూ !




రిపబ్లిక్ ప్రథమాధ్యక్షుడు శ్రీ రాజేంద్రప్రసాద్, తుది గవర్నర్ జనరల్ శ్రీ రాజగోపాలాచారిగారు.




రిపబ్లిక్ సంబరోత్సవాల్లో పాల్గొనడానికి వచ్చిన ఇండోనేషియా అధ్యక్షులు డాక్టర్ సోకర్నో గారికి భారతప్రధాని పండిట్ నెహ్రూ ప్రేమతో స్వాగతమిచ్చారు.

చెన్నపట్నంలో రిపబ్లిక్ ఉత్సవం



చెన్నపట్నంలో గవర్నరు శ్రీ భావనగర మహారాజాగారు నూతన ప్రమాణస్వీకరణ చేశారు. ఈ సందర్భంలో రాజాజీ హాలువద్ద గవర్నరుగారు సైనికాభివందనం స్వీకరిస్తున్నారు.



ఉత్సవాల సందర్భంలో రాత్రివేళ దీపాలతో అలంకరించబడిన చెన్నపురి కార్పొరేషన్ భవనం



చెన్నపట్నంలో గవర్నరు భావనగర మహారాజాగారు, మహారాణిగారు రాజలాంఛనాలతో ఊరేగారు.

ఢిల్లీ లేఖ:

అభివృద్ధిప్రణాళికల అవలక్షణాలు

శ్రీ కృష్ణ

"ఆసియాఖండంలో ఒక్క బీదవాని కంచంలో ఒక్క మెతుకు ఎక్కువ పడిందిలేదు. ఒక్క కర్షకుని పొలానికి ఒక్క మోటారుపంపు సరఫరా జరగలేదు. కాని అనేకమంది సివిల్ ఉద్యోగులకు మాత్రం, పసిఫిక్ సముద్రాంతర, విమాన ప్రయాణాలనుమాత్రం, ప్రభుత్వాలు ఇతోధికంగా ఎక్కువ చేసికొన్నాయి."

అంటూ ఒక బ్రిటిష్ వారపత్రిక కొలంబోసమావేశంపై వ్యాఖ్యానించింది. భారత ప్రభుత్వ ప్లానింగ్ ప్రణాళికపైన, డాక్టర్ గ్యాన్‌చంద్ గారు, ఇండియా ఛాంబరు ఆఫ్ కామర్సువారూ, చేసిన విమర్శలుకూడా ఇల్లాగే ఉన్నాయి.

డాక్టరు గ్యాన్‌చంద్ ఇల్లా అన్నారు.

"అభివృద్ధికై తలపెట్టిన ఖర్చులను కాస్త పరిశీలిస్తే, ఒకదానికీ ఒకదానికీ ఏమీ పొందికలేకుండా ఉందని స్పష్టమౌతుంది. ఒక్కొక్క రాష్ట్రంగానూ, సమిష్టిదేశంగానూ దృష్టిలో పెట్టుకొని చూస్తే, ఉన్న అవసరాలకు అవకాశాలకూ, తలపెట్టిన "అభివృద్ధి"వ్యయాలకూ, ఒక క్రమసంబంధముగాని, విధానముగాని ఏమీ కనబడదు. ఇప్పటి కప్పుడే ఆరంభించిన ప్రణాళికలూ ఇప్పటికి ఖర్చులో రాష్ట్రాలకు చేసిన పంపుళ్లూ, ఇన్నీ గుర్తులో ఉంచుకోకుండా, తుడిచిపెట్టి క్రొత్తప్రణాళిక అంటూ ఏర్పరచటం సాధ్యంకాదు. లభించే అవకాశం ఉన్న సాధనసంపత్తిసర్వస్వాన్ని సరిగ్గా అవగాహనచేసుకొని, ఖర్చుపద్ధతుల నిర్ణయించుకోటం చాలా అవసరమని స్పష్టమౌతుంది. క్రమంలేకుండా ఖర్చుపెట్టటం ప్రారంభిస్తే, భారతదేశంలాంటి దేశంలో ఉన్న కాస్త డబ్బు వృథాగా తగలేసుకోవటం అవుతుంది తప్ప అణుమాత్రమైనా ప్రయోజనం కలుగదు!"

ఫెడరేషనువారి విమర్శ;

"ఈ ప్రణాళికలు, బడ్జెటులో గ్రాంటులు చూస్తూంటే, ప్రభుత్వాలకు ఎంతెంత అపారధనాలను దుర్వ్యయం చెయ్యగల అవకాశం ఉందో స్ఫురిస్తోంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, ఏటా 200 కోట్లరూపాయలు ఖర్చుపెట్టదలచుకొంటున్నాయి. మొన్న మొన్నటిదాకా ఈ ఖర్చులన్నీ సత్ఫలాల నిస్తాయనే ఆశపడ్డాము. కాని ఈ ప్రణాళికలను ఆచరణలో పెట్టాలిసివచ్చి ఏమాత్రము ముందునడక కనబడకపోయేటప్పటికి ప్రభుత్వవిధానము గురికి ఎన్ని బెత్తల దూరంలో ఉందో, వీట్లలో యాథార్థ్యదృష్టిలోపం ఎంత ఎక్కువగా ఉందో బైలుపడింది. చాలా వాట్లలో, ప్రాథమికపరిశీలనస్థితి ఐనా దాటలేదు. కొన్నిటిని ఆరంభశూరతతో,అట్టే వదలి ఊర్కొన్నారు. కాస్త అభివృద్ధిచూపించి ముందు చురుకు చూపించినపనులలో ఆ చురుకు తగ్గిపోయి మాంద్యం ప్రవేశించింది. లోగుట్టు ఏమిటో ఫెడరేషనువారికి సరిగ్గా తెలియనందున, జరిగిన అభివృద్ధినిగురించి ఏమిచెప్పగలస్థితిలోనూ ఫెడరేషనుఉండే అవకాశం లేకపోతోంది. కాని, దొరికినవార్తలనుబట్టి చూసుకొంటేనే, ఈ ప్రణాళికలలో దాదాపు ఎక్కువభాగం కాగితంమీది గీతలను దాటి వ్యవహారంలోకి రాలేదనీ, అథవా కొన్నిచోట్ల మొదలెట్టినా, పని మందగించిపోయిందనీ, సుస్పష్టంగా తెలుస్తూంది."

ఈ రెండువిమర్శలకూ, దృక్పథం ఉన్నది. డాక్టర్ గ్యాన్‌చంద్, సరియైన ప్లానింగ్ కమిషన్ ఉండి తీరాలనేందుకు వాదబలం సమకూర్చారు. ఫెడరేషనువారు ప్లానింగ్‌కూ, వర్తకసంఘానికీ సామరస్యం కుదరాలంటారు. డాక్టరు గ్యాన్‌చంద్ ప్రభుత్వంలో, శాఖాసంకుచితత్వాన్ని నిందిస్తున్నారు. ఈ నాల్గింటిని - ప్రభుత్వ వివిధశాఖావిభేదాల్ని, అనధికారవ్యక్తులను, ప్రభుత్వ, ప్రత్యేకవ్యక్తుల ఉద్యమకృషినీ- నాల్గింటినీ సమన్వయం చేసికొనిరావటంలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

ఈలోపుగా కాంగ్రెసుకార్యవర్గం ప్లానింగ్ కమిషన్ విషయం చేసిన తీర్మానం బైటికొచ్చింది. ఈ తీర్మానంలో ఉన్నన్ని పరస్పరవిరుద్ధాంశాలు మరెక్కడా ఉండవు. ఉదాహరణకు 'ప్లాన్డు ఎకానమీ', (సక్రమఆర్థికవిధానము) కావాలంటూంది. అయితే వికేంద్రీకరణంవల్లా, సంపూర్ణంగా వ్యక్తులకు స్వేచ్ఛ నియ్యడంవల్లా రావాలంటుంది. అసలు, ఒక అనధికారసంస్థ, ప్రభుత్వఅధికారంలో ఉన్న పార్టీకి మాతృక అయినప్పటికీ, ప్రభుత్వాన్ని నిర్దేశించవూనటం ఎంతవరకూ ఉచితమా అనే ప్రశ్న ఉండనే ఉంది. కాకుంటే, ప్రభుత్వంలో తమ మిత్రులకు నచ్చచెప్పలేక, మాట చెల్లించుకోలేని, మంత్రులు, కాంగ్రెస్‌ద్వారా వత్తిడి తెద్దామనే దొడ్డిదోవప్రయత్నా లవలంబిస్తున్నారా? ఏదయినా, అసలు ప్రశ్న, ప్లానింగ్ కమిషన్ ఉండటమూ, ఏప్రాపులేకుండా అడ్డగోలుగా పోవటమూ అనేది కానేకాదు. చేతిలో ఉన్న కలప, సున్నం, రాయి, మొదలైన గృహనిర్మాణవస్తువు లన్నిటినీ, స్టేడియంలు ఆర్టుగాలరీలు, నేషనల్ థియేటర్లు, నేషనల్ లేబరేటరీలు కట్టడానికే ఉపయోగించటానికీ, సమానజీవితపరిస్థితులు సమాననివసన అవకాశాలు, సర్వమానవులకు కల్పించాలనే కాంగ్రెస్‌సూత్రానికీ, సమన్వయం కుదురుతుందా? తలదాచుకొనేందుకు చోటులేని కాందిశీకులకు నివాసాలు కల్పించేందుకు, ఈ నిర్మాణాలను కాస్త వాయిదా వేయకూడదా? కాంగ్రెస్ నాయకులు ఒకవంక ప్లానింగ్ తీర్మానం ఆమోదిస్తూ రెండోవంక అనవసరపు కార్యకలాపములకు వెచ్చించటం, చాలా అసమంజసంగా కనబడుతుంది. అందరికీ తలదాచుకొనేందుకు ఇళ్లు కట్టేదాకా, నేషనల్ స్టేడియమ్‌లూ, నేషనల్ లేబరేటరీలూ ఆపకోవచ్చునే!

మరొక చిక్కు కూడా ఉంది. రాష్ట్రాలకూ రాష్ట్రాలకూ, రాష్ట్రాలకూ కేంద్రాలకూ మధ్య సామరస్యం కుదిర్చేందుకు ఈ ప్లానింగ్ కమిషనుకు కేంద్రప్రభుత్వం కన్నా కూడా ఎక్కువ అధికారాలున్నాయా అనేది ప్రశ్న.

అస్సాంవిషయం ఉదహరిస్తాను. "అస్సాంలో, ఎంత భాగ్యం పండించుకోటానికైనా అనంతమైన అవకాశం ఉంది. అడవులు, దున్నని భూములూ, గనులూ ఇల్లాంటివి ఉపయోగానికి తెచ్చుకోవాల్సిన సంపద చాలా ఉంది. ఇది ఉపయోగానికి తేవటంకూడా చాలా అవసరం. ఈ రాష్ట్రం దేశఆర్థికపునరుద్ధీపనానికి చాలా ఉపయోగించవచ్చు. కాని వెనకబడ్డ రాష్ట్రాలైన మధ్యరాష్ట్రం, ఒరిస్సాలలాగే, దీనికి కేంద్రం పూర్తిగా సహాయంచేస్తేనేగాని తనను తను బాగుచేసుకోలేదు" అని డాక్టర్ గ్యాన్ చందు వ్రాశారు. కాని అస్సాం ముఖ్యసమస్యను గ్యాన్ చంద్ సూచించలేదు. ఇక్కడ ధనాభావముకన్న మనుష్యశక్తిలోపమే ఎక్కువ. దేశవిభజనానంతరం పశ్చిమబెంగాల్ బిహారులలో, పాకిస్తాన్ హిందూకాందిశీకుల ఎద్దడి అధికమయింది. కాని "అస్సాం అస్సామీయులకుమాత్రమే" అంటూ, అస్సాం, తదితరులను రాష్ట్రంలో నిలవనియ్యటం లేదు. కాబట్టి అస్సాంఅభివృద్ధి కున్న అభ్యంతరం ఆర్థికం గాదు, రాజకీయం. మరి అస్సాంలో ప్రభుత్వమూ, కేంద్రంలో ప్రభుత్వమూ ఒకపార్టీవే. కాని కేంద్రప్రభుత్వం ఎల్లా ప్రయత్నించీకూడా అస్సాంను ఈవిషయంలో ఒప్పించలేకపోయింది. ఇంతటి బలీయమైన కేంద్రప్రభుత్వం చేయలేనిపని ప్లానింగ్ కమిషన్ చేస్తుందా?

డాక్టర్ గ్యాన్‌చంద్ చెప్పినదాన్నిబట్టి, రాష్ట్రాలకైన కాపిటల్ ఖర్చులు, 1946,47 నుంచీ 1949-50 వరకూ, 103 7 కోట్లని తేలుతుంది. రాష్ట్రాలపై రివిన్యూ ఖర్చులు 188.1 కోట్లనీ తేలుతుంది. మళ్లీ ఇందులో సివిలుఖర్చు రు/- 56.33 కోట్లు; నీటివనరు 34.98 కోట్లు; విద్యుచ్ఛక్తి 33 45 కోట్లు; అధికాహారోత్పత్తి ప్రచారఖర్చుతో సహా వ్యవసాయానికి 28.07 కోట్లు; విద్య 18.29 కోట్లు, పరిశ్రమలు. 8.39 కోట్లు; అడవులు 2.57 కోట్లు; సహకారం 2.221 కోట్లు; పశువైద్యం 1.81 కోట్లు. రాష్ట్రాల ఖర్చులో కేంద్రం భరించవలసింది 135.08 కోట్లు అవటంతో, రాష్ట్రాలు వీట్లపై పెట్టే వ్యయం తగ్గిపోయింది. సివిల్ వర్కుల ఖర్చు మొత్తమే 229 కోట్లు. ఈవిషయంలో డాక్టరు గ్యాన్ చంద్ ఇల్లా అన్నారు.

"ఈ మొత్తాలను వివిధరాష్ట్రాలకు పంచటంలోగాని, సివిలుఖర్చుకూ తదితర ఖర్చులకూ పెట్టుకున్న వ్యత్యాసాలుగాని, ఈపంపకంలో అవలంబించబడ్డ విధానంగానీ, ఏమీ సమగ్రనీయంగావు. రాష్ట్రాల అభివృద్ధిప్రణాళికల ఖర్చులకు కేంద్రసబ్సిడీ లివ్వాల్సిఉంటటంలో, రాష్ట్రాల అభివృద్ధిప్రణాళికలన్నీ ముందే కేంద్రంయొక్క ఆమోదంపొంది ఖర్చు అంతా కేంద్రంవంచే పింపుతున్నాయని గమనిస్తే ఈ విమర్శనిజం తెలుస్తుంది. యు. పి. రాష్ట్రం (ఉత్తరదేశ) మొత్తం అభివృద్ధిప్రణాళికవ్యయంలో నూటికి 55 వంతులు సివిల్‌వర్కులకే చెందుతుంది. ఈ ఖర్చు, తక్కిన రాష్ట్రాల అన్నిటిలోనూ గల ఖర్చుమొత్తంలో నూటికి 45 వంతుల కన్న ఎక్కువ ఉంది. ఇంతకన్న అభివృద్ధి ప్రణాళికలలో పరస్పరసమన్వయం లేదనేందుకు వేరే నిదర్శనం అక్కరలేదు."

ఈ విమర్శముగింపులో, ఈ సివిల్ ఖర్చు 56 కోట్లలో, 30 కోట్లు భవనాల మీదా, 26 కోట్లు రోడ్లనిర్మాణంమీదా ఖర్చుపెట్టారు. రోడ్లపై పెట్టిన ఖర్చులో ఒక్క యు. పి. రాష్ట్రానికే 13 కోట్లు ఖర్చుపెట్టారు. వెనకపడ్డ రాష్ట్రాలైన సి. పి., ఒరిస్సాలకు రోడ్లఖర్చుకు తలో కోటే మాత్రమే ఇచ్చారు. బీహార్ రెండు కోట్లు, రక్షణస్థానికంగా ముఖ్యమైన పంజాబ్ అస్సాంలకు తలోకోటి మాత్రం, పశ్చిమబెంగాలుకు రెండుకోట్లకు తక్కువగానూ ఖర్చుపెట్టారు. బొంబాయి, యు. పి. లాగా చాలా అభివృద్ధిలోఉన్న రాష్ట్రం అయినా దానికి దాదాపు 2½ కోట్లూ, మద్రాసుకు సుమారు అంతమాత్రంగానూ ఖర్చు పంచారు. ఇతర రాష్ట్రాలకు స్వయం బాధ్యతఉన్న సంఘసేవాకార్యాలమీద ఖర్చు చాలా హీనంగాఉంది.

రాష్ట్రాల అభివృద్ధిని గురించి, తను తెల్పిన ఈ యథార్థవిషయ విమర్శలో, రాష్ట్రాలు స్వయంగా తమ ఆర్థికాభివృద్ధులను ప్లాను చేసుకోటం, అనే ముఖ్యాంశాన్ని వదిలేశారు.

కేవలం వెనకబడ్డ రాష్ట్రాలకుతప్ప, తక్కిన రాష్ట్రాలకు కేంద్రం సహాయం చేసేటప్పుడు, ఆ రాష్ట్రం తన ఆర్థిక సంపత్తిని సమీకరించుకోగల శక్తిని విచారించి సహాయం చేయాలనే సూత్రం సర్వత్ర ఒప్పుకొన్నదే. భారతదేశంలో రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చిన గ్రాంటులు, అప్పులు, మొత్తం వాళ్ల అభివృద్ధి పణాలికల ఖర్చులో ఈ శాతములో ఉంటూవచ్చింది.

పంజాబు	నూటికి	99 పాళ్లు
ఒరిస్సా		86
అస్సాం		84
ప. బెంగాలు		83
బీహారు		65
సి. పి.		56
యు. పి.		55
మద్రాసు		36
బొంబాయి		23

బిహార్, బొంబాయి, యు. పి. రాష్ట్రాలు, తమ ఆదాయాలలో అధికభాగం, సద్యఃఫలహీనమైన పనులకే ఖర్చుపెట్టుతున్నాయి. అల్లాంటప్పుడు వారి అభివృద్ధిప్రణాలికల ఖర్చు వారే భరించాలని కేంద్రం నియమించిఉండాల్సింది. కేంద్రం ఇస్తూన్న గ్రాంటులవల్ల, అప్పులవల్ల, రాష్ట్రాలు చాలా అభాజనపు స్థితిలోకి వచ్చాయి. మద్రాసులో, నూతులు బాగుచేసే ప్రణాలికను, కేంద్రంనుంచి గ్రాంటు రాలేదన్న మిషతో ఆపుకొన్నారు. నిజానికి రాష్ట్రాలకు మంత్రివర్గప్రభుత్వాలను తొలగించి, కేంద్రమే ఢిల్లీ నుంచి సర్వమూ చూసుకొంటే, సామాన్యపౌరునికి పన్నుల భారమైనా కొంత తగ్గి సద్వినియోగం జరుగుతుందేమో!



జంబుక విద్యాలయం

మూలం :
శ్రీ హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ

అనువాదం :
యస్. వి. హనుమంతరావు

పూర్వ మొక అడవిలో ఒక నక్క నివసిస్తూవుండేది. సాధారణంగా నక్కలు జిత్తులమారివి. వానిలోనూ యీ నక్కకు అగ్రస్థానం.

ఈనక్క కేపనియు లేదు. ఏపని చెయ్యాలో దానికి తెలీదు. కష్టపడి పనిచేస్తేతప్ప ఒక ప్రాణి జీవించటానికి అర్హత లేదని నక్కకు బాగా తెలుసు.

తనకు సరియైన వుద్యోగంకోసం ఆలోచించి ఆలోచించి, చాలా రాత్రులు నిద్రలేకుండా ఆలోచించడం మొదలెట్టింది.

ఒకనాడు హాయిగా నిద్రపోయిన అనంతరం దాని కొక ఆలోచన తోచింది. తానొక బడి స్థాపించి, ఆబడికి తానే వుపాధ్యాయుడైపోతే! భేష్! ఏంచక్కటి ఉపాయం! ఇలా ఆలోచించటానికి కారణం లేకపోలేదు. ఆ వనరాజైన మృగరాజుకు, 'చక్కని గుమాస్తాలు' లేనందున రాచకార్యాలు కుంటుబడుతున్నవని, ఉండే గుమాస్తాలు తమ పనిని సరిగా నిర్వర్తించటంలేదనీ అభిప్రాయపడుతోందిట. అందుకని నక్కకీ యభిప్రాయము తోచింది.

అది వెంటనే బయలుదేరి అడవిలోని జంతువులన్నింటితో తను స్థాపించబోయే బడివిషయం చెప్పింది. తన నల్లనిశరీరంపై "జం॥ వి॥ ఆ॥" అనే యర్రటి అక్షరాల్ని ధరించింది. ప్రతీవారు ఆ అక్షరాల్ల అర్థాన్ని కనుగొనటానికి చాలా ప్రయత్నించారు గాని, చివరకి కనుగొనలేకపోయారు. నక్కే సంతోషంతో సగర్వంగా చెప్పింది. "జం అంటే జంతుజాల, 'వి' అంటే 'విద్య' 'ఆ' అంటే 'ఆలయం' ఇప్పుడు తెలిసిందా? 'జంతుజాలపు విద్యాలయ'మని అనింది. మిడుతలు, చిన్నచిన్న పురుగులు, గొల్లభామలు, తాబేళ్ళు, తేళ్ళు, కప్పలు, ఒకటేమిటి ఆచుట్టుప్రక్కల వుండే సకలజంతువులు తమ తమ బిడ్డల్ని జంబుక విద్యాలయంలో చేర్చినవి.

ఇట్లుండగా ఒకనాడు ఆసమీపములో వుండే ఒక కొలనులోని ఒక వృద్ధమొసలి నక్కయింటికి వచ్చి "ఉపాధ్యాయమహాశయా! తమతో రెండు మాటలు మాట్లాడాలని వచ్చాను." అన్నది. "ఓ. ఒకటేమిటి మీ యిష్టమొచ్చినన్ని మాటలు మాట్లాడొచ్చు" అంది నక్క. "మొసలి చెప్పసాగింది.

"నా కేడుగురు బిడ్డ లున్నారు వారికి తల్లి లేదు. తల్లిఅయినా, తండ్రిఅయినా నేనే. తమ విద్యాలయంలో వారిని చేర్పించాలని వచ్చేను. నా బిడ్డలేగనుక విద్యావంతులు గాకపోయినట్లైతే మీచేతిచలువవల్ల వృద్ధికి వచ్చిన యీ మండ్రకాయబాలురు, కప్పబాలురు నా కుమారులను వెక్కిరిస్తారు. కాబట్టి నామనవి వినండి" నక్క యే యాక్షేపణ లేకుండానే అనగానే మొసలిపిల్లలను తన విద్యార్థులుగా అంగీకరించెను.

"నూత్న పద్ధతుల్లో మీరు విద్యాబోధ చేస్తారని విన్నాను." అంది మొసలి.

"పురాతనపద్ధతుల్ని నేను విశ్వసించను మొసలిగారూ!" అంది నక్క.

"నాబిడ్డలు తెలివిగలవారౌగ అనుకుంటా" నంది మొసలి.

"ఓ! ఏ విద్యా లేకయే వారి

కండ్లు విద్యాధికుల కండ్లవలె మిల మిల మెరిసిపోతున్నయ్. వారి సంగతి ఒక వారం రోజుల్లో నే ముగిస్తానని నాకు పూర్తిగా విశ్వాస ముంది" అంది నక్కగారు.

మొసలి ఆశ్చర్యపోతూ అంది—"ఏమిటీ! ఒక్క వారంలోగానా? మీకు గల విద్యాప్రతిభ అసామాన్యమైనది." నక్క చెప్పింది - "నే నెప్పుడూ పనిని తొందరగానే ముగిస్తా" నని.

మొసలి సెలవుతీసుకొని అంది - "ఐతే ఈ వారాంతంలో నేను తిరిగి వచ్చి నా బిడ్డల్ని తీసుకపోతా. నమస్తే" నక్కకూడా "నమస్తే" అంది—

మొసలి చాలా సంతోషిస్తూ తన నివాసస్థానమైన ఆ నదిలో కెళ్లిపోయింది. నక్క మృగరాజుగారికి నచ్చిన నూత్న పద్ధతుల్లో విద్యాబోధ సాగించింది. ప్రతి దినము ఉదయమున ఒక్కొక్క మొసలి పిల్లను ఫలహారంగా గ్రహిస్తూ వచ్చింది. ఆరుదినాలకు ఆరు మొసలి పిల్లలు గుటకాయస్వాహా అయినవి. పెద్ద మొసలి పాపం! తన పిల్లల గురించి యేమి తలుస్తోందో!

ఏడవరోజు మొసలి అనుకొంది- "ఈపాటికంతా విద్యాగిద్యా అయిపోయుంటుంది. పోయి నక్కతో మాట్లాడివస్తా."

నక్క తన విద్యాలయంబయటి వైపున మొసలి నుంచోడం చూచి ఆశ్చర్యపోయింది. కాని తన బుద్ధికుశలత ఉపయోగించింది. ముమ్మారు వంగి వినయపూర్వకంగా మొసలిని లోని కాహ్వానించింది. నేను మీ బిడ్డల పిలుచుకొచ్చేలోపుగా తాము కొంచెం కూర్చోండి. అంది నక్క.

మొసలి నక్కచేసే గౌరవానికి ఉబ్బితబ్బిబ్బైపోయింది. అది అనుకోసాగింది- "నక్కలు జిత్తులమారి వని లోకం అంటుంది. కాని ఈనక్కయొక్క వినయవిధేయతలు చూస్తే లోకం కేకలం అపవాదు వేసినట్టుగా వుంది." నక్క లోనికి వెళ్ళి మిగిలి వున్న ఒక్క మొసలిని ఆ రంధ్రముగుండా యేడుపర్యాయాలు పైకి పంపించింది. మొసలి తన యేడ్గురు పిల్లలు సుఖంగా వున్నా రనే నమ్మింది. నక్క బయటికి వచ్చి సంభాషణ ప్రారంభించింది. "మీ బిడ్డలు చాలా తెలివిగలవండీ మొసలిగారూ! త్వరలో తమ విద్యాభ్యాసాన్ని ముగిస్తాయి."

మొసలి చాలా సంతోషించింది. తన బిడ్డలు ఒకవారంలో లేక రెండు వారాల్లో లేక కొన్ని వారాల్లోనైనా విద్యావంతు లౌతారు. అనుకొంది. పాపం! విద్యను నేర్పే అయ్యవారే తన బిడ్డల్ని ముగించేస్తా డని దాని కేం తెలుసు.

"జంతుజాలపు విద్యాలయము" రెండుశతాబ్దాలపాటు కొనసాగింది. వనరాజైన సింహము ఆ విద్యాలయానికి తమ ఆశీర్వాదాల్ని తెలిపింది.

★ లీలావతి ★

శ్రీమతి ఇవటూరి మురళీసుందరి

చాలాసంవత్సరముల క్రిందట సహ్యాపర్వత మునకు సమీపములో విజ్జలవాడ అను గ్రామములో భాస్కరాచార్యుడను పండితుడు గలడు. ఇతడు సిద్ధాంతి శిరోమణి అను గ్రంథమును రచించెను. ఈతడు జ్యోతిశ్శాస్త్రములో ఆరితేరినవాడు. ఆచార్యునికి లీలావతి అను కుమార్తె కలదు. ఈమె తండ్రి ఈమెజాతకమును పరీక్షించి వివాహమైన కొద్దికాలముననే విధవ యగు నని తెలిసికొనెను. అందువలన ఆయన ఎక్కువ ఆయుస్సుగల పెండ్లి కొడుకుకోసరమును,విధవ కాకుండా యుండుటకు కావలసిన మంచి లగ్నముకొరకును వెదుక నారంభించెను. ఆచార్యుడు వరుని తీసికొనివచ్చెను. లగ్నమునుకూడా పెట్టెను. పెండ్లి పీటలమీద వధూవరుల నిద్దరిని కూర్చుండపెట్టిరి. పురోహితుడు కూడా ప్రక్కనే కూర్చుండి యుండెను. ఆచార్యులు లగ్నము వచ్చినవేళ తెలిసికొనుటకై ఒక పెద్ద గిన్నెనిండా నీరుపోసి దానిపైన సన్నని రంధ్రముగల ఒక పాత్రను పెట్టెను. ఆరంధ్రముగుండా నీరు పైకి పోయి యెప్పుడు ఆ గిన్నె నిండి మునుగునో అప్పు డాలగ్నము మంచి లగ్నముగా నిశ్చయించెను. లీలావతి బాగుగా అలంకరించుకొనెను. ఆమెతలపైన ముత్యాల హార ముండెను. అట్టిసమయమున లీలావతి గిన్నె మునిగినదో లేదో అని తొంగిచూచెను. ఇంతలో ఆమె తలమీదనుండి ఒక ముత్యము జారి

(40 వ పేజీ చూడుడు)

కథానిక:

సూటిప్రశ్న

(వంగమూత్రృక ననుసరించి)

"అమరేంద్ర"



నిషా బాగా తలకెక్కినాక కొంచెంసేపు మౌనంగా కూచుని అశోక్ ఒక కూని రాగం అందుకుని "నాకు సంగీతం వినాలని వుంది" అన్నాడు.

[illegible] హీనదృష్టితో చూస్తూ "అయితే టాక్సీ పిలూ. డబ్బు నే ఇస్తాలే" అని జేబులోంచి కేవిగా ఒక నోట్ల కొంత తీసి బల్లమీద పడేశాడు.

"శ్వేతమాట. నవ్విస్తావూ? అశోక్‌లాంటి మేరుపర్వతం దగ్గరవుంటే నవ్వి నవ్వటమేమిటి? ఎవరైనా నవ్విపోతారు" అన్నాడు ఇంకో నిషాభాయి అమల్. కోపంగా అశోక్ బల్లమీద చేత్తో చరిచి "ముందు టాక్సీ పిలూ. సూటిగా రాణీయింటికి పోదాం పదండి" అన్నాడు.

అప్పటికే మస్తుగా ముస్తాబుచేసుకుని రాణి ఎదురుచూస్తూవుంది. ఆమె కంటపడగానే అమల్ ఒకసారి ఎగాదిగా చూసి "పసందుగా వున్నావ్ రాణీ" అన్నాడు. రాణి ఒక చిరునవ్వు మెరిపించి అందరినీ కూచోమని అన్నది.

"నీపాట వినాలని వచ్చాం రాణీ" అన్నాడు వినోద్.

"ఏం పాట పాడమంటారో సెలవివ్వండి" అంది రాణి.

అమల్ అడ్డంవచ్చి "ఏదో ఒకటి నీకు తోచిన పాట. విరహాన్ని గురించో, సమాగమాన్ని గురించో, ప్రణయకలహాన్ని గురించో ఏదైనా సరే పాడు." అన్నాడు.

అమల్ స్థితి చూసి రాణి నవ్వు ఆపుకోలేకపోయింది. ఇంకోళ్ళచేత డబ్బు ఖర్చు పెట్టించి తను సీసాలమీద సీసాలు ఖాళీచేసి పారెయ్యటంలో అతను మొనగాడు!

"అలసింప కో ప్రియా! నిలువవోయి రేయి" అని అందుకుంది రాణి. పాటతరవాత పాట, ఎన్నో తీయని పాటలు పాడింది రాణి. కొంతసేపటికి అమల్ దివాన్‌మీద పడిపోయి డొగ్గటం మొదలుపెట్టాడు. వినోద్ కింద పడిపోలేదుకాని అతని తల మాత్రం అతనికి తెలియకుండా పాటకి తాళం వేస్తున్నట్లు వూగిపోతోంది.

బైట వాన కురుస్తూనేవుంది. మూసివున్న గాజుకిటికీతలుపుల్లోంచి అస్పష్టంగా వున్న దృశ్యాలని అశోక్ చూస్తూకూచున్నాడు. మాట్లాడదామంటే పెగిలిరావటం లేదు. మునుపటిలాగా కులాసాగా మాట్లాడకుండా ఏదో సంకోచం అతన్ని అడ్డగిస్తోంది.

రాణి పాట ఆపేసి అశోక్ చెయ్యి పుచ్చుకుని "మాట" అని చెప్పి గదిబైటికి తీసుకువెళ్లింది. అశోక్ బైటికి వెళ్ళి వసారాలో పిట్టగోడకి ఆనుకుని రాణిముఖంకేసి చూస్తూనిలబడ్డాడు.

అతనితో కొన్ని పరుషమైన సంగతులు మాట్లాడాలని రాణి అశోక్ చెయ్యి గట్టిగా పట్టుకుని బైటికి తీసుకువచ్చింది. కాని మత్తు పూర్తిగా వదలని అతని ముఖంకేసి చూసేసరికి ఆమెకి నోరు రాలేదు.

కొంచెంసేపు వున్నాక అశోక్ "ఎందుకు నన్నిక్కడికి పిలుచుకొచ్చావ్? ఏమిటి సంగతి?" అని కరుకుగా అడిగాడు. రాణి అతని కరుకుప్రశ్న విని ఒకసారి అతనికేసి చురుకుగా చూసి, నిట్టూర్పు విడిచింది. "నాలుగురోజుల్నుంచి దర్శనమే లేదే?" అని అడిగింది.

"రావటం లేదు" అన్నాడు అశోక్.

"శోభకి ఎక్కువగా వుందా? అమ్మాయికేం లేదుకదా?" అని రాణి అడిగింది.

"ఆందోళన ఏమీ అవసరం లేదు"

"అయితే ఇప్పుడే వెళ్ళిపోతారా?

అశోక్ రిస్టువాచ్‌కేసి చూసి "అవును వెళ్ళాలి. అదుగో అప్పుడే తొమ్మిది అవుతోంది" అన్నాడు.

"అయితే వెళ్ళండి" అని రాణి అతని చెయ్యి వదిలేసింది. చిరునవ్వుతో తన గది కేసి వేలుతో చూపిస్తూ "మరి వాళ్ళని ఏం చేస్తారు?" అంది.

"నిజమే. ఇదొక సమస్యే" అని అశోక్ నవ్వాడు.

"ఈ నిషాలో వాళ్ళని ఇక్కణ్ణుంచి ఎల్లా తీసికెళ్తారు?"

"నాకు తోచటం లేదు. ఏం చెయ్యను?" అన్నాడు అశోక్.

"నే నేం చెయ్యను?" అంది రాణి.

"అక్కడే వుండనీ"

"అమ్మ బాబోయ్. ఇంకేమైనా వుందా?" అని భయంతో అరిచింది రాణి. అశోక్ రాణిచేతులు పుచ్చుకొని దగ్గరికి లాక్కుని "ఒక్కరాత్రేగా, వాళ్ళని వుండ నియ్యరాదూ?" అన్నాడు.

"మీరు వెళ్ళిపోతున్నారు. నే నొక్కత్తెనీ వాళ్ళతో యాతనపడగలనా?"

"అదేమిటి రాణీ, వింగా మాట్లాడతావు? ఇటువంటి మనుషులతో మెలగటం నీకు కొత్తా?"

రాణిముఖం పాలిపోయింది. బాధతో మనసు చివుక్కుమంది. ఎల్లాగో సంబాళించుకొని "నాకు కొత్తకాదులెండి. కాని ఇటువంటి తాగుబోతుల్ని నా ఇంట్లో దిగవిడిచి వెళ్ళిపోయే పెద్దమనుషులు నాకు ఎంతెంత డబ్బిస్తారో తెలుసా? నువ్వేం ఇవ్వగలవు? వాళ్ళ కారుడ్రైవర్ల కున్న తాహతు కూడా నీకు లేదుమరి" అని పెళుసుగా అంది.

అశోక్ కోపంతో పళ్ళు పటపట కొరుకుతూ రాణికేసి చూపులతో నిప్పులు చెరుగుతూ "అయితే దీనికి మామూ లెంతో చెప్పరాదూ? ఇప్పుడే పారేస్తాను" అన్నాడు.

తను అంత దురుసుగా మాట్లాడినందుకు రాణిమనసులో నొచ్చుకుంది. అశోక్ చేతి వేళ్ళని తన చేతుల్తో నిమురుతూ లాలనగా "ఎందుకండీ అంతకోపం!" అంది.

ఆరాత్రికి విలాస్, అమల్ అక్కడే వుండేట్లుగా పరిష్కారం అయిపోయింది. అశోక్ ఇంటిదారి పట్టాడు.

ఇంటికి వెళ్ళే సరికిబాగా పొద్దుపోయింది. జబ్బుగావున్న అతని భార్య ముఖం గోడవైపుకి తిప్పుకుని పడుకునివుంది. అతని ముసలి తల్లి కునికిపాట్లుపడుతూ ఆవలిస్తూ రోగి మంచందగ్గర కూచునివుంది.

అశోక్ బూట్లు టకటకలు విని తల్లి ఉలిక్కిపడి లేచి "శ్, మెల్లిగా రా. శోభ ఇప్పుడే కళ్ళు మూసుకుంది" అని హెచ్చరించింది.

శోభ గాఢనిద్ర పోతున్నట్లు కనిపించింది. అశోక్ ఇంట్లోకి వెళ్ళి గబగబా భోజనం ముగించి వచ్చి చూసేసరికి శోభ పక్కమీద లేచి కూచుని నవ్వుతూ కనిపించింది.

"ఇదేమిటే? నువ్వు నిద్రపోవటంలేదా?" అని ఆశ్చర్యంగా అడిగాడు అశోక్.

శోభ బదులుచెప్పకుండా పకపకా నవ్వింది. ఆమెబుజాలని చేత్తో నిమురుతూ "ఏమిటి? డాక్టరు ఏం చెప్పా డివాళ?" అని అడిగాడు.

"ఏం చెబుతా డాయన? సగ్గుజావా బార్లీనీళ్లూ క్వినామందూ తాగుతూ అస్తమానం పడుకునివుండమన్నాడు. ఆయనసొమ్మేం పోయింది? ఎన్నాళ్ళయినా పడుకోమంటాడు." అంది శోభ.

సుస్తీతో నీరసించిన శోభముఖంకేసి రెప్పవాల్చకుండా చూస్తూ అశోక్ పక్కమీద కూచున్నాడు. ఆ చూపుకి శోభ సిగ్గుతో తలవంచుకుని "మీ రేం చేశారో గుర్తుందా?" అంది.

అశోక్ ఖంగారుపడి "ఏమిటి? నే నేం చేశానూ?" అన్నాడు.

"మరిచిపోయరు కాబోలు. కిందటిసారి మీకు సుస్తీచేసినప్పుడు ఇంట్లో మాకెవ్వరికీ నిద్రాహారా ల్లేవు. పాటలూ, పద్యాలూ, నవ్వులూ, శ్లోకాలూ, అందర్నీ తారెత్తించేశారు వారంరోజులు" అని శోభ గుర్తుచేసేసరికి అశోక్ బిగ్గరంగా నవ్వాడు.

ఇంతలో ఏదో ఊరేగింపుసందడి వినిపించింది. సన్నాయిపాట బ్యాండుమోతలో అణిగిపోతోంది. "ఇదే వస్తున్నట్లుగా వుందే వూరేగింపు" అంది శోభ.

"వస్తోందికాని నువ్వుమాత్రం కదలటానికి వీల్లేదు. ఇంత నీరసంతో ఊరేగింపు చూడకపోతే మునిగిపోయిందా?" అన్నాడు అశోక్.

"కాదండీ. ఒక్క నిమిషంసేపేగా. అంతగా నీరసంవొచ్చి నిల్చోలేకపోతే మిమ్మల్ని ఆనుకుంటానులెండి" అని బతిమాలింది.

ఇంతగా అడుగుతుంటే కాదనలేకపోయాడు అశోక్. ఇద్దరూ వసారాలోకి వెళ్ళి నిలబడ్డారు. వీధిఅంతా లైట్ల కాంతితోనూ వాద్యాల మోతతోనూ నిండిపోయింది. ఇంటిముందుగా వూరేగింపు వెళ్ళిపోయింది. "ఇక పద లోపలికి" అన్నాడు అశోక్. లంఖణాలవల్ల నీరసించిపోయిన శోభ ఈ కాస్తకదలికకే అలసిపోయి ఒక చేతిని భర్తబుజాన మోపి ఆసరాచేసుకుని మెల్లిగా లోపలికి నడిచివెళ్ళింది. "అందుకే నేను కదలద్దన్నాను. చూశావా, ఎంత నీరసంగా వున్నావో" అని అశోక్ మందలించాడు.

తలకింద దిండు సరిచేసి శోభని పక్కమీద పడుకోబెట్టాడు. భర్త చేతిని తన చేతుల్తో గట్టిగా చుట్టేసి శోభ ఎంతసేపటికీ విడవలేకపోయింది. ఇంలటి దయగల భర్తని పొందగలిగినందుకు లోపల ఎంతో పొంగిపోయింది.

తన భర్తనిగురించి అందరిముందూ మాట్లాడటం శోభకి బాగా అలవాటు. ఎంత అలవాటంటే అదొక జబ్బు అనిపిస్తుంది!

రోజూ మధ్యాహ్నంపూట వీళ్ళయింటికి సుందరి కాలక్షేపంకోసం వస్తుంది. ఆవిడతో అస్తమానం శోభ తన భర్తనిగురించే కబుర్లు చెబుతుంది. సుందరికి ముప్ఫైఅయిదేళ్లు వుంటయ్. ముగ్గురుపిల్లల తల్లి. ఆమెభర్త చనిపోయి అయిదోయేడు.

ఎందుకు శోభా భర్తఅంటే అంత ప్రేమ నీకు? నిమిషంకూడా విడిచి వుండలేవేం?" అంటుంది సుందరి వెటకారంగా.

"తప్పా? నీ కేమైనా అసూయగా వుందా?" అని నవ్వుతూ శోభ చనువుగా బదులు చెబుతుంది.

"పిచ్చిదానా! ఈ ముసలిదానిమాటలు నీ కివాళ వెగటుగా వుండొచ్చు. కాని నీకే తెలిసివొస్తుందిలే" అంటుంది సుందరి. శోభముఖంలోంచి చిరునవ్వు మాయమై

పోయి భయంతో పాలిపోయి "చెప్పు. దాచకుండా చెప్పు. తెలిసివచ్చే దేమిటో చెప్పు" అని సుందరిని గుచ్చిగుచ్చి అడుగుతుంది.

బెదురుతున్న శోభముంగురులని చేత్తో సవరిస్తూ "ఏం లేదే పిచ్చిపిల్లా! భర్తమీద అంత మమకారం పెంచుకోరాదు. మగవాళ్ల ప్రేమ పాదరసంలాంటిది. తెలిసిందా?" అంటుంది సుందరి.

ఇల్లా మాట్లాడుతుండగానే అశోక్ ఆఫీసు నుంచి తిరిగిరావటం అతని అడుగుల అలికిడి వినగానే శోభ అక్కణ్ణుంచి పరుగుతీయటం భర్త కళ్లపడగానే ఇందాకటి మాటలన్నీ మరిచిపోవటం జరుగుతుంది. నవ్వుకుంటూ సుందరి చీరకొంగు పరుచుకుని నిద్రకి ఉపక్రమిస్తుంది.

"అంత మంచి కబురు మానేసి ఎందుకు వచ్చావ్ శోభా?" అని అడుగుతాడు అశోక్. "నా యిష్టం!" అంటుది శోభ భర్తగోటు గుండీలు విప్పుతూ.

ఈవిధంగా సుందరి రోజూ మధ్యాహ్నం వేళ ఇక్కడే మకాం వేస్తుంది. శోభకి జ్వరంరావటంవల్ల ఆవిడకి కాలక్షేపంలేక తిక్కగా వుంది. ఇవాళ వొస్తూనే శోభ ఏదో నవల చదువుకుంటూవుండటం చూసి "అయితే ఇవాళ జ్వరం రానట్లేగా?" అంది.

"రాకేం వొచ్చింది. వొళ్లు పేలిపోతోంది. సంధికూడా పుడుతుంది" అని శోభ కోపంగా బదులు పలికింది. ఆనాడు అందరూ అదే ప్రశ్న అడగటంవల్ల శోభ విసిగిపోయింది.

సుందరి అంతటితో వూరుకోక శోభనుదుటిమీద చెయ్యివేసి చూసి "అబ్బే జ్వరం లేదు ఏమీలేదు" అని నవ్వుతూ పక్కనే వున్న మంచంమీద చతికిలపడి ఒక దిండు లాక్కొని వొళ్ళు వాలుస్తూ "ఇదుగో నమ్మాయ్, మీ ఆయన పక్కమీద పడుకుంటున్నాను. నీకు అసూయ కలగదుకదా?"అని చిరునవ్వుతో అంది. ఈమాట వినగానే శోభ కోపం ఎగిరిపోయింది. పసిపిల్లలాగా పకపక నవ్వుతూ "పట్టపగలు పడుకుంటే ఏం లాభమమ్మా?" అంది.

"ఓహో అల్లాగా. అర్ధరాత్రే వచ్చి పడుకుంటా ననుకో. అప్పుడు నువ్వేం చేస్తావో చెపుదూ?"అని సుందరి సరసాన్ని ఇంకొంచెం ముందుకి నడిపింది.

"అయితే నీమీద నాకు అసూయ ఎందుకుండదూ?"అంది శోభ.

"మరేం భయం లేదులే శోభా! నేను నిజంగా రాకూచున్నానా?"

"బలేబాగుంది. అయితే నాకుమటుకు నీమీద నిజంగా అసూయవేసిందనుకున్నావా?"

"కాదమ్మా శోభా. నిజంగా నాకు అటువంటి దురుద్దేశం లేదు. ఒకమనిషిమూలాన నేను ఎన్నిపాట్లు పడ్డానో చెప్పలేను. ఇంకోసారి ఆడజన్మ ఎత్తే దురదృష్టం కలిగినా పెళ్లిమటుకు వొద్దు బాబూ అని దేవుణ్ణి వేడుకుంటున్నాను"అంది సుందరి సరసాన్ని విషాదంలోకి దించుతూ.

శోభ గభాలున లేచి కూచుని సుందరికేసి చురచురా చూస్తూ "అయితే యేమిటి నువ్వంటున్న మాటలు? నీభర్త పోవటమే నీకు సంతోషంగా వుందా?"అని పరుషంగా అడిగింది.

"నా మాటలు నీకు అర్థం కావులే శోభా. అర్థంకావలసిన అవసరంకూడా నీకు కలగకూడదని కోరుకుంటున్నాను"అని సుందరి గంభీరంగా అంది.

తరవాత ఆనాటి సంభాషణ స్తంభించిపోయింది. ఇద్దరూ ఒకరికేసి ఒకరు చూసుకుంటూ ఎవరి ఆలోచనల్లో వాళ్లు మునిగిపోయి కూచున్నారు. చాలాసే పున్నాక సుందరి దీర్ఘంగా నిట్టూర్పు విడిచి వెళ్లిపోయింది. సుందరి వెళ్తుంటే మంచిది వెళ్లిరా అని మర్యాదగా సాగనంపటానికూడా శోభకి నోట మాటాడలేదు.

ఆఫీసునుంచి భర్త తిరిగి రాగానే శోభ "సుందరిభర్త ఎల్లాటివాడు? బాగా బాధలు పెట్టేవాడా?"అని అడిగింది.

"అవును" అన్నాడు అశోక్ త్వరగా బూట్లు విప్పుకుంటూ.

అశోక్ తన ప్రశ్నని చులకనచేస్తున్నందుకు శోభ బాధపడుతూ "కాదండీ, నిజం చెప్పండి. వేళాకోళానికి నేను అడగటం లేదు"అంది.

"నిజమా? నిజమే చెప్పానుగా. ఎందుకు నీకు అనుమానం? సుందరి వీపుమీద ఇంకా భర్తకొట్టిన దెబ్బల ఆనవాలు పోలేదా యేమిటి?" అని చిరునవ్వుతో అడిగాడు.

ఛా, వూరుకుందురూ, ఎవరైనా వింటే నవ్విపోతారు. ఎక్కడైనా గౌరవం కల మగాళ్లు పెళ్లాల్ని కొడతార్టాయేమిటి?"

"ఓహో అల్లాగా? బుగ్గలుమటుకే పిండుతారు కాబోలు!"

"ఊరుకోండి. ఇది వేళాకోళం కాదు నిజం చెప్పండి. ఇవాళ ఆవిడ తన భర్తవల్ల చాలా బాధలు పడ్డట్లు చెప్పింది. నిజమేనా?"అని గంభీరంగా అడిగింది శోభ. భార్యగాంభీర్యానికి అశోక్ నవ్వుకుని తనూ చివరికి గంభీరంగా "అవును నిజమే. ఆవిడ భర్త మంచిమనిషి కాదు"అన్నాడు.

శోభ ఆవేశంతో ఉత్తేజితురాలై పోయి "నిజంగానా? చెడ్డవాడా?"అని అడిగింది.

"అవును. అంతా చెడ్డవాడనే అనేవాళ్లు" అన్నాడు అశోక్.

"అల్లాగా. అయితే సుందరి ఎంత మంచిమనిషి! నేనయితేనా అటువంటి మనిషితో ఒక్కక్షణంకూడా కాపురం చెయ్యలేను. సుందరి కాబట్టి సర్దుకుంది. నేనైతేనా ఏం చేసేదాన్నో?"

"ఏం చేసేదానివో కొంచెం చెబుదూ" అన్నాడు అశోక్ కొంటెగా నవ్వుతూ.

"నేనయితే–" అని ఏదో అనబోయి శోభ మధ్యలోనే ఆగిపోయింది. తనే ఆపరిస్థితిలో వుంటే ఏం చేసేదో తెలియదు. బెదురుతూ భర్తగుండెల్లో తల దాచుకుని "అయినా మీరు అల్లాంటివారు కారుగా?" అంది.

ఈ అమాయకవిశ్వాసానికి అశోక్ మనస్సు కరిగిపోయింది.

"నీకు ఎల్లా తెలుసును? నేను ఎల్లాంటివాడినని?" అని అశోక్ అడిగాడు.


"ఆడదానికి అంతమాత్రం తెలియదా? బంగారమేదో కాకిబంగారమేదో ఇట్టే తెలిసిపోదుటండీ!" అంది శోభ గర్వంగా.

ఈ మాటలు అశోక్ గుండెల్లో ములుకుల్లాగా గుచ్చుకున్నయ్. పైకి మటుకు "అయితే నీ కెందుకీవిచారం? వెళ్లి టీ తెచ్చిపెట్టు శోభా!" అన్నాడు.

"ఎంత పొరబాటు చేశాను. ఇవాళ టీ తయారు చెయ్యటం మరచిపోయాను......" అని నొచ్చుకుంటూ గబగబా టీ కలిపి తీసుకు వచ్చి భర్తకి అందించి "ఇవాళ సాయంకాలం ఎక్కడికైనా వెళ్తున్నారా?" అని అడిగింది. అశోక్ ఆశ్చర్యంతో "దేనికి?" అని అడిగాడు. తను ఎందుకు అల్లా అడిగిందో శోభ చెప్పలేకపోయింది. మునివేళ్లతో చీరకొంగుచివరలని మెలివేస్తూ తల వంచుకుని నిలబడింది. అశోక్—

"అయితే ఇవాళ ఎక్కడికీ వెళ్లనులే" అన్నాడు.

(37 వ పేజీ చూడుడు)



రిపబ్లిక్ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ చే ప్రధాన న్యాయమూర్తి హీరాలాల్ జె. కనియా ప్రమాణస్వీకారం చేయించారు.

మన రాష్ట్రం, మన దేశం:

★ రిపబ్లిక్ అవతరణ ★

రిపబ్లిక్ అవతరించింది. నగరాల్లో భవనాలు రాత్రివేళ కొత్తవెలుగుల్లో ధగధగలాడాయి. పురుషులు, స్త్రీలు, పిన్నలు, పెద్దలు చోద్యం చూశారు. ఎక్కడచూసినా జెండాల తోరణాలే. బాలబాలికలు రంగురంగుల దీపాలు చూసి అవ్యక్తమైన ఏదో ఆనందోత్సాహాలలో ఊగిపోయారు. రిపబ్లిక్ వాళ్లదా లేక పెద్దలదా? వాళ్లకి వారసత్వం ఉందన్న సంగతిని మన పెద్దలు మరిచిపోకుండా ఉంటే కొంతవరకైనా మన దేశంవ్యవహారాలు బాగుపడవచ్చును.

రిపబ్లిక్ అనే మాటలో ఏదో ఆకర్షణ, శక్తి ఉన్నాయి. ప్రజలకోసం ప్రజల ప్రతినిధులు పరిపాలిస్తారు. ప్రజలందరికో సమాదేశంలో పరిశ్రమలు వ్యవసాయం విద్యుచ్ఛక్తి వృద్ధిఅవుతాయి. ప్రజలందరికీ సమానంగా జీవనవృద్ధికి అవకాశాలు లభిస్తాయి. ప్రజలందరి క్షేమంకోసం ప్రభుత్వం పాటుపడుతుంది. ప్రజలందరికీ నిష్పక్షపాతమైన న్యాయం లభిస్తుంది. రాజుల రాజ్యపాలనలో "ప్రభుత్వం మాది" అనుకోడానికి అంతగా అవకాశం లేక "మా ప్రభుత్వం" స్థాపించుకోవాలనే వాంఛ ప్రజల్లో కలగడం సహజమే.

రిపబ్లిక్ పేరు చెప్తే అనేక చరిత్ర ఘట్టాలు జ్ఞప్తికొస్తాయి. గ్రీక్ రోమన్ రిపబ్లిక్‌లు, ఫ్రెంచివిప్లవం, అమెరికన్ స్వాతంత్ర్యసమరం, రష్యన్ బోల్షివిస్టు విప్లవం, చీనా రిపబ్లిక్ సంస్థాపన మొదలైనవి జ్ఞప్తికి వస్తాయి. దేశక్షేమానికీ, ప్రజల అభ్యుదయానికీ కలలు గని ఆశయసిద్ధి పొందిన స్వాతంత్ర్యయోధులు జ్ఞప్తికి వస్తారు. ప్రప్రథమంగా ఫ్రెంచివిప్లవకారులు టెన్నిస్ కోర్టులో ప్రజల స్వయంనిర్ణయాధికారాన్ని ప్రకటించారు. స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, సమత్వసూత్రాల్ని లోకానికి ప్రకటించారు. అమెరికాలో వీనితోపాటు సౌభ్రాతృత్వం ప్రకటించబడింది. థామస్ పైన్ మానవ స్వత్వాల్ని నిరూపించాడు. యూరోపియన్ సామ్రాజ్యవాదం కింద నలిగిపోతున్న ఆసియా ప్రజలు ఈ ఆశయాలకోసం పోరాటం జరిపారు. కొన్నింట విజయం లభించింది. కొన్నింట ఇంకా లభించవలసిఉంది.

కాని ఈవారం భారతదేశంలో రిపబ్లిక్ ఉత్సవాలతో ఆనందంతో వేడుకలు జరుపుతున్న లక్షలాదిప్రజలకి రిపబ్లిక్ మాటలో ఏ ఆకర్షణ ఉందో తెలుసునా? స్వాతంత్ర్య సమరయోధులకథలూ, చరిత్రలోని ఈఘట్టాలూవారికి తెలుసునా? తెలియకపోవచ్చు. అయినా ధనవంతులు, నాయకులు ఉద్యోగులు, విద్యావంతులు జరుపుతున్న ఉత్సవాల్లో ఏదో ఉత్సాహకారణం ఉందనిమాత్రం గ్రహించిఉంటారు. అంటే "ఇకనించి మాబాధలు తీరే రోజులొచ్చినట్లున్నాయి" అని భావించిఉండవచ్చును. పేదల ఆశక్తి

ఉత్సాహానికీ వేరే అర్థం ఏముంటుంది? అయితే అందరికీ ఈ ఆశ గోచరించిఉంటుం దని కూడా చెప్పలేం. ముఖ్యంగా రాజ కీయాల గతిని కొంతైనా గ్రహించగలిగే వారిలో చాలమందికి ఈ ఆశ కలక్క పోయినా ఆశ్చర్యం లేదు.

ఢిల్లీలో 26 వ తేదీఉదయం గవర్నర్ జనరల్ శ్రీ రాజగోపాలాచారిగారు రిప బ్లిక్ ప్రతిష్ఠాప నయిందని ప్రకటించారు. రిపబ్లిక్ ప్రథమాధ్యక్షుడుగా శ్రీ రాజేంద్ర ప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. మంత్రు లందరూ, ప్రమాణాలు స్వీకరించారు. అధ్య క్షుడు రాజేంద్రప్రసాద్ ఢిల్లీనగరవీధుల్లో అయిదుమైళ్లు దూరం ఊరేగారు. అన్ని రాష్ట్రాల్లోనూ గవర్నర్లు మంత్రులు, హైకోర్టుజడ్జీలు ప్రమాణాలు స్వీకరించారు. గవర్నర్లు నగరాల్లో ఊరేగారు. అందరూ రిపబ్లికన్ రాజ్యాంగానికి భక్తివిధేయతలు ప్రకటించారు.

కొత్తగా అమెరికావలసవెళ్ళిన ఒక యూరోపియన్‌వద్ద పత్రాల్ని పరీక్షచేసిన తరవాత ఒక అమెరికన్ వలసశాఖాధికారి "ఇంక నువ్వు అమెరికా అధ్యక్షుడివి కావ డానికి నీకు హక్కుంది తెలుసా?" అని అడిగాడట. యూరోపియన్ తెల్లపోయాడు. "తెలుసా తెలియదా" అని అధికారి బల్ల గుద్ది గద్దించి అడిగాడు. "చిత్తం చిత్తం" అన్నాడు యూరోపియన్. తరవాత ఒక్క క్షణం ఆలోచించి "అంతవరకూ వద్దు కాని, ముందుగా అడుక్కోడానికి వీలుంటే చాలు" అన్నట్టు యూరోపియన్. "వీల్లేదు" అని గద్దించాడు అధికారి. అయితే మనదేశంలో పౌరులందరికీ రిపబ్లిక్ అధ్యక్షుడు కాగలిగే హక్కుంది. అడుక్కోడానికీ హక్కుంది.

స్వేచ్ఛాసమత్వసిద్ధాంతాలన్నీ బాగానే ఉన్నాయి. కాని అందరికీ తిండి, బట్ట, నివాసం ఎల్లా లభిస్తాయనేదే పెద్ద ప్రశ్న. అందరికీ ఇవి సమకూర్చడానికి ప్రభుత్వాలు కృషిచెయ్యాలని రాజ్యాంగంలో విధించ బడింది. మన కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎలా కృషిచేస్తాయో వాని ఫలితాలపైనే మన రిపబ్లిక్ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

ఆంధ్రరాష్ట్రం

1950 జనవరి 26 వ తేదీలోగా ఆంధ్ర రాష్ట్రాన్ని నిర్మించడం అసాధ్యమని చెప్తూ భారతప్రభుత్వం మద్రాసుప్రభుత్వానికి లేఖ వ్రాసింది. విభజన సంఘసూచనల్ని, మద్రాసుప్రభుత్వ నివేదికనీ చూసినతరవాత ఈ నిర్ణయానికి వచ్చినట్లు భారతప్రభుత్వం తెలిపింది.

"పట్టాభి-పటేల్-నెహ్రూ నివేదిక అంగీకరించబడిందని తలిచినందువల్లనే మొదట భారతప్రభుత్వం రాంధ్రరాష్ట్ర నిర్మాణానికి అంగీకరించింది. కాని విభజన సంఘనివేదికనీ, కొందరి రాయబారాల్నీ చూసినతరవాత నాయకత్రయనివేదిక అంగీకరించబడలేదని తేలుతోంది. చెన్న పట్నంభవిష్యత్తు, ఆస్తి అప్పుల పంప కాలు, సరిహద్దులు, ముఖ్యంగా బళ్లారిజిల్లా రాయలసీమలకు సంబంధించిన సరిహద్దులు,



మదరాసులోని ఆంధ్రవిద్యార్థి విజ్ఞానసమితి వార్షికోత్సవం. మంత్రి గోపాలరెడ్డిగారి అధ్యక్షతను జరిగింది.

తుంగభద్రప్రాజెక్టునిర్మాణం: ఈ విషయాలలో ఏకాభిప్రాయం కుదరలేదు. రాష్ట్ర విభజన జరపడానికిముందు ఈ విషయాలపై సమరసమైన అంగీకారం కుదరవలసిన అవసరం ఉంది" అని భారతప్రభుత్వం లేఖలో వ్రాసింది.

దీనిపైన వ్యాఖ్యానిస్తూ మద్రాసుప్రధాని శ్రీ పి. యస్. కుమారస్వామిరాజాగారు "అంగీకారం కుదరలేదంటే నేనొప్పుకోను" అన్నారు. అన్నిటా అంగీకారం కుదిరింది కాబట్టి వెంటనే ఆంధ్రరాష్ట్రాన్ని నిర్మించాలని మద్రాసుప్రభుత్వం పంపిన నివేదికను భారత ప్రభుత్వం విశ్వసించడంలేదనే విషయం స్పష్టమే. విశ్వసించకపోవడంలో ఆశ్చర్యం లేదు. విభజనసంఘసభ్యులు ఎనిమిది మందిలో శ్రీ ప్రకాశంగారుమినహా మిగతా ఏడుగురూ ఏకాభిప్రాయానికి వచ్చినమాట నిజమే. కాని తెలుగుసభ్యులు నలుగురిలో శ్రీ కళావెంకట్రావుగారు, ఇద్దరు మంత్రులు తమిళులు విధించిన షరతులన్నిటికీ తల లూప కేం చేస్తారనేవిషయం సమీపంలో ఉన్న మనకేకాక ఢిల్లీలో ఉన్నవారికి కూడా అర్థమయిందన్నమాట. ఈ షరతులన్నిటికీ అంగీకరిస్తే ఆంధ్రదేశంలో అసంతృప్తి చెలరేగుతుందనీ, కేంద్రనాయకులు గ్రహించిఉంటారు. ఆంధ్రులికి న్యాయం సమకూర్చాలని కేంద్రప్రభుత్వం భావిస్తే ఆంధ్రదేశం సంతోషిస్తుంది.

కాని భారతప్రభుత్వంలేఖలో అదే సూచన లేకపోగా "సమరసమైన సమాధానం కుదిరేవరకూ ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సమస్య పునరాలోచించబడదు" అని వ్రాయడంలో అర్థమేమిటి? సమరసమైన సమాధానం కుదర్చడానికి భారతప్రభుత్వం స్వయంగా కృషి చేస్తుందా? లేక ఆంధ్ర తమిళవర్గాలు తిరిగి ఈ సమస్యల్ని చర్చించాలంటారా?

విభజనసంఘాన్ని నియమించి రాష్ట్ర విభజనసమస్యలన్నిటిపైనా సమాధానాలు చేసుకోవాలని సూచిస్తూ భారత ప్రభుత్వం మద్రాసుప్రభుత్వానికి పంపిన లేఖలో "అంగీకారం కుదరని విషయాల పరిష్కారానికి భారతప్రభుత్వం పరిష్కర్తని నియమిస్తుంది." అని వ్రాశారు. ఇంతవరకూ పరిష్కర్తనెందుకు నియమించలేదు? ఆంధ్రరాష్ట్రనిర్మాణం ఇప్పుడు అసాధ్యమని తెలుపుతూ మద్రాసుప్రభుత్వానికి వ్రాసినలేఖలో పరిష్కర్త ప్రసక్తేనా ఎందుకు తేలేదు?

అదికాక ఆంధ్రరాష్ట్రం ఆర్థికపరిస్థితిని గురించి తిరిగి భారతప్రభుత్వం ఎందుకు సందేహం ప్రకటించవలసివచ్చింది? బడ్జెట్‌లో రెండుకోట్ల రూపాయలకి తక్కువగా కొరతఉంటే అది ఆలోచించవలసినదా? ఈ పద్ధతిని చూస్తే ఈనాడు భారతదేశంలో ఏరాష్ట్రమూ ఉండడానికి వీల్లేదు. కొరతలేని రాష్ట్రమే ఈనాడు లేదు. ఇది తెలిసికూడా కేంద్రప్రభుత్వం ఇదొక ప్రతిబంధకమన్నట్లు సూచించడం చూస్తే అసలు ఆంధ్రరాష్ట్రాన్ని నిర్మించే ఉద్దేశమే వారికి లేనట్లు అనుమానించవలసివస్తోంది. ఆ ఉద్దేశమే లేకపోతే కేంద్రప్రభుత్వం స్పష్టంగా చెప్పరాదా? మాటలిచ్చి తప్పడంవల్ల ప్రజల్లో నెహ్రూ పటేల్‌వంటి నాయకుల పట్లనూ, వారి వాగ్దానాలపట్లనూ విశ్వాసం క్షీణిస్తోంది. ఇప్పటికే ఆంధ్రదేశం ఒకపంక తమిళులు చేస్తున్న అన్యాయాలకీ, మరొక పంక కేంద్రనాయకుల అగౌరవాలకీ విసుగెత్తిపోయింది. ఈ స్వల్పవిషయాన్ని కూడా కేంద్రనాయకులు గ్రహించలేకుండా ఉన్నారని భావించాలా?

పరిష్కర్తను నియమించేవిషయంలో భారతప్రభుత్వం తన కర్తవ్యాన్నీ బాధ్యతనీ విడనాడకూడదు. ఇంకా ఆంధ్రదేశానికి మిగిలినది ఇదొక్కటే ఆశ. ఈ ఆశకూడా భగ్నమైతే ఇంక ఆంధ్రదేశంలో కాంగ్రెస్ ప్రతిష్ఠ నష్టంకాక తప్పదు. ఈ విషయాన్ని కేంద్రనాయకులు విస్మరిస్తే వారికి తెలపవలసిన బాధ్యత ఆంధ్రకాంగ్రెస్‌నాయకులపైన ఉంది.

రాయలసీమసమస్య నిప్పుడు తిరిగి తవ్వడం ప్రమాదకరం. నాయకులమని చెప్పుకుని తిరుగుతూ, ప్రజల అభీష్టాల్నికూడా స్వార్థరాజకీయతంత్రాలకోసం ప్రతిఘటించే మహామహులికి గుణపాఠం చెప్పవలసిన బాధ్యత ప్రజలది. శ్రీ ఆర్. సూర్యనారాయణరావు, శ్రీ నరసింహారెడ్డి, శ్రీమృత్యుంజయశాస్త్రిగార్లు ఆంధ్రరాష్ట్రనిర్మాణం రాయలసీమవాసులి కిష్టంలేదని నెహ్రూ పటేల్‌గార్లకు నివేదించారు. ఆంధ్రరాష్ట్రనిర్మాణం ఇప్పుడు సాధ్యపడదనడానికి ఇదికూడా ఒక హేతువని భారత ప్రభుత్వం తెలిపింది. వీరి వాదానికి ఆంధ్రరాష్ట్రనిర్మాణానికి ప్రతికూలించేకొన్ని ఆంగ్లపత్రికలు విరివిగా ప్రచారమిస్తున్నాయి. కేంద్రమంత్రివర్గం వీరి వాదానికి విలువ ఇచ్చింది. రాయలసీమలో వీరి నాయకత్వానికి వాస్తవంగా ఎటువంటి విలువ ఉన్నప్పటికీ, వీరివాదంపట్ల రాయలసీమ ప్రజలు తమ అభిప్రాయమేమో, ప్రజానీకంలో ఈ నాయకుల స్థానమేమిటో ప్రకటించవలసిన అవసరం వచ్చింది. సర్వవర్గాలవారూ ఈసందర్భంలో తమ అభిప్రాయం ప్రకటించాలి. ఆంధ్రరాష్ట్రనిర్మాణం జరక్కపోవడానికి రాయలసీమవాసులుకూడా కొంత నింద భరించాలి. ప్రజలు తమ అభిప్రాయాన్ని ఏ రాజకీయసమావేశంద్వారానో కేంద్రనాయకులకు తెలిపి తమపై నింద లేకుండా చేసుకోవాలి.

పై రాయలసీమనాయకులే కొందరు థార్‌కమిషన్ విచారణసమయంలోకూడా ఆంధ్రరాష్ట్రంలో రాయలసీమని చేర్చకూడదంటూ ఒక నివేదిక సమర్పించారు. అయితే వీరు కొందర్ని మభ్యపెట్టి వారి సంతకాలు సంతరించిన విషయం అప్పుడే బైటపడిపోయింది. థార్‌కమిషన్‌వారు వీరి నివేదికని ఆదరించలేకపోయారు. ఇటువంటి నాయకుల రాయబారాలు విని, ఈ సాకులతో ఆంధ్రరాష్ట్రనిర్మాణాన్ని వాయిదా వెయ్యడం వల్ల ఆంధ్రదేశంలో ఎటువంటి ఫలితాలు సంభవిస్తాయో కేంద్రనాయకులు గుర్తించడం లేదు.

ఇప్పటికైనా మించిపోలేదు. ఆంధ్రదేశాన్ని బలవంతాన చెన్నరాష్ట్రంలో ఉంచినట్లయితే పరిపాలన స్తంభించిపోవడం తథ్యం. ఆంధ్రరాష్ట్రనిర్మాణం జరక్క తప్పదు. వెంటనే భారతప్రభుత్వం వాదగ్రస్త విషయాల పరిష్కారానికి ఏర్పాట్లు చెయ్యాలి. ఆంధ్రరాష్ట్రనిర్మాణం ఎంత త్వరలో జరిగితే అన్నివర్గాలవారికీ అంత మంచిది. కాంగ్రెస్ తన ప్రతిష్ఠ దక్కించుకుని ప్రజల్లో తిరిగి విశ్వాసం కలిగించాలి. లేదా ఒకజాతి నవమానపరిచిన ఫలితం ఊరికేపోదు. ఇటు దురాశాపరులైన తమిళనాయకులు, అటు జాతిగౌరవాన్నైనా గమనించలేకపోతున్న కేంద్రనాయకులూ ఉత్తరోత్తరా పశ్చాత్తాపపడవలసివస్తుంది. [సీతారాం]

పండితాభిప్రాయాలు

"ప్రబల రాజాధిరాజ వీరప్రతాప
రాజపరమేశ్వరార్ధ దుర్గానరేశ
సాహితీసమరాంగణసార్వభౌమ
కృష్ణరాయేంద్ర కృతి వినిర్మింపుమనిరి."

పండితులు కోరగా తాను ప్రహృష్టాంతరంగుడై "ఆముక్తమాల్యద"ను రచించినట్లు చెప్పికొన్నాడు శ్రీకృష్ణదేవరాయులు. ఈయన కేవలం రాజుమాత్రమే కాడు. గొప్పపండితుడు. అందుకే యీాయనను పండితులు "సాహితీసమరాంగణసార్వభౌమ" అన్నారు. ఈయనకవిత్వం చాలా కఠినమైనది.

"అర్ధావాగ్విబుధ మ్మహోవచనక
వ్యాహార మాహోవచ
స్సిద్ధమ్మః కృతతాంగతః కలిరిత
శ్రీ సూక్తి విద్యాధర
మ్మిద్ధౌద్ధత్యమగాల్లయంహికుధియా
మిత్థం వదత్కిన్నర
మ్మద్ధిరాగ్రణి గెల్పు టుత్సవమునం
దయ్యెన్న భమ్మంతయున్."

ఈయన గ్రంథమంతా యిలాంటి గాఢ సంస్కృతపదాలతో రచించాడు. పండితులు "ఎరక్కపోయి వ్రాయమన్నాం" అనుకునేట్టు. తానంత పాషాణపాకంగా రచించినా పెద్దన్నమాత్రం "కృతి రచింపుము నాకు శిరీషకుసుమపేశలసుధామయోక్తుల పెద్దనార్య" అని కోరాడు శ్రీకృష్ణదేవరాయలు.

పూర్వం పండితుల అభిప్రాయాన్ని పురస్కరించుకుని గ్రంథరచన కుపక్రమించేవారు. కాలక్రమాన్ని ఆ పద్ధతి పోయి రచనలను చూసి పండితులు అభిప్రాయా లివ్వడంలోకి మారింది.

పండితాభిప్రాయాలు చాలా పుస్తకాలలో చూస్తూంటాం. ఇప్పటి పుస్తకాల్లో అసలు గ్రంథానికంటె పండితాభిప్రాయాలే యెక్కువగా వుంటున్నాయి పంపరపనస కాయలోని పైదూదిభాగంలాగ. ఆ అభిప్రాయాలన్నీ చదవడం అయితే కాని అసలు విషయం రాదు. తీరా అన్నీ చదివి అసలుగ్రంథం చదివితే పండితాభిప్రాయాలతో చదివేవారి అభిప్రాయం కలవదు. దానికి "భాష్టికుకకాంతకం" వుంటుంది. పండితాభిప్రాయాలలో ప్రతి ఒకరూ రచయితను అద్భుతకల్పనాసామర్థ్యం, రచనాచమత్కృతిగలవాడినిగా వర్ణిస్తారు. యేదీ కనబడదా గ్రంథంలో చదివేవారి కొక్కొక్కప్పుడు.

వెనక వొకాయన వొక పండితునిదగ్గరకి వెళ్లి తను రచించిన పుస్తకాన్నిచ్చి "అయ్యా, యీ నా పుస్తకానికి రెండవ కూర్పు వేయిస్తున్నాను. దయచేసి దీనిని గురించి మీ అభిప్రాయాన్ని ప్రసాదించాలి" అని కోరాడు. ఆయన అందుకు వొప్పుకుని కొద్దిరోజులలోనే "ఈ స్వర్ణసుధనామూలాగ్రముగ చదివితిని. ఆ పదగుంఫనమేమి, ఆ భావములేమి, ఆ పాండిత్యమేమి, అద్భుతము"అంటూ కవిని ఆశీర్వదిస్తూ తన అభిప్రాయాన్ని వ్రాసిపంపాడు.

ఆపుస్తకంపేరు స్వర్ణసుధ కాదనీ, అది వెనకఅట్టమీద వున్న పేరనీ, అది వొక

~~~~~*~~~~~*~~~

శ్రీమతి వేదులమీనాక్షీదేవి

~~~~~*~~~~~*~~~

ఆయుర్వేదఔషధమనీ, "అడ్వర్టైజుమెంటు"కోసం వెనక అట్టమీద వేయించారనీ కాలక్రమాన్న తెలిసింది. పుస్తకం చదవకపోతే పీడాపోయె. పేరైనా చూడలేదు. అభిప్రాయంమాత్రం వ్రాసిపంపాడా మహనీయుడు.

అభిప్రాయాల నడిగినప్పుడు, సహృదయుడు రాయనంటే నిందలు మోపుతారు. అందుచేత లోకానికి వెరిచి ఆ గ్రంథం యెల్లాంగవున్నాసరే "ఇంతటి గ్రంథం వెలువడ్డం మన అదృష్టం" లాంటిమాట లేవో వ్రాయాలి "ఏమని యిచ్చాడీ అభిప్రాయం? పుస్తకం చదివి యిచ్చాడా? చదవక యిచ్చాడా"? అని కొందరు దుయ్యబట్టుకున్నాసరే!

ఈమధ్య వొక రచయిత తను వ్రాసిన గ్రంథానికి అభిప్రాయం యిమ్మని పొరుగూళ్ళో వున్న వొక పండితుణ్ణి అడిగాడు. ఈవిధంగా తెల్లవారితే యెన్నో వస్తూంటాయి ఆయనకి. అందుచేత ఆయన వొక పద్ధతి అవలంబించాడు. తను అభిప్రాయం యివ్వదలచుకున్న పుస్తకాన్ని తెరిచి ఆపేజీలో వున్న వొక పద్యాన్నో, నాలుగు వాక్యాలనో అవి యెల్లావున్నాసరే "బాగున్నాయి" అనేందుకు దృష్టాంతాలుగా తీసుకుని "యీగ్రంథం అద్భుతంగా వుంది" అని వ్రాసేసేవాడు. ఇల్లాటూకిగా వ్రాసినా అన్నం తినడానికైనా తీరుబడి వుండేది కాదు ఆయనకు.

మా రావు పుస్తక మేదో వ్రాశాడు. దాన్ని నేను చదివాను. అందులో యేభావం కనబడకపోగా అగమ్యగోచరంగా వుంది. పైకి అంటే వాడికి కోపం వస్తుందని వూరుకున్నాను. ఓనాడు రావు నాదగ్గరకి వచ్చి "అక్కా ఈ రోజుల్లో పీఠిక యింకొకరిచేత వ్రాయిస్తున్నారు. ఇలాంటివి వ్రాసి యివ్వడంలో సమర్థుడైనఆయన వున్నారు. ఆయన్ని అడుగుదాం అనుకుంటున్నాను. నీ వుద్దేశం యేమిటి?" అని అడిగాడు.

నాయనా, యెవరి పీఠికలూ, అభిప్రాయాలూ మనకి వద్దు. ఈ రోజుల్లో వొకళ్ల నడగడంకంటె యెవరి పీఠిక వారే వ్రాసుకోవడం అంత వుత్తమం లేదు. ఒకరి నడిగితే నీ పుస్తకం "బాగుంది" అంటారు "బాగుండలేదు" అంటారు. ఎందుకొచ్చిన బాధ?" అని సలహా చెప్పాను.

నా సలహా నచ్చుతుందీ? "అలా కాదు వ్రాయిస్తేనే బాగుంటుం"దని తన నిశ్చితాభిప్రాయాన్ని తెలియజేశాడు.

కొద్దిరోజులకే మా రావుపుస్తకానికి "పీఠిక" వచ్చేసింది. "ఈ మహాశయునకు గ్రంథరచనయందు, అందులో కొత్తపద్ధతిలో వ్రాయడమందు వుత్సాహం వున్నట్టు తోస్తోంది. ఈరోజుల్లో ప్రజలకీ రకం రచనలే నచ్చుతాయి. ఈ గ్రంథంలో చెప్పతగ్గ విశేషాలేవీ కనిపించవు అక్కడక్కడ కొద్దిగా హాస్యరసంతప్ప. ఈ రచయిత మంచి సాంప్రదాయమైన పండితకుటుం

బమునకు చెందినవాడు. ఈయన ముందు ముందు ఉద్గ్రంథములు రచించగల సామర్థ్యం గడించగలడని ఆశిస్తున్నాను" ఇదే పీఠిక.

ఎవరైనా అడిగితే యిల్లాగేనా పీఠిక యివ్వడం? మావాడి ముఖం కళా, కాంతీ లేకుండాపోయింది పీఠిక చదివేటప్పటికి. "సరే పీఠిక వచ్చేసింది. ఇక నీ గ్రంథాన్ని అచ్చువేయించుకోవడమే తరవాయి త్వరగా ఆ పని కానియ్యి" అన్నాను వచ్చే నవ్వు ఆపుకుంటూ. "అక్కా, నాపూర్వులు పండితులనీ, నాది పండితవంశం అవడమువల్ల నా తరవాతవాళ్లు పండితులయే అవకాశం వుందనీ, యేసామర్థ్యం లేనివాడిని నేను మాత్రమేననీ, నా రచన యేడిసినట్టుందనీ యీ పీఠికవల్ల తేలుతోంది. "యెవరిచేతా వ్రాయించకని నువ్వు చెప్పినా విన్నాను కాదు. దీన్ని చింపేసి నా పుస్తకానికి నేనే పీఠిక వ్రాసుకుంటాను" అన్నాడు మారావు.

అభిప్రాయం అడిగేటప్పుడు ఆ వ్యక్తి యే విషయంలో పాండిత్యం సంపాదించాడో తెలుసుకుని మరీ అడగాలి. అల్లా కాకుండా యే తర్కశాస్త్రవేత్తనో, వ్యాకరణశాస్త్రవేత్తనో మామూలుపుస్తకాలకి అభిప్రాయం యిమ్మని అడిగేస్తారు చటుక్కుని.

ఒక వ్యాకరణపండితుడుండేవాడు. ఆయన వ్యాకరణంలో గొప్పవాడని ఆబాలగోపాలానికీ తెలుసు. వొకనాడు యీయన వద్దకొక స్కూలువిద్యార్థి వచ్చి తను గ్రామ్యంలో వ్రాసిన నవల నొకదానిని ఆయన కిచ్చి "దీనిని మీరు చిత్తగించి, అభిప్రాయం తెలియజెయ్యండి." అని కోరాడు. "రేపు రమ్మని ఆకుర్రవాడిని పంపేసి ఆరాత్రి చదివాడాయన ఆనవల. కథా సందర్భంలో "విధవ అనీ" "సంవత్సరీకము" అనీ "యేగు" అనీ మూడుమాటలు ఆయన దృష్టి నాకర్షించాయి. ఆ మూడుమాటలూ మూడు శూలాల్లాగ ఆయన్ని బాధించాయి హృదయానికి గుచ్చుకుని.

"సంవత్సరీకమా?"

"సాంవత్సరీకమా?" అనీ,

"విథవా?"

"విధవా?" అనీ

"ఏగు ధాతువులో అరసున్న వుందా? లేదా?" అనీ. సందేహాలు బయలుదేరి ఆయనప్రాణానికి బ్రహ్మాండసమస్యలైపోయాయి. గబగబా కాగితం తీసి వ్రాయడం మొదలుపెట్టాడు. ఇలాంటి సందేహాలే యిదివరకు వచ్చి పండితులు తర్జనభర్జన చేశారనీ, వొక శాస్త్రులుగారిలా అన్నారనీ, యింకో అవధానులుగారలా అన్నారనీ వారి వారి వాదోపవాదాలు వ్రాస్తూ, మధ్య మధ్య తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ నాలుగు పేజీల అభిప్రాయం వ్రాశాడు. అందులో కథయొక్క అల్లికలోని ప్రాశస్త్యంగురించిగాని, శైలిగురించిగాని లేకపోగా అవిద్యార్థిని "వ్యాకరణయుక్తంగా వ్రాయడం నేర్చుకోనాయనా, వ్యాకరణదోషాలు భరించలేను" అని మందలించి మరీ పంపాడు. పాపం ఆకుర్రవాడేంచేసుకుంటాడా నాలుగుపేజీల అభిప్రాయాన్ని?

"ఒకప్పుడందరి విమర్శనలకు గురిఅయిన భావకవులకు నేడు చ్ఛస్థితి వచ్చింది. ఈనాడు వాడవాడలవారే. రకరకాల భావాలను వెలడిస్తూ యీ నవ్యకవులు బయలుదేరి భావకవిత్వప్రాశస్త్యాన్ని నాలుగు దిక్కులా చాటుతున్నారు. వీరిలో శ్రీవర్మగారు ముఖ్యులు. వీరి రచన అద్భుతంగా వుంటుంది. వీ రీమధ్య వ్రాసిన "విడి చదువరుల నానందవార్ధిని తేల్చింది. వీరు పాత్రౌచిత్యాన్ని బాగా పాటించారు. ఈయనభావాలు అనంతవాయుపథాల్లో విహరిస్తయి" అంటూ వొక కవివశేణ్యుడు కొత్త పేరు దెచ్చుకొన్న ఆయన పుస్తకానికి అభిప్రాయం వ్రాసియిచ్చాడు. ఆ కవిపేరు చెబితే చాలు కట్టతెగిన యేరులాగ జనం ఆ పుస్తకాలకి యెగబడే రోజులవి.

చిత్రం యేమిటంటే ఆ కవి అచ్చువేయించిన మొదటికూర్పు రెండువేలూ, వారంలోనే శ్రీ కాకిల క్రింద ఖర్చైపోయాయి.



రిపబ్లిక్ తొలిఅధ్యక్షుడు, అధినివేశ ఆఖరు గవర్నర్ జనరల్

నవల:



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౧౬

ఇది శరదుత్సవసమయము. విజయదశమి, అందులో నీనాడు శ్రీ రుద్రదేవమహారాజులకు యౌవరాజ్యపట్టాభిషేక మైనది. దానికై దేశదేశములనుండి ప్రభువులు ధనికులు విద్వాంసులు కవులు గాయకులు నటులు విదూషకులు కళాకుశలురు రాజధానీనగరమున సమావేశ మైరి.

చల్లగా వెన్నెల కాయుచున్నది. వెన్నెలసౌఖ్య మెరిగిన వారు వెన్నెల ననుభవింపక నిదురింపగలరా? కాని ఈ వెన్నెలతీపి నాస్వాదించు టెట్లు? వెన్నెలలో ఏకాంతముగ నెంత సంచరించిన దాని యనుభూతి సాధ్యమగునా? అదిగాక వెన్నెలకూడ ఉద్దీపక వస్తువేకాని స్వయముగా రసత్వము పొందదగినది కాదు. అందుచే కౌముదీజాగర మను నుత్సవము ఆ వేళలో యుక్తమైనది. పూర్ణిమా దినములలో నా యుత్సవము సంపూర్ణశోభాయమానముగా నుండును గాని శుద్ధదశమినాడుగూడ దాని కభ్యంతరము లేదు. ఈ రాత్రి వేశ్యవాటికలో విశేషముగా కౌముదీజాగరమహోత్సవమే ఇంటింట ప్రవర్తిల్లుచుండెను.

ఆ వాడలో ఎన్నో ఉన్నతహర్మ్యములు గలవు. వానిముందు విశాలప్రాంగణము లున్నవి. వాని కనుబంధములుగా గృహోద్యానములు రమ్యమైనవి కలవు. అందులో జలవిహారములకు వాపీతటాకాదు లున్నవి. అందలి జలయంత్రములును జలనాళికలును అసంఖ్యాకములు. మరియు వనవిహారమునకును విశ్రమించుటకును గోష్ఠీవినోదములకును సైకతములును మండపములును రత్నవితర్దికలును పొదరిండ్లును అచ్చటచ్చట నలంకరింపబడి యున్నవి.

కొన్ని మేడలలో సౌధోపరితలములనే గోష్ఠీప్రసంగములు సాగుచుండెను. కొందరు హర్మ్యాంగణముల గల మండపముల నుపవిష్టులై సంగీతగోష్ఠి సాగించుచుండిరి. కొన్నియెడల నుద్యానములలో బహువితర్దికలపై స్త్రీపురుషు లాసీనులై మధ్యభాగమున ప్రవర్తమాన మగుచున్న నర్తనము తిలకించుచుండిరి. కొన్ని యిండ్ల ముందు ఇసుకతిన్నెలపై నాగరకులు సుఖోపవిష్టులై విటవిదూషకులతో శృంగారహాస్యకాలక్షేపములు కావించుచుండిరి.

అర్ధరాత్ర మగుటకు ఇంకను రెండు గడియ లున్నది. స్వయంభూదేవాలయములోని ఘంటికానాదములతో కలసి రాజమందిరము మొగసాలపైనుండి గడియారమున పదుమూడుగంటలు గణగణ మ్రోగినవి. శ్రీ రుద్రదేవమహారాజుల భద్రగజోత్సవము పూర్తి యైనది.

మంత్రిసామంతదండనాథు లంతవరకు నా యుత్సవమున యువరాజును కొలిచియుండిరి. వా రందరకు నిప్పుడు విడుదులకు బోవ సెల వైనది. జాబిల్లి పశ్చిమాకాశమధ్యమునకు చేరుకొన్నాడు. వేశ్యవాటికలో దీపకాంతి హెచ్చినది. అందు ప్రతియింటను పరిచారికల రాకపోక లెక్కువైనవి. గోష్ఠీమధ్యమునుండి వేశ్యలు మధ్య మధ్య లేచివచ్చి వారికి నూతనాజ్ఞ లిచ్చుచున్నారు. ఇంతవరకును ఉత్సవమువెంట నున్న మహారాజపురుషులు వినోదార్థము వేశ్యవాటికకు చేరువేళ యైనది. అక్కడ కవి గాయక నటవిటవిదూషకాదులతో వినోదముగా ప్రొద్దుపుచ్చి నాగరకానంద మనుభవింపవలెనను కుతూహలము పెక్కురకుండును. తమతమ ప్రియప్రభువులను రంజింపజేయుట కా వారవనిత లెంతయేని యుత్సుకత ప్రకటించుచుండిరి.

ఆ వారవనితావాటికలోని గృహములలో నెల్లనున్నతమైనది మాచల్దేవిసౌధము. ఒక్క రాచనగరు తప్ప ఓరుగల్లున నంత యున్నతసౌధ మింకొకటి లేదు. మాచల్దేవి ప్రౌఢవయస్సున నున్నది. దాని కుటుంబములోనివారు ఆనాదిగా కాకతీయరాజకుటుంబముతో సంబంధము కలవారు. 'మాచల్దేవి' యనునది కుటుంబమున మూలనాయకురాలి నామము. ఆ నామము వారు పూజ్యతతో మరల మరల రెండుతరముల కొకసారి పెట్టుకొనుచువచ్చినారు.

ఈ మాచల్దేవితల్లి గణపతిదేవుల యనుగ్రహము సంపాదించినది. గణపతిదేవులకు కుమారుడు లేడు. మాచల్దేవిని రాజవంశములో నాదరింప సాహసించువారు లేరు. అది సంస్కృతప్రాకృతకావ్యనాటకపురాణేతిహాసము లెన్నియో చదివినది. అలంకారశాస్త్రమునకు నాట్యశాస్త్రమునకు నిధి. చతుష్షష్టికళలలో దానికి అపరిచితమైనది లేదు.

అది యువకులనే గాక వృద్ధులనుగూడ నాకర్షించును. ధనవంతులైనను పేదలైనను బుద్ధిమంతులైనచో దాని కిష్టులే. ఏ శాస్త్రములోగాని కళలోగాని ప్రతిభకలవాని నది తన గోష్ఠికి వచ్చునట్లు చేయును. అది చూచుటకు ప్రతివారికిని సులభసాధ్యగా కనిపించును. అందుచే దాని గృహమున రాత్రి గడపినట్లు పలువురు సగర్వముగా చెప్పుకొనుచుందురు. కాని అది ఎంత సర్వసామాన్యగా కనిపించునో అంత ఆత్మనిగ్రహము కలది. దానికి కామతృష్ణయే లేదను బుద్ధిమంతులును గలరు. మరికొందరు తాము అడిగినమాత్రము

నసే యది మోహతృష్ణ తీర్చె నని చెప్పుకొనువా రున్నారుగాని యట్టివారు దానిచే నేకాంతమున నిరాకరింపబడి పరిభవింపబడిన వారే. అట్లు పరిభవింపబడినవారు మరల దానివద్దకు ఇంకొకనాడు వచ్చినను వారి నది చురచుర చూచి పంపివేయదు. ఏమియు జరుగనట్లే ఆదరముగా వినోదకథాకాలక్షేపము చేయును. దాని ఇంటికి మూగుచుండు నా కరకుల కది యందినట్లే యుండియు నందరానిదై యుండును. దాన దాని యాకర్షణ శతగుణ మగుచుండెను.

మాచల్దేవి యీనాడు తన క్రీడోద్యానములో చలువరాతి మండపమున నుపవిష్టయై యున్నది. పలువురు కవులు పండితులు నాగరకులు దానిని పరివేష్టించియున్నారు. ప్రతివారును కూర్చుండుటకు నగిషీచేసిన పట్టుపరుపులు గల యాసనము లున్నవి. మండప మధ్యమున నొక దంతపీఠిపై నగరువాసించు నగ్నికరండ మున్నది. పరిచారికలు సభాసదులకందరకు కస్తూరి పచ్చకప్పురము కుంకుమము ఇత్యాదులు గుబాళించు తాంబూలము లందీయ వా రవి మరలమరల సేవించుచున్నారు. వారిలో నిష్ట మున్నవారికి మధుపాత్రలును వచ్చుచున్నవి.

కొంతతడవు ప్రతిమాల యను క్రీడ సాగినది. ఈ క్రీడలో చేరినవా రందరు మాలికారూపముగా మండపములో కూరుచుండిరి. అందులో మాచల్దేవి కొలికిపూస! అది శ్రీకారముతో ప్రారంభించిన యొక శ్లోక మెత్తుకొని చదివినది. దాని కంఠమునకు ముగ్ధులై యెల్లరు వినుచుండిరి. అంతలో నా శ్లోకము పూర్తి యైనది. దాని యంత్యాక్షరము 'భ'. ఆమె వామపార్శ్వమున గల నాగరకుడు భ యను నక్షరముతో ప్రారంభించు శ్లోక మొకటి చదివెను. అతడు పూర్తిచేసిన పద్యము నంత్యాక్షరముతో ప్రారంభించు శ్లోక మాతనితర్వాతివాడు చదివెను. ఇట్లు మాలగా శ్లోకములు సాగిపోయినవి. కాని మధ్యమధ్య దుష్కరము లగు నక్షరములతో శ్లోకములు పూర్తి యగును. దానితో ప్రారంభించు శ్లోకము దొరకదు. తర్వాతివాని కట్టి దండుకొనుట చేతకాకపోవును. అట్టివా డోడిపోయినట్లు! వాడు ముందు నిర్ణయించుకొన్న విధముగా అపరాధము వెంటనే చెల్లించుకొనవలెను. ఆ చెల్లించు నపరాధమునకు కంటె మాలాభంగము చేసినందు కాతనిపై సహృదయులకు కలిగిన యసహ్యమున కాత డెక్కువ పరితపించును. గోష్ఠిలో నందరును శ్లోకములు గాథలు బహుశ్రావ్యముగా పఠించుచుండిరి. ఆ పాఠ్య పద్ధతి గోష్ఠి కెంతయేని నానందము సమకూర్చెను. ఓడిపోయిన వానిపై మిగిలినవారందరు నొక్కమారు పరపు నవ్వుకలకలము మృదంగనాదముకంటె మనోజ్ఞమై మధ్యమధ్య వినిపించుచున్నది.

ఆపిమ్మట వారు కొంతసేపు ప్రహేళికలు సాగించిరి. మాచల్దేవి యచ్చటివారికి ప్రహేళిక యొసగెను.

"వనే జాతా వనే త్యక్తా వనే తిష్ఠతి నిత్యశః
పణ్యస్త్రీ నతు సా వేశ్యా యో జానాతి స పండితః"

ఈ విధానమునకే తెలుగునాట పొడుపుకథ లను పేరు వచ్చినది. 'ఇంతముండ లేదు, ఇల్లంతా నెత్తురే!'

పై శ్లోకములోని వనశబ్దము నానార్థములు సువ్యక్తము లైనందున పలువు రది 'నౌక' అని చెప్పివేసిరి. 'మీరు పండితులే!' యనుచు మాచల్దేవి వారిలో ముందు చెప్పినవానిని కాశ్మీరసేలుగతో నలంకరించెను.

ఒక రిట్లు ప్రారంభించిరి.

"అత్రోద్యానే మయాదృష్టా వల్లరీ పంచపల్లవా
పల్లవే పల్లవే తామ్రా యస్యాం కుసుమమంజరీ."

ఆ ప్రారంభించినవాడు ఒక యువకవి. అత డెంతకాలము నుండియో మాచల్దేవి యాస్థానమందలి గోష్ఠుల కరుదెంచుచుండును. అత డెప్పుడు వచ్చినను సిగ్గుపడకుండ మాచల్దేవిముఖాబ్జముననే మాచల్దేవికరాబ్జములనే మాచల్దేవిపదాబ్జములనే దృష్టి నిలిపియుంచును. మాచల్దేవియు నతని చూపులకు కోపింపదు. అతని వెకిలి చూపును చూచి నవ్వుకొనుచుండును. ఈ శ్లోక మీనాడు చదువగానే మాచల్దేవి పెద్దగానే నవ్వెను.

"అభినవదండిగారూ, మీరు చూచిన యా వల్లరి యీ మాచల్దేవియేనండీ!" అని చెప్పివేసెను. ఆమె పదపల్లవములు కరపల్లవములు అధరపల్లవము నిరంతరము ధ్యానించు నా కవి వెంటనే యొక ముత్యాలపేరు మాచల్దేవికంఠమున నలంకరించెను.

అంతలో ప్రతీహారిణి వచ్చి పెద్దలు వచ్చినా రని మాచల్దేవికి నివేదించెను. మాచల్దేవి స్వయముగా లేచి వారి నెదుర్కొనబోయెను. ఆ వచ్చినది జాయపనాయకుడును బద్దెనయు. వారి నది యెంతయేని గౌరవాదరములతో నెదుర్కొని తోడితెచ్చెను. వారి నిరువుర మండపముపై నుచితస్థానముల నుపవిష్టుల గావించి శ్రీగంధ మిప్పించి తాంబూలకరండములు స్వయముగా నది వారిముందుంచెను.

జాయప కుశలప్రశ్నాదిక మైనపిమ్మట గోష్ఠీవిశేషములు ప్రశ్నింప వా రానాడు కౌముదీజాగరోత్సవము చేయుచున్నా మని యంతవరకు జరిగినది తెలిపిరి. జాయప సంతోషము వ్యక్తపరచి యిట్లనెను:

"నేను మరొక వినోద మిప్పుడే యూహించితిని. మీలో ఇక్కడ నృత్యము తెలిసినవా రెందరు?"

జాయప యీ ప్రశ్న వేయగా నచ్చట నెవ్వరును తమకు వచ్చు ననలేకపోయిరి. మాచల్దేవికే సాహసము లేక యిట్లనెను.

"ప్రభూ, మీఎదుట నాట్యము వచ్చునని ఎవరు చెప్ప సాహసింతురు?"

జాయప: "నే నేమీ పులిని గాను. వినోదమునకు వచ్చినాను. నీకు నాట్యము వచ్చునులే. మిగిలినవారి కేమాత్రమువచ్చినను చూచి సంతోషింతును—"

ఆమాటలతో నచ్చటివారికి ధైర్యము కలిగెను. మాచల్దేవి చెలికత్తెలే కాక యా గోష్ఠిలో పలువురు పురుషులుకూడ మాకు వచ్చునని ముందుకు వచ్చిరి. బద్దెనయు తనకు వచ్చు ననెను.

జాయప వారి నందర పురుషుడు స్త్రీ, మరల పురుషుడు తర్వాత స్త్రీ, ఇట్లు పర్యాయముగా నిలుచుండ నియమించెను. వారి యందరకాళ్లకు గజ్జెలు శ్రుతికి తంబుర, మృదంగాదులు అరగడియలో సర్వసంపన్న మగు మాచల్దేవిసౌధమునుండి పరిచారికలు తెచ్చి సిద్ధముచేసిరి.

తంబురప్రణవనాదము సాగెను. జాయప పుష్పబాణవిలాసము నుండి యీ శ్లోక మందిచ్చెను.

"కాంతే యాస్యతి దూరదేశమితి మే
చింతె పరం జాయతే
లోకానందకరోపి చంద్రవదనే
వైరాయతే చంద్రమాః

కించాయం వితనోతి కోకిలకలా
లాపో విలాపోదయమ్
ప్రాణానేవ హరంతి హంతనితరా
మారామమందానిలాః"

"ఇది ముందొకరు వచ్చి యభినయింపవలెను. ఇంకొక రీతిగా నదే తర్వాతవారు అభినయింపవలె. అట్లే పరిపరివిధముల నందరు!—ముందు బద్దెన!"

బద్దెన ముందభినయించెను. తర్వాత నదే యొక యుఃతి మార్పుతో నభియించెను. పిమ్మట చిత్రకారు డొక డదే మరియొక విధమున నభినయించెను. ప్రౌఢ యంతట నింకొకతీరున నభినయించెను. గాయకు డంతట నందుకొనెను. లతాతన్వియొకతె యాపిమ్మటను, పూర్వోక్తయువకవి యంతటను వరుసగా నెందరో పరిపరి విధముల నభినయించిరి. అందరలో తుదకు మాచల్దేవి పరిషత్సమ్మోహకముగా నభినయించి మరల శ్లోకములో నొక పద మందుకొని యభినయించెను. తర్వాత వారందరు నొక్కొక్క శ్లోకభాగమే యభినయించిరి. తుదకు మాచల్దేవినృత్యముతో నందరుకలసి పూర్తి కావించిరి. అంతయు పూర్తి యగునప్పటికి అందరు భరత తన్మయులైరి.

జాయప: "ఇది నృత్తప్రతిమాల!"

మాచల్దేవి: "నృత్తరత్నావళికర్తలకే ఇట్టి నవప్రతిమాలలు కాసించుటొప్పును!

అది పూర్తియగుటకు ముందే యాప్రదేశమున కొక యజ్ఞాత పురుషుడు వచ్చి కూరుచుండెను. ఆ వచ్చిన వా డాక్రీడ నెంతో వ్యగ్రుడై తిలకించుచుండెను. ఆతని వచ్చుట చూచినప్పటినుండియు జాయప కేలనో ముళ్లమీద కూరుచున్నట్లుండెను. ఇత డెవరు? ఏ దేశస్థుడు? ముందు తెలుపకుండ లోనికి వచ్చు స్వాతంత్ర్యమెట్లు వచ్చినది? వచ్చినవాని నెట్టి యభ్యంతరము లేకుండ నెట్లుండనిచ్చిరి? ఇక్కడికి తరుచుగా వచ్చుచున్నవాడా? ప్రథమపర్యాయము నేడే వచ్చెనా? ఎంతకాలమునుండి వచ్చుచున్నాడు? ఈ యాలోచనాపరంపరలో జాయపకు క్రీడావిలోకనమున మధ్య మధ్య పరాకుపడసాగెను.

మాచల్దేవి యది గ్రహించెను. కాని యాతని యాందోళన మెంతమాత్రము నుపశమింపజేయ యత్నింపలేదు. తా నది గ్రహించి నట్లుగూడ జాయపకు తెలియకుండ ప్రవర్తించెను. నృత్యానంతరమున బద్దెన సిగ్గుపడుచు దిక్కులు తిలకించుచుండెను. ఆతని కక్కడి కామినుల మనోజ్ఞాకారములు ఆ వెన్నెలకాంతిలో కలసి గంధర్వలోకములో నున్న విభ్రాంతి కలిగించెను. వారి నర్మవాక్కులు చెవుల బడినప్పుడెల్ల ఆ యువకుని చిత్తము భ్రమింపసాగెను. ఉద్రేక మెక్కువైనకొలది యాతని సిగ్గును అతిశయించుచుండెను.

ఆతని సర్వచేష్టలును నూతనపురుషుని నాకర్షించెను. అతడు మాటిమాటికి బద్దెనవైపు చూడసాగెను. బద్దెనమాత్ర మాతని గమనించి నట్లే లేదు.

ఆ నూతనపురుషుడును సర్వవిధముల జిత్రమైనవాడే! అతడు ధరించిన వస్త్రము లీవైపువివలె నున్నను కట్టిన తొడిగిన విధానములు వేరు. అతని నవ్వు వేరు. అతని మాట వేరు. అతని తీరే వేరు! అతనికి స్త్రీపురుషభేద మున్నట్లే కాన్పింపదు. నడివయసువాడు. కాటుకకన్నులు. పసినిమ్మపండువంటి దేహచ్ఛాయ. కొస దేరిన యున్నతనాసము. విశాలమై మనోజ్ఞ మగు ఫాలము. అతడు మాచల్దేవివంక చూచినను దాని చెలికత్తెలవంక చూచినను తాల్మము కాని కొంకుకాని ద్యోతము కాదు. చిరపరిచితు డగు నాప్తమిత్రమువలెనే అతడు సంచరించుచుండెను.

చంద్రాస్తమయ మయ్యెను. ఆవేళకు సరిగా నచ్చటికి మేచయనాయకుడు వచ్చెను. మాచల్దేవి యాదరముతో నెదురేగి గౌరవముతో నాతని తోడ్తెచ్చి కూర్చుండజేసెను. మరల నిష్టకథాగోష్ఠి సాగుచుండెను.

అంతలో కొంతవడికి పర్వతనాయకు డరుదెంచెను. ఆతని నూతనోద్యోగమున కందరు నాతని నభినందించిరి.

"మహారాజ్ఞి యంగరక్షకులకు ఇప్పటికి తీరిక యైనది కాబోలు!" మాచల్దేవి ప్రశ్నించెను.

అందరును పర్వతనాయకునివంక నీక్షింపసాగిరి. పర్వతనాయకుడు తన్నుకానట్లే మహారాజ్ఞి యంగరక్షకు డిక్కడ ఎవరా యని చూచుచున్నట్లు ఆ నూతనపురుషునివంక జూడసాగెను.

మరల మాచల్దేవికంఠము వినిపించెను.

"మహారాణుల యంగరక్షకులు పలుకకున్నారేమి?"

అందరును పర్వతనాయకునివంక జూచిరి. ఆతడు తన్నుగాక యా నూతనపురుషుని నడిగినట్లే యాతనివంక జూచెను.

నూతనపురుషుడు పర్వతనాయకుడు మతిలేనివా డని భావించినట్లు నిరసనము మిశ్రమైన యొక నవ్వు నవ్వెను.

జాయపనాయకుడు సూక్ష్మముగా మాచల్దేవితో నిట్లనెను.

"మాచల్దేవీ, నీకు మతిభ్రమణ మెన్నాళ్లనుండి కలిగినది?"

ఆ మాటలు మాచల్దేవి నుద్దేశించి యన్నట్లున్నను నిజముగా పర్వతనాయకునివంక నిరసనదృష్టితో చూచుచు నవ్విన యా నూతన పురుషుని నుద్దేశించిన వని తద్జ్ఞులకు ధ్రువపడెను.

నూతనపురుషుడు: "స్త్రీలకు మతిభ్రమణము సహజముగదా!"

మాచల్దేవి తలయెత్తకుండ మాటాడెను.

"స్వామీ, భ్రమించుటకు నాకు ముందు మతి యున్నదందురా, మీ రుభయులును?"

చేరినవా రందరు పక్కున నవ్విరి. మరల మాచల్దేవి యందుకొనెను.

"జాయపనాయకులు మతిభ్రమణ మొందిననాడు సరిగా గుర్తుచేసిరి. శ్రీరుద్రదేవమహారాజుల యంగరక్షకుల కిప్పటికి తీరిక యైనదా?"


పర్వతనాయకుడు చిరునవ్వుతో 'అవును!' అనెను.

ఈమారు సభ్యులందరు నూతనపురుషునివంక జూచి నవ్వసాగిరి. శ్రీరుద్రదేవమహారాజులను మహారాజ్ఞి యన నొప్పునా?

కౌముదీజాగరణము సాగుచున్నది. వృద్ధు డగు జాయపనాయకునకు కొంచెము కునికిపాట్లు ప్రారంభించెను. పలుమారు లత డెట్లో దేహము సరిచేసికొని లేచుచుండెను. తుద కాతడు బద్దెనతో కలసి బయలుదేరిపోయెను. బద్దెనయు నాచోట నున్న తరుణుల సాహచర్యము వదలలేక వదలలేక కలఃరించుచున్నవానివలె జాయపవెంట విధిలేక సాగిపోయెను.

గోష్ఠిలోనివారు ఒకరిపై నొకరు సందేహముతో ప్రవర్తించుట మర్యాదకు భంగము. సరసు డగు నాగరకు డది చేయడు. ఆ నూతనపురుషునికిని పర్వతనాయకునికిని ఒకరిపైనొకరికి

(35-వ పేజీ చూడుము)



దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో, 'అటల్' రకానికి చెందిన 'విట్సండే' దీవి.

పగడాలు

శ్రీ యామర్తి గోపాలరావు

"...పవడములై, మస్సృణములగు
అతని వ్రేలిగోళ్లు..."

"...పక్వబింబములాయధరములు,
ప్రవాళకాంతులు, కల్యశాలాపరమ
సౌందర్యనర్తనములు..."

అని ఊహాలోకంలో ఏమిటో మాసి, ఊరికే వాపోతాడు ఓ కళోపాసి.

ప్రవాళాలను కేవలం అధరాలకే కాదు, అనేక అవయవాలకు ఉపమానవస్తువులుగా సాహిత్యకులు ప్రయోగిస్తున్నారు. పగడాన్ని సంస్కృతభాషలో 'ప్రవాళం, విద్రుమం' అని వ్యవహరిస్తారు. దీనిని ఆంగ్లభాషలో కోరల్ అని అంటారు.

సముద్రంలో తిరిగే ఒకరకమైన కీటకాల ద్వారా పగడం రూపం ధరిస్తుంది. ఈ కీటకాలు, సముద్రపు నీటిలోని కాల్షియంను గ్రహించి, దేహంచుట్టూ, పురీషవిసర్జనవలె, కాల్షియం కార్బనేట్ విసర్జిస్తవి. ఈ విసర్జితమైన పదార్థమే ప్రవాళద్రవ్యము.

పగడపు పురుగులు

ఈ పురుగులకొక ప్రత్యేకమైన ఆకారమేమీ లేదు. వీటి శరీరం గొట్టంమాదిరి ఉండి రూపపరివర్తనం చెందుతుంటుంది. శరీరపుపైభాగం గుండ్రంగాను క్రిందిభాగం బల్లపరుపుగానూ ఉంటుంది. చుట్టూ పుష్ప కేసరములవంటి స్పర్శావయవాలు వీటికి ఉంటవి. ఈపురుగులకు ముందు నోరు ఉంటుంది. వీటి పరిమాణం అంగుళంలో ఆరోవంతు మొదలుకొని, రెండడుగులవరకూ ఉంటవి' కొన్నిటికి శరీరంపైన, చిన్న కాయలు ఉంటవి. వీటిలోనుంచి, పగడం ఏర్పడటానికి కావలసిన రసాయనికద్రవం స్రవిస్తుంది.

వీనిలో ఒకజాతిపురుగులకు, పొడుగుపాటి తీగవంటి నరము ఉంటుంది. ఇవి తమతో పోరాడే, ఇతరపురుగులను చంపటానికిగానీ, శరీరరక్షణార్థంగానీ దీన్ని ఉపయోగించుకొంటవి. ఈ నరాన్ని క్షణకాలంలో, దీర్ఘంగా పెంచి, వైరిదేహాన్ని గ్రుచ్చుతవి. ఈ నరంలో ఉండే విషపదార్థంవల్ల, గ్రుచ్చిన వైరిదేహంపై పెద్ద గాయమేర్పడుతుంది. గ్రుడ్లను పెట్టి, ఈపురుగులు సంతానాన్ని అభివృద్ధిపొందిస్తవి.

ఈపురుగులు సముద్రంలో, ఉన్న రాళ్లను అంటిపెట్టుకొని ఉంటవి. కొన్ని ఇసుకలో ఉంటవి. కొన్ని నీళ్లలో, బాగా ఈదగలవు. సాధారణంగా, ఇవి ఉష్ణం అధికంగా ఉండే సముద్రప్రాంతంలో ఉంటవి. దీన్నిబట్టి, సముద్రంలో ఉండే ఉష్ణప్రవాహాలు - అట్లాంటిక్ వేడిప్రవాహాలవంటివి - పగడపు పురుగులకు నివాసస్థానం అని విశదమౌతుంది. సముద్రపు నీటి ఉష్ణోగ్రత 65 డిగ్రీలకన్న తగ్గితే, ఆ నీటిలో, ఈపురుగులు జీవించవు. దీనికి కారణం, ఉష్ణోగ్రత మన చుట్టూ ఉండే, ఉష్ణోగ్రతకంటె తక్కువ కావడమే.

చెదలన్నీ ఒకచోట సమావేశమై, ఘట్టము పెట్టినట్లు, ఇవన్నీ ఒకచోట చేరి, చెదఘట్టమువంటి దిబ్బలు పెడుతవి. పురుగులతోపాటు రకరకాల రంగుల చేపలు, మొదలైన జలచరాలుకూడ విహరిస్తవి. ఈ దిబ్బలనే, పగడపు దీవులంటారు. ఇలా ఏర్పడినవలస ప్రదేశాల్లో, పురుగుల గుంపులన్నీ కలిసి, కాల్షియం కార్బనేట్‌ను విసర్జించటంవల్ల ఏర్పడే పగడసంబంధమైన రాళ్లు పెద్దవిగా ఉంటవి. ఈ రాళ్లు రకరకాలుగా ఏర్పడుతుంటవి. కొన్ని ఇటుకబిళ్లల మాదిరిగాను కొన్ని పెద్దగుండ్లుగాను, కొన్ని చెట్లమాదిరిగానూ ఏర్పడుతుంటవి. ఈ రాళ్లపై పగడపు పురుగులు మూగి, కప్పబడియుండడంవల్లనే, దూరానికీ దీవులు, నారింజపండు, పసుపు, ఆకుపచ్చ, గులాబీ, బూడిద మొదలైన రంగుల్లో కనిపిస్తుంటవి. ఈరాళ్లను కదిలించి తీసినపుడు, వాటిపై నున్న పురుగులు చనిపోతవి. ఈ పురుగులు దిబ్బలను సముద్రంలో ఎంత లోతైనప్రదేశాలనుండైనా నిర్మించటం మొదలెట్టి వాటిని పెంచుతూ, చివరకు నీటిపైభాగానికి తీసికొనిరావటం ప్రకృతిలోని ఒక వైచిత్ర్యం. వాటిపై మొక్కలు మొల్చి తుదకవి దీవులవుతవి. సాధారణంగా పగడపుదీవులు లోతులేని ప్రదేశాల్లో నీళ్లలో మునిగిఉంటవి. కొన్ని సముద్రం పోటుగా నున్నపుడు కనిపిస్తవి.

కాని దీవుల్లో లభించే పగడాలకంటే, విచ్చలవిడిగా సంచరించే పురుగులవల్ల ఏర్పడే పగడాలు, మిక్కిలి నునుపుగాను, అందంగానూ ఉంటవి.

పగడపుదీవులు :

పగడపు పురుగులెప్పుడూ వృద్ధిపొందటానికి, తగినంత ఉష్ణము అవసరము. అందువల్లనే అట్లాంటిక్, క్యూరోసివో ఉష్ణప్రవాహాలుఉన్న ప్రాంతంలో, ఈ దీవులు ఎక్కువగా ఏర్పడుతుంటవి. ఇది చలినీటిలో జీవించవు. కనుకనే ఉత్తరమెరికా ఉత్తరతీరాన ఆఫ్రికాఖండపు పడమటి తీరాన, ఈ దీవులేర్పడటానికి వీలులేదు.

ఈ దీవులు దక్షిణమెరికాలోని బ్రెజిల్ తీరంనుంచి, ఉత్తరమెరికాతూర్పుతీరంలో ఉన్న, ఫ్లారిడాద్వీపకల్పము, బహామాస్, బెర్ముడాద్వీపంనుండి కుడివైపుకు తిరిగిపోతుంది. అందువల్ల, బహామాస్, బెర్ముడా దీవులకు ఉత్తరాన, పగడపు దీవులు లేవు. ఈ దీవు లింకా, దక్షిణపసిఫిక్‌దీవుల చుట్టునూ ఈస్టిండీస్‌దీవుల పరిసరాల్లోనూ, సింహళం ఆఫ్రికాఖండపు తూర్పుతీరాన ఉన్న మెడగాస్కర్‌దీవిపద్ద గట్టిగా స్థావరమేర్పరచుకొన్నవి.

ప్రస్తుతం ప్రపంచంలోకల్లా, ఎక్కువ

మేరను అతిక్రమించిన దీవి, ఆస్ట్రేలియా తీరప్రాంతంలో ఉన్నది. ఇది, షుమారు 1250 మైళ్లు పొడుగున వ్యాపించింది. దీన్ని "ది గ్రేట్ బేరియర్ రీఫ్ ఆఫ్ ఆస్ట్రేలియా" అని భూగోళశాస్త్రజ్ఞులు వ్యవహరిస్తారు.

పగడపు దీవులు మూడురకాలుగా ఏర్పడుతున్నవి. అవి ఆటల్సు బేరియర్ రీఫ్సు ఫ్రింజింగ్ రీఫ్సు.

అన్నిటిలో 'ఆటల్సు' రకపుదీవులు హృదయానందంగా కనిపిస్తవి. నీలిచీరతో ముస్తాబైన ఆకాశాన్ని సముద్రుడు తరంగాలతో గిలిగింతలు పెట్టూంటాడు. ఆ సముద్రుని గర్భంలో తటాకంవలె ఉంటుం దీరకపుదీవి. పగడపు రాళ్లు వలయాకారంలో ఏర్పడి దూరానికి చెరువుకట్టవలె కనిపిస్తుంది. ఈ వలయంలోని జలం, పరవళ్లుత్రొక్కే సముద్రతరంగాలను చూచి, ఈర్ష్య వహించిందా అన్నట్లు చలనరహితంగా నిలచి ఉంటుంది. అప్పుడు దీనిరంగు లేతపచ్చ. ఇటువంటి స్థితిలో దీవిచుట్టూ ఉండే ప్రవాళశిలలతో సముద్రతరంగాలు, ఉజ్వలంగా ఢీకొంటున్నప్పుడు, ధవళకాంతులు విరజిమ్మే నురుగులు, రూపొందినపుడూ, రసపిపాసువుల హృదయ మువ్పొంగుతుంది. పైగా ఈ దీవి అలలతాకిడి ఉండేపైపే వృద్ధిపొందుతుందట.

దక్షిణపసిఫిక్ మహాసముద్రంలో, 'ఆటల్' రాకానికి చెందిన 'విట్సండే' దీవి.

పెద్దవి అని చెప్పకొనబడే 'ఆటల్స'న్నీ, తూర్పు భాగాన్నే ఉన్నవి. దక్షిణపసిఫిక్ మహాసముద్రంలో ఉన్న దీవుల్లో ఎక్కువ భాగం ఈ జాతికి చెందినవే.

రెండోరకపు దీవులు బేరియల్ రీఫ్సు. ఇవే పొడుగైనవి. ఇవి మామూలు దీవుల చుట్టూ కోటగోడలమాదిరి ఉంటవి. పగడపు దీవులకు, మామూలుదీవులకు మధ్య, వీటి మడుగులు ఉంటవి. పగడపు దీవులను వేరుచేస్తూ ఈ మడుగులోనుంచి, కాలువలు సముద్రంలో చేరుకుంటూఉంటవి.

ఫ్రింజింగురీఫ్సు మూడోరకపు దీవులు. ఇవి తీరప్రదేశాల్లో ఏర్పడుతవి. మిగతారెంటికున్నంత ప్రాముఖ్యత వీటికి లేదు.

ఈ పగడపుదీవులు ఏర్పడటాన్ని గురించి, వైజ్ఞానికులు వివిధాభిప్రాయాలను వెల్లడించారు. వీరిలో పరిణామవాదసిద్ధాంతాన్ని ప్రతిపాదించిన, సుప్రసిద్ధశాస్త్రజ్ఞుడు డార్విన్ ఒకడు. ఇతని వాదమే చాలావరకు సమంజసంగా కనిపిస్తున్నది.

ప్రవాళరత్నం

పగడాల్లోని రసాయనిక ద్రవ్యం క్యాల్షియాకర్బనితము కనుక, పగడసంబంధమైన రాళ్లు, సున్నానికి ఉత్పత్తిస్థానము.

పవడం రత్నజాతిలో చేర్పటానికి దీనికి గల అలంకరణసంబంధమైన ప్రాశస్త్యమే కారణం. మొదటినుంచీ, పగడం ఆభరణయోగ్యమైన వస్తువుగా వన్నెకెక్కింది. పుట్టిన పగడాలన్నీ రత్నజాతికి చెందవు. అందులో కొన్ని ప్రవాళాలే రత్నాలుగా పరిగణింపబడుతున్నవి. సాధారణంగా ఎరుపు పగడాలు ఆభరణయోగ్యాలు. కనుకనే, భైరవకవి, నాడు ప్రజాదరణను పొందిన, పవడపురంగు నిలా వర్ణించాడు.

"దొండపండులచాయతో మచ్చరించుచు
నస్తిపండుల రీతి నుబ్బడించి
పరికింప నరిపండ్ల బకపక చేసియు
దేవదారులపండ్ల తేజ మణచి
వటఫలకాంతిని వదలించి చెలరేగి
బింబాధరుల మోవి బిట్టడించి
శుకతుండముల శోభ సామ్యసిల్లగజేసి
చందకొష్టపు జాయ దిట్టి"...

నట్టిది ప్రవాళ మని ఆయన అన్నాడు. కాని ఈరోజుల్లో నాగరికులకు బచ్చలి పండురంగుపగడాలపై మమత విశేషం. రత్నజాతికి చెందిన ప్రవాళాలు, గార్గానియన్‌జాతిపు రుగులవల్ల ఉద్భవిస్తవి. మామూలుపగడంకంటె, దీని లోపలిభాగం మిక్కిలి కఠినంగా ఉంటుంది. పైపెచ్చును తీసివేసి, బాగా మెఱుగుపెట్టి, సొగసుగా తయారుచేయటానికి వీలుంటుంది. ఇలా మెరుగుపెట్టంవల్ల, పగడం ఎఱ్ఱగానూ, గులాబీవలెగానీ, నారింజపండువలెగానీ, కాంతితో దేదీప్యమానంగా వెలుగుతుంది. రత్నజాతిముఖ్యలక్షణాలు గట్టితనం; ప్రకాశము. దీన్ని, పూసలు మొదలైన ఆభరణయోగ్యమైన రూపాల్లోకి చెక్కడానికి ఈ గట్టితనమే కారణం. రత్నసంబంధమైన పగడాలు, మధ్యధరాసముద్రంలోను, జపాను సముద్రంలోనూ చిన్న దిబ్బలమాదిరి పెరుగుతవి. ఇవి షుమారు 25 అడుగులనుంచి, 100 అడుగుల లోతువరకు ఉంటవి. ఇందులో చాలాదిబ్బలు కొద్దిలోతులోనే ఉంటవి.

ప్రవాళరత్నాన్ని ఉత్పత్తిచేయటంలో మధ్యధరాసముద్రసీమ ముందంజ వేసింది. ఆఫ్రికాఖండపు ఉత్తరతీరాన ఉన్న మొరాకో, ఆల్జీరియా, ట్యునీసియాల తీరప్రాంతంనుండి, ఈ ప్రవాళం పెద్దమొత్తాల్లో రవాణా జరుగుతుంది. కాని రక్తవర్ణ విద్రుమం, ఇటలీద్వీపకల్పపు పశ్చిమతీరాన ఉన్న నేపిల్సు, జినోవా, లెఘోర్ను పరిసరాలనుంచీ, కార్సికాసార్డినియా, తీరప్రాంతంనుంచి అనేకదేశాలకు ఎగుమతి జరుగుతుంది. ఇటలీవారు, ఫ్రెంచివారు, సముద్రంలోనికి, లోతుల్లో ప్రవేశించి, వీటిని బయటకు తీసికొనిరావటంలో అందెవేసినవారు.

ఈ రత్నం ఇప్పడిప్పుడు ఐర్లండుకు పశ్చిమాన్న కూడా లభిస్తున్నది. ఇంకా మెడగాస్కరుకు సమీపంలో నన్న మారిషస్ దీవిదగ్గిరా, జపానువద్దా లభిస్తున్నది.

కొన్నిప్రాంతాల్లో కేవలం నలుపు పవడాన్ని కూడా ఆభరణాల్లో ఉపయోగించుట కద్దు. ఈ రకపు పగడం, పూర్వం పారశీక సింధుశాఖలో మిక్కుటంగా లభించేది. ఇప్పుడు ఆస్ట్రేలియాఖండపు, బేరియర్ రీఫ్సునందు, ఇది దొరుకుతున్నది. దీన్ని ఎక్కువగా, భారతీయులు, పారశీకులు, చైనావారు, జపానువారు, తెప్పిస్తారు.

పగడపు కఠినత్వసంఖ్య 3. 5. తారతమ్య సాంద్రత 2 6. మొదలు 2. 7. వరకూ ఉంటుంది.

అధునికులకన్నా ప్రాచీనులకు, పవడంతో పరిచయం మెక్కువ. మెడూసా శిరస్సునుండి పడేరక్తంలోనుండి, పగడం ఉద్భవించిందని, దాన్ని జలదేవతలు తీసికొనివెళ్లి, సముద్రంలో నాటినట్లుగా గ్రీకుల కథ ఒకటి ఉన్నది.

ప్రవాళాన్ని, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రజాతులైన చాతుర్వర్ణములుగా పూర్వులు విభజించారు. కుంజేటిరక్తంవలె, అరుణంగానూ, మనోహరంగానూ ఉండేది బ్రాహ్మణజాతి సింధూరపు రంగులోనుండి నునుపుగానూ, గట్టిగానూ ఉండేది క్షత్రియజాతి. ఈ జాతిపగడాన్ని తొలచటం చాలా కష్టం. మోదుగపువ్వును పోలిన రంగుగల పవడం వైశ్యజాతిదట. మలినంగానూ, అంత ప్రకాశవంతంగానూ, లేకుండా ఉండేది. నాలవజాతికి చెందుతుంది.

పగడాలకు నాల్గురకాలైన దోషాలుంటవని పెద్దలు చెప్తారు. వీటిని మలినము, జర్ఘరము, పుష్పి, కోమలం అని అంటారు. మురికిగా ఉన్న మలినదోష ముంటుంది. దీన్ని వాడినవారు విచారగ్రస్తులౌతారు. చుట్టూ బుడుపు లున్న, దానికి జర్ఘరదోష

మంటుంది. దీన్ని ఉపయోగించిన, దరిద్రం వస్తుందని, మరణిస్తారని, వయోవృద్ధుల వాక్కు. పుష్పిదోష మున్న దాన్ని ధరించిన వారు, వ్యాధులపా లవుతారు. పగడానికి పైన గోమయమువంటి మరక లున్న, శోమల మనే దోష ముంటుంది. దీన్ని వాడినవారు కష్టాలకు గురిఔతారు. పగడాలను, ఆవు పాలతో శుద్ధిచేయటం సహజం.

"అత్యంతప్రియతరం బంగారసూత్రికి, శృంగారపగడంబు శోభిలంగ." పగడానికి అధిపతి కుజుడు. అందువల్ల కుజుని ప్రీతికై,

"యామ్యాం ప్రవాళం మగస్యచ"

అంగుళీకపు దక్షిణభాగంలో పగడాన్ని ఉంచి చేయిస్తారు.


క్రీస్తుశక ప్రారంభంలో, మధ్యధరా ప్రాంతంనుంచీ, భారతదేశానికి పగడాల వర్తకం విశేషంగా సాగుతుండేది. భారతీయులు, పగడాలకోసం తపించకముందు, ప్రాచీన ఫ్రెంచిదేశస్థులైన 'గాల్సు' జాతి వారు, శిరస్త్రాణాలను, ఆయుధసామాగ్రిని అలంకరించటానికి, పగడాలను విరివిగా ఉపయోగించేవారు అని చరిత్రకారుడు 'ప్లినీ' సెల విచ్చాడు దీన్నిబట్టి, యూరప్ ఖండవాసులు ప్రాచీనకాలంలో పగడాలకిచ్చిన ప్రాధాన్యత ఇప్పు డివ్వటంలేదు. ఎప్పుడూ ప్రాక్ దేశస్థులకు పగడాలపై మమత అధికం. తూర్పుఖండవాసులకు వీటిపైగల రంధి ఎటువంటిదనగా, వాటిని ఉత్పత్తి చేసే ప్రాంతాల్లో, కలికానికైనా, పగడం లభించేది కాదంటారు. అంటే, ఉత్పత్తిచేసిన పగడాలన్నీ తూర్పువారు దిగుమతి చేసికొనేవారు అని అర్థం. నేడు భారతదేశం పగడాలకోసం, ప్రతిసంవత్సరం దరిదాపు 20లక్షల రూపాయలు వెచ్చిస్తున్నట్టు అంచనా వేయబడింది.

రోమను దేశీయులు, చిన్న చిన్న కొమ్మలుగా, చెట్లమాదిరిగా పెరిగిన పగడాన్ని, తమ పసిపిల్లల మెడల్లో (మన వాళ్లు, కొంతమంది తాడు వేసినట్లు) దండలుగా వేస్తారు. వీనివల్ల పిల్లల కెట్టి ప్రమాదాలు సంభవించవు అని వారి నమ్మకం. నేడు కూడా ఇటలీ దేశస్థులు, దృష్టిదోషం తగలకుండా ఉండటానికి స్త్రీలకు గొడ్రాలితనం పోగొట్టటానికి ఇంకా పగడాన్ని ఉపయోగిస్తున్నారు.

పగడపు ముక్కలను, అంటుజోళ్లకు ఉపయోగించే, గుండ్లు, ఆకులు, పూలు, మొదలైన వివిధరూపాల్లో కోస్తారు. దీనిలో రంధ్రం, చేతితోగాని, యంత్రంతోగాని ఉక్కుసూదుల సహాయంతోగాని తొలియవచ్చు. ఈపనిలో నిపుణులు మార్సీలీసు, జినోవా పట్టణాల్లో ఎక్కువగా నున్నారు. భారతీయులు, ముఖ్యంగా ఆంధ్ర సామ్రాజ్య పట్టపురాణులు, "...పవడముల చందుకలు..."

ఉపయోగించినట్లు, ఆధారా లున్నవి. పగడాన్ని ఔషధప్రాయంగా కూడా ఉపయోగిస్తారు. పగడాన్ని భస్మంచేసి, మానవతేజోభివృద్ధికి మందుగా ఉపయోగిస్తారు.

సురుచిరవిద్రుమరత్నము
ధరణీజులకు యోగ్యకరము, ధాత్రిజనశ్రీ
కరమగు వనితలకు మనోహరము
జయప్రదము ప్రవాళమార ధరింపన్.



గవర్నర్ జనరల్ రాజగోపాలాచారిగారికి కేంద్రమంత్రివర్గం జనవరి 24 న వీడ్కోలు విందొసగినసందర్భమున తీసిన ఛాయాచిత్రం.

మంచూరియా మాయాజాలము

[ఆంధ్రూరాత్]

1945-నుంచీ కమ్యూనిస్టులు మంచూరియాకోసం ప్రయత్నించారు. 1948 లో పూర్తిగా స్వాధీనపరచుకొన్నారు. కాని వాళ్ళు పోరాటం ప్రారంభించిననాడు, వాళ్లు ఆశించిన మంచూరియాకూ, జయించి చేజిక్కించుకొన్ననాడున్న మంచూరియాకూ ఎక్కడా సామ్యం లేకుండా పోయింది. అందుకు బదులుగా - జపానీయుల విధ్వంసకచర్యలు, సోవియటుల ఆస్తితరలింపులు, చైనీయుల బందిపోట్లు, భూదగ్ధవిధానాల ఫలితంగా ఒక దశాబ్దం వెనుకకు దొర్లించబడ్డ జీర్ణ భూఖండం వాళ్లకి దక్కింది.

నాలుగేళ్లక్రిందటికంటే ఈనాడు, మంచూరియా ముఖ్యపరిశ్రమలలో ఉత్పత్తి పరిమాణము నూటిలో పది పాళ్ళు కన్న తక్కువగా ఉంది. మంచూరియా పరిశ్రమ శక్తి అంతా చాలామటుకు, కిరిన్, యాలూ నదులమీది హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజక్టుల వల్ల, చవుకగా లభించే, విద్యుచ్ఛక్తిమీద, ఆధారపడిఉంది. దాదాపు 25 లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి మంచూరియా పరిశ్రమకు లభ్యమౌతూండేది. కాని ఇప్పుడు సోవియట్లు యంత్రాలు తరలించుకుపోవటంతో, కేవలం ఒకటిన్నర లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఆధారంతో ఇక్కడి పరిశ్రమ కుంటినడక నడవాల్సివస్తోంది. ఉక్కు ఉత్పత్తి ఇప్పుడు దాదాపు ఏటా 40,000 టన్నులుమాత్రమే ఉంటుంది. 1944 లో 20 లక్షల టన్నులుండేది. ఇంతకన్నా బొగ్గు పరిశ్రమే కొంత నయం. 1944 ఉత్పత్తిలో ఐదవవంతు మాత్రంగానైనా ఇప్పుడు 60 లక్షల టన్నులు తయారవుతోంది.

తమ పారిశ్రామిక ఉత్పత్తిని పెంపొందించటానికే చైనా కమ్యూనిస్టులు కృషిలో అగ్రస్థానం ఇచ్చారు. తుక్కుముక్కలలోనుంచి యంత్రాలను తయారుచేసినవారినీ ఉత్పత్తిని అధికంచేసినవారినీ, "కార్మిక వీరులంటూ" పొగడుతున్న విశేషాలే వాళ్ల పత్రికలను నింపసాగాయి. జపానీస్ టెక్నిషియన్లలో చాలా వేలమందిని తమతో అట్టిపెట్టుకొని, తమవారికి శిక్షణ నిప్పిస్తూ, వాళ్ల స్థానం, నైపుణ్యం గడించి, స్వదేశీయులే ఆక్రమించగలిగే పరిస్థితులను కల్పించుకొన్నారు. చిన్న చిన్న పారిశ్రామికులందరికీ విస్తృతంగా ప్రోత్సాహమిచ్చారు.

మరమ్మతులు చేసికొని అట్టే నిలుపుకొన్న యంత్రాలనుంచే, వీలైనంత ఎక్కువగా ఉత్పత్తిని పిండుతున్నారు. ఆల్-చైనా-లేబర్-ఫెడరేషన్, ఉపాధ్యక్షుడు 'ఛూ-హ్యూ-ఏ-ఫాన్' ఒక కర్మాగారాన్ని సందర్శించటానికి ముటంకియాంగ్ వెళ్లినప్పుడు - ఆ కర్మాగారంవిషయంలో ఒక అమెరికన్ నిపుణుని అభిప్రాయమూ,' ఆ తర్వాత అక్కడివాళ్లు చూపించిన ప్రతిభా - అక్కడి ఫోర్మను చెప్పగా విన్నాడు. "దెబ్బతిని ఉన్న ఈ కర్మాగారం మళ్లీ బాగుచేసుకోవచ్చునా' అని ఆ అమెరికన్‌ను అడిగారట. "ఆయన తల అడ్డంగా తిప్పి, 'అంతకన్న కొత్తది నిర్మించుకోవటం నయం' అన్నాడు. ఆతర్వాత ఫాక్టరీని సక్రమంగా ఆడించుకొనేందుకు మాకు మూడు నెలలు పట్టలేదు" అని ఫోర్మన్ చెప్పాడు.

ఈమాదిరిగా, పాతవి మరమ్మతు చేసుకొనే పద్ధతిలోనే మంచూరియాలోని పదివేలమైళ్ల పొడుగు రైలుమార్గాన్ని మరమ్మతుచేసుకొన్నారు. .1946 లో జపాన్ రైల్వేఅధికారులు మంచూరియా వదిలి వెళ్లిపోతూన్నప్పుడు, "మేం వెళ్లిన ఆరునెల్లకల్లా మంచూరియాలో ఒక్క రైలు పెట్టె కదలదు" అని ప్రగల్భాలు పలికారు. యుద్ధకాలంలో మరమ్మతు లేకుండా జీర్ణించిన యంత్రాలూ యంత్రభాగాలూ లేని రైలుమార్గాలు చైనీయ కమ్యూనిస్టులకు దక్కాయి. అయినా మూడేళ్ల యుద్ధ బీభత్సంతర్వాత! చైనా చాంగ్‌చున్ రైలుమార్గాలపై ఆధిపత్యంలో సగంభాగంపై చెల్లు ఆస్తిహక్కు రష్యనులకుంది. అయినా 1946-48 లో చైనా అంతరంగ యుద్ధంలో జోక్యం కల్పించుకోటాని కిష్టంలేక సోవియట్లు, తమ టెక్నిషియన్లనందరిని వెనుకకు పిలిపించుకొన్నారు.

మునుపు జపాన్‌వాళ్లు, చైనీయులను దరిచేరనీయకుండా చేస్తూవచ్చిన అవసరపనులన్నీ, చైనీయకార్మికులు స్వయంగా నేర్చుకోవలసి వచ్చింది. అదేసమయంలో మూలబడ్డ, ముక్కా ముతకా అతుక్కొని, పనిచేసే ఇంజన్లు, యంత్రాలూ, తయారుచేసుకోవలసివచ్చింది. ఒక్కొక్కప్పుడు చెకింటునూనెలు లేక, అల్లాగే ఇంజన్లను తోసుకొంటూపోవలసివచ్చింది. ఇప్పటికి పరిస్థితులు కొంత బాగుపడ్డాయి. సోవియట్ రైల్వే టెక్నిషియన్లు మళ్ళీ తిరిగి వచ్చారు. హాంగ్‌కాంగ్, సైబీరియాలతో వ్యాపారమూలకంగానూ, దేశంలో కొద్దిగా పరిశ్రమను పెంపొందించుకోటంవల్లనూ యీ చెకేంట్ నూనెలు, (మొబైల్ ఆయిల్ మొదలైనవి) కొస్త ఎక్కువగా లభ్యమౌతున్నాయి.

ఇల్లా అతుకులతోనూ, మరమ్మతులతోనూ, కొంత సక్రమంగా నడిపించేస్థితిలోకి తెచ్చుకొన్న, మంచూరియాలో దెబ్బతిన్న పరిశ్రమయంత్రాంగము పూర్తిగా కోలుకునేందుకు, బహు విరివిగా విదేశాలనుంచి ఎగుమతులు చేసుకొంటూన్న చాలాకాలం పట్టకతప్పదు. ప్లానింగ్ నిపుణుడైన, డాక్టరు సోలోమన్ ట్రోన్, ఉక్కుపరిశ్రమవిషయం చెపూ, "రాజకీయసమస్యలూ, పెట్టుబడి రాబట్టుకొనేవిధానాలూ, అడ్డురాకపోతే, శతకోటి అమెరికన్ డాలర్ల పెట్టుబడితో, అమెరికన్ ఇంజనీయర్లు, రెండేళ్లలో, ఉక్కుపరిశ్రమలో ఉత్పత్తిని, 30లక్షల టన్నులకు అభివృద్ధిచేయగలరని చెప్పాడు. రష్యా ఇయ్యగల సహాయం, ఇతరదేశాల కప్పుడే మాట ఇచ్చిఉన్నందువల్లా, కమ్యూనిస్టుచైనాకు పెట్టుబడిపెట్టే

ధోరణి అమెరికాలో కనిపించనందునల్లా, ఇది పదివీళ్ల పైచిలుకు పట్టవచ్చును.

ఈ వ్యవధిని తగ్గించుకోవచ్చు అంటే, మంచూరియా వాణిజ్యవృద్ధిపైన ఆధారపడి ఉంటుంది. 1948 లో సోవియట్ అధికారులతోనూ, హాంగ్ కాంగ్ తోనూ, చార్టరువ్యాపారము (వస్తువులతో మారకం) ప్రారంభించారు. ఏనుపందిముళ్లు, గోధుమలు రష్యాకిచ్చి, రష్యానుంచి పెట్రోలు, మోటార్లు, పత్తి, పంచదారా, మంచూరియా తెచ్చికొందట. హాంగ్ కాంగ్ వ్యాపారస్తులకు, సోయాచిక్కుళ్ళు, చిక్కుడునూనెలు, ఏడుపందిముళ్లు ఇచ్చి కొని, రబ్బరు, లూదికేషన్ నూనెలు కొన్నారు. ఈ వ్యాపారంలో హాంగ్ కాంగ్ వ్యాపారస్థులకు లాభసాటిగా చేరుతే మంచూరియావారు చూపించారు.

ఈ విదేశవ్యాపారంకూడా, మంచూరియాలో కమ్యూనిస్టులు, పంటలను అభివృద్ధి చేసి, విదేశాలకు పంపగల్గటంమీదే చివరికి అధారపడిఉంటుంది. భూవిధానంలో కమ్యూనిస్టులు, చాలా సత్ఫలాలనే సాధించారు.

పల్లెటి కూలిజనాన్ని ఫ్యాక్టరీలకు లాగకుండా, పట్టణాలలో కూలిలేని బీదలనందరినీ, పల్లెటివ్యవసాయంమీదికి, కమ్యూనిస్టులు మరల్చినట్లు విదితమౌతూంది. తక్కిన చైనాఅంతటికన్నా మంచూరియాలో వ్యవసాయిక సమస్య చాలా తక్కువ. ఇక్కడ అపారంగా పండించటానికి తగినంత భూమి, పంటలోకి తీసుకొనిరావలసింది ఉన్నది. ఇందులో నూటికి 80 పాళ్లుభూమి, పై అంతస్తులో ఉన్న నూటికి పదిమందైన ధనికభూస్వాములచేతిలో ఉంది. ఇందులో సగంపైపాలు, జపాన్ మంచూరియా ప్రభుత్వాల అధీనంలోనూ, తక్కినదాంట్లో చాలామటుకు, జపాన్ పక్షీయులైన వాళ్ల చేతుల్లోనూ ఉంది. చాలాచోట్ల, ఈ జపాన్ వర్గాల భూస్వాములను హతం చేసి, (1946 అడావుడి రోజుల్లో) భూమిని ప్రజలకు మళ్లీ పంచటం జరిగినట్లే కనబడుతుంది.

భూవిధానసంస్కరణలతో, కర్షకులకు తగినంత పెద్దపొలము, ఏర్పడి, ప్రతి వ్యవసాయకుటుంబానికి ప్రభుత్వంనుంచి, ఒక్కొక్క దుక్కిజంతువు సరఫరాచేయడం జరిగింది. మంచూరియాపొలాల్లో మూడేసి గుఱ్ఱాలని నాగలికి కట్టి దున్నాలిసిఉంటుంది. అందుచేత వ్యవసాయకుటుంబాలు పరస్పర సహకారపద్ధతిలో వ్యవసాయం సాగించటం పెంపొందింది. ఉత్తరభూములలో, ప్రభుత్వమే "ఫారమ్స్" పెట్టి వ్యవసాయ ప్రయోగాలు సాగించింది. అన్నివిధాలా వ్యవసాయానికి ప్రోద్బలం ఎక్కువైంది. వ్యావసాయికవిద్యలే ఎక్కువయ్యాయి. "ఇంకో బండి ఎరువు ఎక్కువ అంటే ఇంకో బస్తాడు ధాన్యం ఎక్కువైందన్నమాట" అంటూ ఇల్లాటి నినాదాలే కర్షకుల ప్రబోధానికి వాడారు. సరిగ్గా ఎంత ప్రబోధం కమ్యూనిస్టులు కల్పించగలిగారనేది చెప్పలేక పోవచ్చునుగాని, తిండిపుష్టిగలిగి కార్యదీక్షముగాన్న వెలుగుతూ, పీపింగ్ లో తిరుగుతూన్న మంచూరియన్ వాలంటీర్లను చూస్తే అర్థమం మంచూరియాలో బీదరైతులంతా కమ్యూనిస్టులకు మంచి ఉత్సాహంతో అండగా నిలుస్తున్నారని ఇట్టే తెలుస్తుంది.

లీ-లీ-సాన్‌ను గురించి మంచూరియాలో అధినేత అని వదంతులున్నాయి. ఒకప్పుడు మావ్ ట్స్యే-టంగ్‌కు ఇతను స్టాలిన్‌కి, ట్రాట్స్కీలాగ ఉండేవాడంటారు. కాని, "ఈ దౌర్జన్యవిముక్త భాగము" అన్న పేరుతో అర్ధ-స్వపరిపాలన అనుభవిస్తూన్న ఈ మంచూరియాకు అధినేత విన్‌ఫింగ్, మోటు మనిషి - బలంగా ఉంటాడు. మంచూరియావాడు. యుద్ధకాలంలో, షాన్సీ-నూయన్ మిలిటరీ హెడ్ క్వార్టర్సులో పొలిటికల్ డైరెక్టరుగా ఉంటూండేవాడు - నిజంగా అధికారంలో ప్రథమస్థానం ఈ విన్-ఫింగ్ దే. ఇక రెండవవాడు హ్స్యూ-యే-షీ-మాజీ మంచూరియాయుద్ధప్రభువు మార్షల్ చాంగ్ ట్సోలిన్ కుమారుడు. చాంగ్ హ్స్యూ సేయి లింగ్ తమ్ముడు. మంచూరియాలో జపాన్‌కు విరుద్ధంగా "అండర్ గ్రౌండు"లో ఉండి పనిచేసిన పూర్వయుద్ధవీరులను కలుపుకొని, కమ్యూనిస్టులు తమ పాలకవర్గాన్ని బలీయం చేసుకొన్నారు. తక్కిన పార్టీబలం చాలామటుకు షాంటుంగ్ కమ్యూనిస్టుమయమై ఉంటుంది. వీళ్లల్లో చాలామటుకు మంచూరియానుంచి వలసలు వెళ్లిన, కర్షక కార్మిక వీరులే. (లీ-లీ-సాన్, మంచూరియా అధినేత కాడు. పీపింగ్ కేంద్రంగా గల, లేబరు ఫెడరేషనుకు ఉపాధ్యక్షుడు.)

మంచూరియాలో కమ్యూనిస్టులు కొంత ఉదారంగానే ఉండవచ్చుకదా అని అనుకొంటాము. జపాన్ పరిపాలనరోజుల్లోనే కూమింగ్‌టాంగ్ పక్షము అక్కడ నిశ్శేషమయిపోయింది. ధనిక భూస్వామివర్గాలు అన్నీ, జపాన్ పక్షపాతపు కల్మషంలో కళంకితమయిపోయాయి. యుద్ధానంతరం, దేశంలో మిగిలినదాన్ని తుడిచిపెట్టేసేకపు మనుష్యుల మందలను తమవంట తెచ్చుకోవటంవల్ల, కూమింగ్‌టాంగ్ వారు ప్రజాద్వేషాన్ని మూటకట్టుకొన్నారు. కమ్యూనిస్టువిజయం అనంతరం, తమకు పూర్వం ఉన్న ప్రత్యేక సౌఖ్యాలనన్నిటిని పోగొట్టుకోవలసివచ్చినందున మధ్యతరగతిజనాభాలో కొంత సణుగుడు ఉందిగాని, ఇది ఉద్యమరూపం దాల్చేశక్తి లేదు.

అయినప్పటికీ, మంచూరియాలో కమ్యూనిస్టుపాలన 1947 జూలై నుంచీ, ఉత్తరచైనాలోకన్నా ఎక్కువగా, ప్రజలను అణిచే పద్ధతిలో ఉందన్న విషయం గమనించతగ్గది. ఉత్తరచైనాలో చైనీయులు ఇచ్ఛవచ్చినట్లు సంచారం సాగించవచ్చును. కాని మంచూరియాలో, "నివాసపత్రాలను"- రెసిడెన్షల్ సర్టిఫికేట్సు- చూపిస్తేతప్ప, ఉత్తరచైనానుంచి మంచూరియాలో ప్రవేశించటానికి వీల్లేదు. ముక్డెన్‌లో, స్నేహితుడి ఇంట్లో ఒకరాత్రి గడపదలచుకొంటే ముందు స్థానికపోలీసులకు తెలియపర్చుకోవలసిందే.

మంచూరియానుంచి వార్తలు పైకి పొక్కనీయకుండా, కమ్యూనిస్టులు ఆంక్షలు విధించారు. ఈ "తడికలు" కట్టడానికి కారణ మేమిటో అర్థమవటంకష్టం. డైరెక్ట్, పోర్టుఆర్థర్‌లలో సోవియట్లు తిష్టవేయటం, మంచూరియానుంచి, సాధనసంపత్తిని సోవియట్లు తరలించటం, చైనాజనాభాకి తెలియనీకుండా చేయటానికి ఇది చేశారని గట్టిగా నమ్మకంకద్గ అవకాశా లున్నాయి. కాని ప్రజలలో ఈ అసంతృప్తి రేగి, వీరు పొగడుతూన్న సోవియటుమిత్రుని బండారం బైటపడ్డప్పుడు, ప్రజల ఉద్రేకానికి కమ్యూనిస్టులు భయపడకతప్పదు.

రుద్రమదేవి

(29-వ పేజీ తరువాయి)

ద్వేషమో అనుమానమో మరియేదియో విరుద్ధభావము మనస్సులలో నంకురించెను. కాని గోష్ఠీమర్యాదకు భంగముకాకుండ ప్రయత్నపూర్వకముగా నా భావము ప్రత్యక్ష మొనరింపకుండిరి.

కొంతవడికి ప్రసంగములతో నందరకు విసువు జనించెను. తెల్లవారుట కింకను ఎనిమిదిగడియల ప్రొద్దున్నట్లు రాచనగరి మోసాలపై గడియారమునుండి గంటలు వినవయ్యెను. అప్పుడు ద్యూతమునకై పలక అక్షములు తెప్పించిరి. ఆపై సుహృద్ద్యూతము సాగెను. ఇందు ముఖ్యముగా పర్వతనాయకునకు నూతనపురుషునకు స్పర్ధ యతిశయించెను.

ఇం దెంత స్పర్ధ ప్రదర్శించుచున్నను నూతనపురుషుడు మనస్సులో తొణకక పందెము లొడ్డుచుండెను. అతడు పెద్దపందెము లొడ్డడు. పర్వతనాయకుడు పెద్దపందెములు వేయును. ఆతని పందెము లెంత పెద్దవైనను నూతనపురుషుడు జంకడుకాని స్వయముగా నాతడు పెద్దపందె మొడ్డడు.

జూదములో గెలుపోటములు సామాన్యముగా అదృష్టదురదృష్టములపై నాధారపడియుండు నను ప్రథ కలదు. అది పూర్తిగా అప్రథ కాదుకాని యందులోగూడ స్థిరబుద్ధి కలవారికి గెలుచుట కెక్కువ యవకాశ మున్నది. తొందరపడువారు ఒకానొకప్పుడు విపరీతముగా గెలిచినను సామాన్యముగా నోడిపోవుదురు. తొందరపాటుచే పర్వతనాయకునికి ద్యూతక్రీడలో ఓటమియే మరలమరల సంభవించెను. ఆతనివద్ద నున్న ధనమును అమూల్యాభరణములును ఆనా డతడోడిపోయెను. అవి ఒక్కొక్కటే నూతనపురుషుని హస్తగత మగుచున్నకొలదియు నాతనికి గెలువవలె నను వాంఛ తీవ్రము కాజొచ్చెను. దానితోపాటు తొందర హెచ్చెను. అంతట మరల నోడిపోసాగెను. రిక్తుడై పర్వతనాయకుడు మాచల్దేవి నడిగి అప్పుచేసి అదియు నొడ్డి యోడిపోయెను. మరల నాతడు మాచల్దేవి నప్పడిగెను.

మాచల్దేవి యాతని గాదనకుండ వారించి తానే యా నూతనపురుషునితో సుహృద్ద్యూతమునకు గడంగెను. చిత్రముగా నాక్రీడలో మాటిమాటికి నూతనపురుషుడే విజితుడు కాసాగెను. మాచల్దేవి పర్వతనాయకు డోడిపోయిన సమస్తద్రవ్యమును ఆభరణములే కాక ఆ నూతనాగతుని ద్రవ్యముకూడ విశేష మొడుచుకొనెను.

ఆసమయమున మరల పర్వతనాయకుడు మాచల్దేవిని తనకు ద్యూతమునకు కొంత యప్పిమ్మని యడిగెను. అది విని నూతనాగతుడు ఎకసక్కెముగా "నీ నూతనోద్యోగము పణముగా పెట్టి నాతో నాడుము !" అనెను.

ఆ మాటలు వినినంతనే పర్వతనాయకుడు కోపోద్దీపితుడై నిలువునలేచెను. కుబుసముకప్పిన కాలసర్పమువలె నాతని యొరలో నున్న ఖడ్గము నాతడు చివ్వున పెరికి యా నూతనపురుషుని దానితో ప్రక్కను చరచెను. అది యాతని ఖడ్గయుద్ధమునకు ఆహ్వానించుట ! ఆ పురుషుడును వెనుకాడక నిలువున నిలుచుండి 'ఇదిగో శాస్తి చేసెదను' అనుచు తన యొరలోనుండి ఖడ్గము తీసెను.

మాచల్దేవియు నందు జేరిన నాగరకులును తీవ్రముగా అలజడి నొందిరి. ఉభయులను వారించుటకు వారెంతయు యత్నించిరి. కాని ఇద్దరును వినలేదు. నూతనపురుషుడు క్షమాపణము చెప్పుకొనడు. పర్వతనాయకుడు ఆతని అవినయము క్షమింపడు. వారి యుత్తరములతో నొకరిపై నొకరికి రోషము పెరుగసాగెను. మేచయనాయకు డందులో నెట్టి జోక్యమును కలిగించుకొనలేదు.

చంద్రాస్తమయమై చాలసేపయినది. చీకటి ఏకశిలానగర వీధుల నెల్లెడ బర్వియుండెను. కాని దివిటీల వెలుగులో మాచల్దేవి వనమంతయు దేదీప్యమానముగా వెలుగుచుండెను. అందులో విశాలమై వర్తుల మగు నొక పచ్చికబయలు వారిరువురు చేరిరి. గోష్ఠిలోని సభ్యులుగూడ వారి ననుగమించిరి.

ఆ ప్రదేశము కౌముదీనృత్యమునకు అనువుగా నిర్మించిన విశాలప్రదేశము. చుట్టును ప్రేక్షకులకు చంద్రశిలానిర్మితము లగు శిలావేదిక లున్నవి. ఆ నాట్యరంగమున నీనాడు ఖడ్గనాట్యము సాగినది.

ఇదియును క్రీడాయుద్ధము కాదు. ఒకరినొకరు జయింపవలె నను నిచ్ఛయే కాక ఒకరినొక రంతమొందింపవలె నను నిచ్ఛలతో వారిరువురు ఆ రంగములో ప్రవేశించిరి. ముందుగా వారుభయులును తమ స్వేచ్ఛచే ఆత్మగౌరవసంరక్షణార్థము ద్వంద్వయుద్ధము చేయబోవుచున్నామనియు నందులో నోడినవారిపక్షమున గెలిచినవారిపై నెట్టి చర్యయు తీసికొన నవసరము లేదనియు ఉభయులు పత్రములు వ్రాయించి మేచయయొద్ద నుంచిరి. మేచయయే వారిరువురమధ్య మధ్యవర్తిత్వము నెరపెను. ఇద్దరి ఖడ్గములు విషదిగ్ధములు కానట్లు మధ్యవర్తి స్థిరపరచు నవకాశ మప్పుడు లేకున్నందున నాతడిరువురఖడ్గములు ముందు దూరముగా పెట్టించెను. మాచల్దేవియింట పెద్ద యాయుధశాల కలదు. అందుండి మేచయ యనేకఖడ్గములను పలకలను తెప్పించి ఎవరికి కావలసినవానిని వారి నేరుకొండనెను. వారిరువురు ఎవరి కనుకూలమగు ఖడ్గము పలక వారు గ్రహించి రంగములో ప్రవేశించిరి. రంగముచుట్టును కరదీపికలు విశేషముగా పట్టించి రంగమున నెట్టి ఛాయలును పడకుండ కల్పింపబడెను.

పర్వతనాయకుడు జూదములో ప్రదర్శించిన తొందరపాటెంతమాత్రమును ఖడ్గయుద్ధములో ప్రదర్శింపలేదు. అందుకు తోడై యాతని యున్నతకాయమును ఆజానుదీర్ఘబాహువులును బహువిధముల నాతని కుపకరింపసాగెను.

నూతనపురుషుడుకూడ ఖడ్గయుద్ధములో నేర్పరియే. అతని కెన్నియో విద్యలతోపాటు ఇదికూడ నభ్యస్తమైనది. ద్యూతములో నున్న జాగరూకత ఖడ్గయుద్ధములో నేమాత్రము నతనియొద్ద గోచరింపలేదు. నేర్పుకంటెను నిలుకడకంటెను అందు రోషమే మిక్కుటమయ్యెను. అదియుగాక ఆతనికి కొంచెము వయస్సు ముదిరినట్లున్నది. యుద్ధములో శరీరపాటవముకూడ తక్కువగా కనబడుచుండెను. పావుగడియకే అతడు రొప్పసాగెను.

ఖడ్గయుద్ధవిశారదు డగు పర్వతనాయకున కాతనితో యుద్ధము క్రీడాప్రాయముగా నుండెను. యుద్ధవిద్యలో నింతటి నీచుని తన ఖడ్గముతో తెగనేయుట తనకే యవమానకర మను భావ మతని కుదయించెను. అందుచే నతని నంతమొందించు యత్నము మాని యరగడియకూడ జరుగకపూర్వమే పర్వతనాయకు డా నూతనపురుషుని హస్తములోని ఖడ్గము దూరమున బడిపోవున ట్లెగురవేసి యొక్క దాటున పైకి లంఘించి యాతని క్రింద పడద్రోచి గొమ్ముపై కా

లుంచి కోసివేయుటకు ఆతని శిరోజములు పట్టుకొనెను. చిత్రముగా నా నూతనపురుషుని శిరోజబంధమునకు పర్వతనాయకుని ఖడ్గస్పర్శ కాకముందే ఆ శిరోజము లొక కట్టుగా నాయకుని ఎడమచేతిలోనికి యూడివచ్చెను. దానితో సర్వముండితమగు నూతన పురుషుని శిరస్సు చూపర కాశ్చర్యమును అసహ్యమును కొలిపెను.


పర్వతనాయకుడు అట్లు తన చేతిలోనికి వచ్చిన యాతని నిర్జీవకృత్రిమశిరోజబంధమును వికృతాట్టహాసముతో దూరముగా వైచి పండ్లుకొరుకుచు లేచి యవి తన కాలితో మట్టగించెను. అంతలో నూతనపురుషుడు చివ్వన లేచి దూరమున బడిన తన ఖడ్గమునకై రివ్వన పరుగిడెను.

వెంటనే మేచయ యిరువుర నాగు డని యాజ్ఞాపించెను. మాచల్దేవి యెంతయేని మెలకువ చూపి యప్పటి కానూతనపురుషుని చేతికందిన ఖడ్గము ఒడిసిపట్టుకొని తీసికొనెను. ఆ పట్టులో బలమున్నది. లాలిత్య మున్నది. మూర్ఛించినను నూతనపురుషు డది లాగికొనజాలడు. చూమవారి కామె యది యాతనియొద్దనుండి మర్యాదగా తీసికొన్న ట్లున్నదికాని బలవంతముగా పుచ్చుకొన్నట్లు లేదు. మాచల్దేవికి వాక్చాతురి నృత్యచాతురితోపాటు ఆయుధ చాతురికూడ కలదా!

మేచయనాయకుడు ప్రశ్నించెను.

"మాచల్దేవీ, మా కీతనితో ముందుగా పరిచయము చేయతే దేమి?"

మాచల్దేవి బదులు చెప్పెను. "ఇతడు ఒకానొక మహానుభావుడు. మహాయోగి. భగవత్సాక్షాత్కారమే పొందె నందురు."



క్రిందటినెల బ్రిటిష్ కామన్వెల్తు శాఖామంత్రి నోయల్ బేకర్‌కు ఢిల్లీ ప్రభుత్వభవనంలో విందుజరిగింది. గవర్నర్ జనరల్ రాజాజీ ఆయనతో ప్రసంగిస్తూఉండగా, తూర్పు పంజాబ్ గవర్నర్ చందూలాల్ త్రివేది, కేంద్రరవాణామంత్రి గోపాలస్వామి అయ్యంగార్లు ప్రక్కన ఉన్నారు.

సూటి ప్రశ్న

(21-వ పేజీ తరువాయి)

అనుకోకుండా శోభకళ్లలో ఆనందాశ్రువులు తొణికినయ్.

వెళ్లనని అన్నప్పటికీ ఆనాడు అశోక్ తప్పకుండా బైటికి వెళ్లవలసినపని వుంది. నిన్ననే రాణి చాలా కటువుగా వుత్తరం రాసింది. ఆఫీసునుంచి అశోక్ సరాసరి తన దగ్గిరికి రాకపోతే ఆత్మహత్య చేసుకుంటాననికూడా రాసింది. ఆఫీసునుంచే సూటిగా రాణిదగ్గిరికి పోకుండా అశోక్ ఇంటికి వెళ్లి అక్కడినించి వెళ్దామనుకుని వచ్చాడు. కాని ఇంటిదగ్గర అనుకోకుండా ఈ ప్రతిబంధకం వచ్చిపడింది. ఎక్కడికీ వెళ్లనని శోభకి మాట ఇచ్చాడు. కాని వెళ్లకపోతే ఎల్లాగు?

ఎన్నాళ్లనుంచో నేను నీదాన్ని అని దీనంగా రాణి వుత్తరంలో విన్నవించింది. మునుపు ఆఫీసులో వున్నంతసేపూ అశోక్ ప్రాణానికి ముళ్లమీద వున్నట్లుంటేది. ఎప్పుడు వెళ్లి రాణిదగ్గర వాలుదామా అని కొట్టుకుపోయేవాడు. అటువంటివాడు రోజులతరబడి రాణికి ముఖమైనా చూపించకుండా కాలం గడుపుతున్నాడు. వారానికొకసారి దర్శనం ఇవ్వటానికైనా తనకి తీరిక లేదంటాడు. ఇదంతా తన దురదృష్టమని రాణి వుత్తరంలో వాపోయింది.


గడిచినరోజుల సంగతులతో ఆరుతావుల వుత్తరం మధురంగా దీనంగా రాసి చివరికి ఇల్లా ముగించింది. "మీకు గడిచిపోయిన మధురస్మృతులు గుర్తుచేసి లాభంలేదని నాకు తెలుసును. కాని రాయకుండా వుండటం నాకు చేతకాలేదు. కాని ఒక్క ప్రశ్నమటుకు మిమ్మల్ని అడగదలుచుకున్నాను. నా మనసు మీ వశమైనంత మాత్రాన నన్ను ఇల్లా బాధలపాలుచేయ్యటం మీకు భావ్యమేనా చెప్పండి? రేపు నా పుట్టినరోజు. రెండు నిమిషాలసేపయినా సరే మీరు వచ్చి వెళ్లండి. ఇంతమాత్రాన మీ శీలానికి కళంకం అంటుకోదనుకుంటాను."

ఉత్తరంలో సూదుల్లాగా గుచ్చుకునే సూటిపోటిమాటలు చాలా వున్నయ్. అదీకాక అశోక్‌కూడా వెళ్లాలనే గట్టిగా అనుకున్నాడు. కాని తనని ఇంతగా నమ్ముకున్న శోభని నొప్పించి వెళ్లటానికి అతనికి మనసొప్పటం లేదు. ఎటూ తెగని సందిగ్ధావస్థలో పడ్డాడు అశోక్.

ఆ సమయానికి అతని మిత్రులు అమల్, విలాన్ ఇద్దరూ వచ్చి వాకిట్లోంచి బిగ్గరగా కేకలుపెట్టారు. "కాచోండి, ఇప్పుడే వొస్తున్నాను" అని అశోక్ లోపల్నుంచి కేక వేశాడు.

బైటికివస్తూనే "ఏం పనిమీద వచ్చారు?" అని అశోక్ వాళ్ళని సూటిగా అడిగాడు.

"ఏమిటోయ్ అంత కోపం మీద వున్నావేం?" అన్నాడు అమల్. "నువ్వూరుకోవోయ్. నేను మాట్లాడుతానుగా"



ఆస్ట్రేలియా విదేశాంగమంత్రి పి. సి. స్పెండర్ ఇటీవల భారతరాజధానిలో మూడురోజులు ఉన్నారు. వారు రాజఘాట్‌కు వెళ్లి గాంధీజీ సమాధిని దర్శించారు.

అన్నాడు విలాస్. అమల్ మొరటుమనిషి కనక బిగ్గరగా "ఏముందోయ్ నువ్వు మాట్లాడేది? నేనే చెబుతాను. నాయనా అశోక్, రాణి నీకోసం బెంగపెట్టుకుంది. నిన్ను నిలుచున్నపాళాన వెంటపెట్టుకుని రమ్మని మమ్మల్ని పంపింది. త్వరగా బట్టలు వేసుకుని మంచికుర్రాడిలాగా మాతో బయలుదేరు. లేకపోతే నిన్ను ఎల్లాగో కాళ్లూచేతులూ కట్టేసిఅయినా లాక్కుని పోతాం తెలిసిందా?"

"ఇవాళ వీలులేదు. రేపు వస్తానని చెప్పండి పోండి" అన్నాడు అశోక్ చికాకుగా.

ఇవాళ నువ్వు వచ్చితీరాలి. రాకపోతే నిన్ను వదలిపెట్టం జాగర్త" అని అమల్ అరిచాడు.

అశోక్ తలవూపుతూ ఇవాళ రావటానికి వీల్లేదన్నాడు.

"నీయిష్టం వుంటే రా, లేకపోతే లేదు. మరేం బలవంతం లేదు. ఒక్కమాటమాత్రం విను. నీకోసం కలవరిస్తూ అన్నం నీళ్లూ లేక రాణి ఆనవాలుపట్టలేకుండా మారిపోయింది. ఇప్పటికైనా రావాలనిపిస్తే రా. లేకపోతే మానుకో. అదంతా నీయిష్టం." అని విలాస్ కరుకుగా అన్నాడు.

ఎటూ నిశ్చయించుకోలేక అశోక్ మనస్సులో బాధపడుతున్నాడు. ఈ మౌనానికి విసిగిపోయి అమల్ "వస్తావా రావా? ఒక్క మాట తేల్చి చెప్పు బాబూ" అని బిగ్గరగా అరిచాడు.

"కొంచెం మెల్లిగా మాట్లాడు" అంటూ అశోక్ వేలితో మేడమీదగదివేపు చూపించాడు. ఈ మాటలు భార్య ఎక్కడ వింటుందో అని అశోక్ భయపడుతున్నాడు.

అమల్ పకపక నవ్వుతూ "వింటే మునిగిపోయిం దేమిటి? మా ఆవిడకి అంతా తెలుసు. నేనే చెప్పేశాను తెలుసునా" అన్నాడు.

"ఘనకార్యం చేశావులే పూరుకో" అన్నాడు అశోక్ చికాకుగా. "అయితే నువ్వు రానట్లేగా? మమ్మల్ని వెళ్లిపొమ్మంటావా?" అని విలాస్ కోపంగా అడిగాడు.

అశోక్ అంతులేని ఆలోచనల్లోపడ్డాడు. మాటిమాటికీ శోభఅమాయకమైన కళ్ళూ అందమైన ముఖమూ మనసులో మెరసిపోతున్నయ్. చాలాసేపు మౌనంలో ఉక్కిరిబిక్కిరై చివరికి "ఏమైనాసరే నేనివాళ రాను. రేపు తప్పకుండా వస్తాను." అన్నాడు.

స్నేహితులిద్దరూ వెళ్లిపోయారు. అశోక్ మటుకు శోభగదిలోకి పోలేక పోయాడు. తన గదిలోకి వెళ్ళి పడకకుర్చీలో వాలి చేతికందిన పుస్తకమేదో తీసుకుని పేజీలు తిరగేస్తూ కూచున్నాడు.

మిత్రుల సంభాషణలో ప్రతిఅక్షరమూ శోభచెవుల్లో పడింది. అమల్ నవ్వూ, విలాస్ కటుస్వరమూ, భర్తసంకోచమూ, భయమూ, అన్నీ కలిసి శోభమనస్సుని విరిచివేసినయ్. పిడుగుదెబ్బ తిన్నట్లుగా శోభ నిర్జీవప్రతిమమాదిరిగా నిలబడిపోయింది. తన భర్తనుగురించిన సత్యం ఇంత అనుకోకుండా బైటపడి శోభని తలకిందులు చేసింది.

క్షణంలో శోభగతజీవితమంతా మిథ్యగ వంచనగా గాలిలో తేలిపోయింది. ఆమె కుటుంబజీవనంలోని సౌఖ్యం నీటిబుడగలాగా పేలిపోయింది. ఆమెభావిస్వప్నాలన్నీ పేక మేడల్లాగా కూలిపోయినయ్.

ఆక్షణంనుంచీ శోభ భర్తకంట పడకుండా ఇంట్లో నక్కుతూ తిరగటం మొదలుపెట్టింది. ఆమెధీమా అంతా అణగారిపోయింది. మర్నాడు ఎవరిముఖమూ చూడలేనంత సిగ్గుతో మగ్గిపోయింది. రాత్రిపూట భర్త గదిలోకి రాకముందే నిద్రపోయినట్లు నటించి అశోక్ ఎంతలేపినా కళ్లు తెరవలేదు.

మర్నాడు సుందరి మామూలుగా వచ్చి శోభ కనబడకపోవటంవల్ల తనదారిన తాను కాస్సేపు కునుకుతీసి వచ్చినదారినే వెళ్ళిపోయింది.

మధ్యాహ్నం భర్త ఆఫీసునుంచి ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూస్తూ కూచుంది శోభ.

ఆఫీసునుంచి వస్తూనే "ఏం నిద్ర పూర్తి అయిందా?" అని అశోక్ హేళనగా అన్నాడు.

"నేను నిద్రపోలేదే" అంది శోభ నవ్వుతూ.

"ఇప్పటి సంగతి కాదు. నిన్నటి రాత్రి మాట" అంటూ అశోక్ శోభబుజాలమీద చేతులు వేశాడు. తప్పించుకుని దూరంగా వెళ్ళి "నిన్నరాత్రి ఎందుకో వొళ్లెరగనంత నిద్రపట్టింది" అంది.

"వొంట్లో సుస్తీగా లేదుకదా?" అని ఆందోళనతో అడిగాడు అశోక్.

దీనికి బదులు చెప్పకుండా "వుండండి, టీ తెచ్చిస్తాను" అని లోపలికి వెళ్ళి కప్పులో

పోసి తెచ్చియిచ్చి "ఇప్పు డెక్కడికయినా వెళ్తున్నారా ?" అని అడిగింది.

కొంచెంసేపు తటపటాయించి "అవును. వెళ్లాలి. చాలా అవసరమైన పని వుంది" అన్నాడు. ఇవాళకూడా శోభ వుండమంటుందేమో నని భయపడి ముందుజాగ్రత్త కోసం "త్వరగా వచ్చేస్తానులే. ఎక్కువసేపు పట్టదు" అన్నాడు.

అశోక్ తొందరగా వెళ్ళిపోబోతుంటే శోభ చివాలున లేచి "ఇదేమిటి ఇల్లా వెళ్తారా బట్టలు మార్చుకోరా ? "అని అడిగింది.

"ఫరవాలేదు. ఎల్లా వెళ్తే యేం ?" అన్నాడు అశోక్ నవ్వుతూ.

అల్లా కాదని వారించి తన చేతులతో తనే అతనికి మంచి ప్రపంచా, సిల్కులాల్చీ, జరీ వుత్తరీయం, పాలిష్‌చేసిన స్లిప్పర్లూ, సెంటు రాసిన జేబురుమాల తెచ్చియిచ్చి అలంకరించింది.

అప్పుడప్పుడూ షికారుకి వెళ్లేప్పుడు భర్తని ఈవిధంగా అలంకరించటం శోభకి అలవాటు. కాపరానికి వచ్చిన కొత్తల్లో రోజూ ఇల్లాగే భర్తని అలంకరించి బైటికి పంపేది. ఈమధ్య అలవాటు తప్పిపోయింది. కాని ఇవాళ మళ్ళీ మునుపటిమాదిరిగా తనని అలంకరించటంలో శోభఉద్దేశ మేమిటో తెలియక అశోక్ తికమకపడ్డాడు. అలంకారం పూర్తి అయేదాకా శోభ తల పైకెత్తలేదు. అంతా అయినాక "భోజనం చేసే వస్తారా ఇవాళ ?" అని అడిగింది.

"అదేమిటి అల్లా అడుగుతున్నావ్ ?" అన్నాడు అశోక్ బిత్తరపోతూ.

"అఁ. యేం లేదు. మీ స్నేహితులు ఇవాళ యెవరిదో పుట్టినరోజన్నారుకదూ. అందుకని అడుగుతున్నాను."

అశోక్ముఖాన కత్తివేసినా నెత్తురు చుక్క లేదు. కొరడాదెబ్బలాగా చురుక్కున తగిలింది. తప్పించుకునే వుపాయం దొరకలేదు. వెంట ఎవరైనా తరుముకు వస్తుంటే కొంతదూరంపారిపోయి, తప్పించుకునేదారి లేక గిరుక్కున వెనక్కి తిరిగే జంతువులాగా "అవును. అయితే యేమిటి ?" అని ధిక్కారంగా అడిగాడు.

శోభ మెదలకుండా అతనికేసి చూస్తూ నిలబడిపోయింది.

"ఒక్కడికి వెళ్ళినంతమాత్రాన నా శీలం పాడైపోదులే" అన్నాడు ధీమాగా అశోక్.

ఆ మాట వినేసరికి శోభకి నవ్వొచ్చింది. "ఇన్నాళ్లూ నన్ను మోసగించారు. ఇప్పుడైనా నిజం చెప్పండి. ఒక్కసారైనా నిజం పలకండి. మీకు నేనంటే యిష్టం లేదా ? చెప్పండి" అని అడిగింది.

భార్యముందు తన బండారమంతా బైట పడిందని అశోక కోపంతోనూ అభిమానంతోనూ రగిలిపోతున్నాడు. అప్రయత్నంగా రోషంతో "ఇష్టం లేదు" అనేమాట జారి వచ్చేసింది.

"ఎందుకని ఇష్టం లేదు ? నేనంటే మొహం మొత్తిందా మీకు ?" అని శోభ టువుగా సూటిగా అడిగింది. "నాలో ఆకర్షణ లేదా ?"

ఈ విషయాన్నిగురించి అశోక్ ఆలోచించనేలేదు. ఏం జవాబు చెప్పాలో తోచలేదు. ఈమధ్యనే చదివిన ఒక నవలలోని వాక్యాలు కొన్ని స్ఫురించినయ్. అవి ఇల్లా అప్పజెప్పటం మొదలుపెట్టాడు "నేను కోరిన లక్షణాలు నీలో దొరకలేదు. నా స్వప్నాల్లో చూసిన ఆదర్శసుందరిని కనుగొంటేకాని నా తృష్ణ చల్లారదు. లోకంలో అందమైన స్త్రీల అందాలన్నిటినీ సేకరించి నిర్మిస్తేకాని నా స్వప్నసుందరిదర్శనం కాదు. ఈ దర్శనంకోసం నేను ఎందరుస్త్రీలని కలుసుకుంటే నీ కెందుకు ? నీ కేం నష్టం ? నేను నీ కేమైనా లోపం చేశానా ?"

"లేదులెండి. నాకు లోపం చేశారని నే నన్నానా ?" అంది శోభ. ఇంకొంచెం ధైర్యం తెచ్చుకుని "అయితే, ఎందుకు నీకు ?" అన్నాడు అశోక్.

"ఇవాళ నా చేతులతో అలంకరించి మిమ్మల్ని మీ ప్రియురాలిదగ్గరకి పంపిస్తున్నాను. నాకూ ఆదర్శపురుషుడిమీద తృష్ణ వుందనుకోండి. ఆ స్వప్నమూర్తిని వెతుకుతూ నేనూ వెళ్ళేటప్పుడు నన్ను మీచేతుల్తో ఇల్లా అలంకరించి పంపగలుగుతారా, చెప్పండి ?" అని శోభ గంభీరంగా అడిగింది.

ఈ అనకోని ప్రశ్నకి అశోక్ తట్టుకోలేక తారుమారైపోయి, బేజారెత్తిపోయి "ఏమిటీ ? నిన్ను అలంకరించి పంపాలా ?" అన్నాడు.

"అవును. ఇవాళ ఒకే కారులో ఇద్దరం పోతున్నామనుకోండి. ఆదర్శసుందరికోసం మీరూ, ఆదర్శసుందరుడికోసం నేనూ మీచోటికి మీరూ, నాచోటికి నేనూ పోతున్నామనుకోండి. నన్ను మీ చేత్తో అలంకరించి పంపరా మరి ?

"ఏమిటీ ఈ కారులోనే నువ్వు కూడానా ?"

"అయితేమటుకు ప్రమాద మేముందీ! "

అశోక్ అర్థంకాని అయోమయంలో పడి శోభకేసి రెప్ప వాల్చకుండా చూస్తూ నిలబడిపోయాడు. కాళ్లకింద నేల అణగారిపోతున్నట్లనిపిస్తోంది !



భారతప్రధాని ఢిల్లీలో నేషనల్ స్పోర్ట్సు స్టేడియంకు శంఖుస్థాపన జరిపారు.

స్వర్గీయ పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

శ్రీ పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారి మరణం ఈనాటి ఆంధ్రసాహిత్యానికి దురదృష్టమే.

నేటి విమర్శకలోకంలో ఆయన దొక విశిష్టస్థానము. ఈ స్థానానికి వారు పోటీచేసి సాధించితీరుదామని ప్రయత్నం చెయ్యలేదు. స్వతః వారిబుద్ధి సునిశితమైనది. తద్వారా ఆ స్థానం శాస్త్రిగారికి దఖలు పడ్డది. చిన్ననాడు శొంఠి భద్రాద్రిశాస్త్రుల వారివద్ద కూలంకషంగా సంస్కృతం అభ్యసించి, ఆనాడు ఉపాధ్యాయవృత్తిలోని గౌరవమూ, పల్లెటూరి జీవనములోని ఆర్థిక లాభమూ గమనించి హైయ్యరుపరీక్ష నిచ్చివేశారు; వేటపాలెము ఎలిమెంటరీపాఠశాలలో శాస్త్రిగారు ఉపాధ్యాయపదవిలో ప్రవేశించారు. 8 రూ. జీతమైనా అప్పటి రోజుల్లో అదొక పదవిలాగే ఉంటూండేది. అక్కడి వాతావరణము వారిని ముందుకు తీసుకువచ్చేది కాకపోవడము, ముందుముందు విమర్శరంగంలో వారు చేయవలసిన కృషి ఉండడమూ, క్రమంగా బందరుజాతీయకళాశాలలోకి వారిని వెళ్లేటట్లు చేశాయి. బందరుకళాశాలలో గ్రంథాలయము, శ్రీ పట్టాభి, కోపల్లె హనుమంతరావుగార్ల వంటి జాతీయనాయకుల పరిచయము శాస్త్రిగారిని ఉన్నతస్థితికి తీసుకొనివచ్చాయి. కాకినాడ కాలేజీలో ఉండగా బ్రహ్మర్షి వెంకటరత్నంనాయుడు, దుగ్గిరాల సూర్యప్రకాశరావుగార్ల వంటి సంస్కర్తల సహవాసంతో వారి ఆశయాలకు ఒక రూపు ఏర్పడ్డది. అప్పుడే వారు భారతవిమర్శ, పరీక్షిత్తుమున్నగు విమర్శగ్రంథాలు ప్రకటించడం జరిగింది. దానితో శాస్త్రిగారి ప్రతిభ ఆంధ్రలోకానికి స్పష్టమైనది.

శాస్త్రిగారు వీరేశలింగంపంతులు గారి వంటి సంస్కర్తలు కారు. కాశీభట్లబ్రహ్మయ్యశాస్త్రిగారివంటి సనాతనులున్నూ కారు. వారిరెండుమార్గాలు మేళవించి, ప్రాచీననవీన సంప్రదాయాలు గ్రహించి మెలిగేతత్వం శాస్త్రిగారిపంథాగా ఏర్పడ్డది. "పురాణమిత్యేవ నసాధుసర్వం, నచాపికావ్యం నవమిత్యవద్యం" అనే కాళిదాసనూక్తిని సారకం చేసినవారు శాస్త్రిగా రనవచ్చును. కానీ దానివలన శాస్త్రిగారికి కలిగిన నష్టాలు అపరిమితము. సనాతనులు నవీనులూ కూడా వీరిని తమతో చేర్చుకోలేదు. ఫలితము "మురారేస్తృతీయః పంథాః" కావడమే కాకుండా ఆమార్గంలో తమ ప్రత్యేకతను శాస్త్రిగారు నిలబెట్టుకొన్నారు.

వీరు కావించిన భారతకృషి హద్దులేనిది. సంస్కృతభారతాన్ని నవీనదృష్టిపథంతో పఠించిన ఆంధ్రులు వీరొక్కరే అనడము అతిశయోక్తి కాదు. భారతాన్ని ఎన్ని పర్యాయాలు ఆమ్నాయం చేశారో లెక్కలేదు. ఆవిధంగా భారతామ్నాయాన్ని మథించి ఆంధ్రులకు భారతంపై విమర్శకు దారిచూపారు. వీరి భారతవిమర్శ వెలువడే నాటికి సంస్కృతభారతంపై గాని తెనుగు భారతంపైగాని వచ్చిన విమర్శగ్రంథాలు చాలా తక్కువ. అవి ఉన్నా లేనివంటివే. శాస్త్రిగారు భారతవిమర్శలో పేర్కొన్నట్లు సుయోధనవిజయం; పాండవదాయభాగంపై చర్చమున్నగు ఏకొద్దిరచనలో కనిపిస్తాయి. వీరి గ్రంథంతరువాత ఖండనమండనాలు అనేకం ఉద్భవించాయి; ఉద్భవిస్తున్నవి.

శాస్త్రిగారి విమర్శ సమగ్రము కాకపోవచ్చు; దోషరహితమనడానికి అభ్యంతరాలు అనేకం ఉండవచ్చు. పండితులకు ఆమోదయోగ్యం కాకపోవచ్చు. నవీనులకు అనువాదప్రాయం కావచ్చు. కాని విఘ్నేశ్వరుడు భారతలేఖకుడు కాడని, వ్యాసబాదరాయణులు భిన్నవ్యక్తులని, రాజసూయంలో శిశుపాలుడు యాగపశువుఅయినాడని, జనమేజయుని సర్పయాగంలో బలియైనది నాగజాతిమనుష్యులేనని,-ఇంకా ఇలాంటివి ఎన్నో భారతీయుల నమ్మకకు విరుద్ధమైనవి, చిత్రమైనవిఅయిన క్రొత్తఅంశాలు ఆంధ్రులకు అందించడంతో ఆంధ్రసాహిత్యంలో విప్లవబుద్ధి రేకెత్తించి శాస్త్రిగారు ధన్యజీవు లయినారు.

భారతదేశంలోని మహారచయితల కృషిని ప్రకటించే ప్రయత్నంలో పంజాబువారు వీరి జీవితవిశేషాలు సంగ్రహించారు.

శాస్త్రిగారి జీవితకథ తెనుగులో కూడా ఉండడం అత్యవసరము. అందుకుగ్గ కృషి జరగగలదని ఆశిస్తున్నాను.

లీలావతి


(18 వ-పేజీ తరువాయి)

గిన్నెలో పడి రంధ్రమును మూసివేసెను. అందువలన నీరు పైకి రాకుండెను. అందరు గిన్నెయెప్పుడు మునుగునాయని చూచుచుండిరి కాని గిన్నె మునగలేదు. చాలా సమయము గడచిపోయెను. అపుడు పెద్దలు లేచి చూడగా ముత్యము రంధ్రమున కడ్డముగా నుండెను. భాస్కరాచార్యునకు చాలా విచారము కలిగెను. మంచిముహూర్తము దాటిపోయె నని తెలిసికొన చాలా విచారించి ఆమెకు వివాహము చేసెను. వివాహమైన కొన్నిదినములకే ఆమెభర్త గతించెను. ఆచార్యుడు ఆమెకు జ్యోతిష్యమును, గణితమును నేర్పుచుండెను. కొద్దికాలమునకే లీలావతి ఈ రెండువిద్యలలోను పండితురాలాయెను. ఈమెకు గణితములో నెక్కువ నేర్పరితనము కలదు. ఈమె చెట్టును చూచి చెట్టు ఆకుల సంఖ్యకూడా చెప్పగల్గెడిదట. భాస్కరాచార్యుడు ఈమెకు నేర్పిన గణితమును లీలావతిగణితమని పెద్దలు చెప్పుదురు. ఇందులో ప్రశ్నలు, జవాబులు, కష్టమైన లెక్కలు గలవు. దీనిని ఇంగ్లీషులోనికిని, పారశీకభాషలోనికిని మార్చిరి. పూర్వము మనలో గణితశాస్త్రములో కూడా గొప్ప పండితులు గలరని లీలావతి చరిత్ర వలన తెలియుచున్నది.



తిరుపతిలో భారతరిపబ్లిక్ అవతరణోత్సవం : ఏనుగుపై రాజేంద్రబాబు, గాంధి, నెహ్రూ చిత్రాలను ఊరేగింపు జరుపుతున్నప్పటి దృశ్యం.

మచిలీపట్నంలో తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెస్ కార్యాలయమున రిపబ్లిక్ అవతరణ దినోత్సవం సందర్భంలో
కృష్ణాజిల్లాబోర్డు అధ్యక్షుడు కాకాని వెంకటరత్నంగారు పతాక నెగురవేసిన దృశ్యం.



Regd. No. M. 4479.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. 7· Thambu Chetty St., Madras·